అక్షర విజేత
Email: vijethatelugudaily@gmail.com
రిపోర్టర్స్ కావలెను
కరీంనగర్ జిల్లాలో : కరీంనగర్ కలెక్టరేట్, కరీంనగర్ క్రైం, కరీంనగర్ సిటీ, శాతవాహన యూనివర్సిటీ, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, గంగాధర, చొప్పదండి, ఇల్లందకుంట, జమ్మికుంట టౌన్, జమ్మికుంట రూరల్, సైదాపూర్,
సిరిసిల్ల జిల్లాలో : సిరిసిల్ల, సిరిసిల్ల టౌన్, సిరిసిల్ల రూరల్, సిరిసిల్ల కలెక్టరేట్, సిరిసిల్ల క్రైం, తంగళ్ళపల్లి, గంభీర్‌రావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, బోయిన్‌పల్లి,
పెద్దపల్లి జిల్లాలో : పెద్దపల్లి క్రైం, ఎలిగేడు, కమాన్‌పూర్, యైటిన్‌క్లయిన్‌కాలనీ, మంథని టౌన్, మంథని రూరల్, గోదావరిఖని, గోదావరిఖని టౌన్, గోదావరిఖని క్రైం, గోదావరిఖని రూరల్,
జగిత్యాల జిల్లాలో : జగిత్యాల రూరల్, జగిత్యాల క్రైం, ధర్మపురి రూరల్, బుగ్గారం, వెల్గటూర్, మెట్‌పల్లి టౌన్, మేడిపల్లి,
బి. అనిల్‌కుమార్, ఎడిటర్
77028 66885

తెలుగు జాతీయ దినపత్రిక
# అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక

B. ANIL KUMAR
CHAIRMAN & CHIEF EDITER
7702866885
9059324231
RNI TELTEL/2021/81079
తెలుగు జాతీయ దినపత్రిక
అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక
DAIWIK PUBLICATIONS & BROADCASTING PVT. LTD.
www.aksharavijetha.com., epaper.aksharavijetha.com
email : vijethatelugudaily@gmail.com
కావలెను
విజేత ఛానల్‌లో పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి విలేకరులు, యాంకర్లు, న్యూస్ ఎడిటర్లు, కంటెంట్ రైటర్స్, కెమెరా మెన్, మరియు స్టూడియోలో పనిచేయుటకు స్త్రీ & పురుష సిబ్బంది కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఉంటుంది.
సంప్రదించుటకు : 7702866885, 9059324231

హైదరాబాద్ సంపుటి:05 సంచిక :250 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 12, వెల. 6రూ/ బుధవారం- 18 - మార్చి - 2026

## ఈవీఎంలు మార్చేశారని దొంగ ఏడుపులు ఏడ్చారు కదా... ఇప్పుడు మద్దత్వివండి!:



వైసీపీ నేతలు ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, దానిపై నిజాయతీ ఉంటే తమ ఎంపీలతో అభిశంసన తీర్మానంపై సంతకాలు చేయించాలని షర్మిల అన్నారు.

"రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని దొంగ ఏడుపులు ఏడ్చారు కదా.

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్యలపై జగన్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్వర్‌పై 'ఇండియా' కూటమి ప్రతిపాదించిన అభిశంసన తీర్మానానికి మద్దతు ఇవ్వాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సవాల్ విసిరారు. విజయనగరం జిల్లా జామిలో పర్యటించిన ఆమె, ఈ మేరకు వైసీపీ అధినేత జగన్ ను డిమాండ్ చేశారు. మిగతా..2లో

## ఈ అమ్మాయిలు నిజం కాదు.. వారి ట్రాప్‌లో పడకండి: సజ్జనార్ హెచ్చరిక




హైదరాబాద్: 'మీరు ఒంటరిగా ఉంటున్నారా, ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మాట్లాడుకోండి" అంటూ అమ్మాయిలు చెబుతున్నట్లుగా ఉన్న వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. యువత ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు హనీట్రాప్ చేస్తున్నారని, ఏఐ జనరేటెడ్ వీడియోల ద్వారా ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారని సూచించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా యువతకు సూచన చేశారు. "ఒంటరిగా ఉన్నారా? ఇంకెందుకు ఆలస్యం, ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి. అందమైన అమ్మాయిలు, ఆంటీలతో సరదాగా మాట్లాడండి. మీ రంగు, రూపంతో మాకు పనిలేదు" అంటూ సోషల్ మీడియాలో ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తున్న ఈ యాడ్స్ వెనుక ఉన్నది తీయటి మాటలు కాదని, నిలువునా దోచేసే సైబర్ కేటుగాళ్ల ఉచ్చు అని పేర్కొన్నారు. ఈ వీడియోల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్న అమ్మాయిలు నిజం కాదని, అవన్నీ ఏఐ సాయంతో సృష్టించిన వీడియోలు అని తెలిపారు. మాయమాటలకు మిగతా..2లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు


2

- ★ పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు.
- ★ ముఖ్యమంత్రి హార్వర్డ్ లో చాలా నేర్చుకున్నారని, ఆ ఖర్చును కూడా ప్రభుత్వమే భరించిందని ఎద్దేవా చేశారు.

హైదరాబాద్: దానం నాగేందర్ తమ పార్టీ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా గెలుపొంది, ఆ తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శాసనసభలో ఆయన పార్టీ ఫిరాయింపులపై మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ స్పీకర్ ఆయనకు

# మహిళలపై కేటీఆర్‌కు చిన్నచూపు: మంత్రి సీతక్క



- మహిళల పట్ల కేటీఆర్‌కు చిన్నచూపు ఉందని, బయటి మహిళలైనా లేదా సొంత కుటుంబ సభ్యులైనా సరే..
- అసలు పదేళ్ల పాటు మంత్రిగా ఉండి మహిళల కోసం ఆయన ఏం చేశారో చెప్పాలని నిలదీశారు.
- మహిళా సంఘాలపై రూ.3,000 కోట్ల భారం వేసి పోయిందని సీతక్క ఆరోపించారు.
- బీఆర్ఎస్ హయాంలో పావలా వడ్డీ పథకం కూడా సరిగ్గా ఇవ్వలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులపై హేళన

హైదరాబాద్ : తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరును మంత్రి సీతక్క తీవ్రంగా తప్పుపట్టారు. మహిళల పట్ల కేటీఆర్‌కు చిన్నచూపు ఉందని, బయటి మహిళలైనా లేదా సొంత కుటుంబ సభ్యులైనా సరే.. వారిని ఎదగనివ్వాలనే ఆలోచన ఆయనకు లేదని చురకలంటించారు. ఉచిత బస్సు ప్రయాణంపై కేటీఆర్ గతంలో చేసిన సెటైర్లను, తప్పుడు ప్రచారాన్ని ఆమె ఈ సందర్భంగా ఎండగట్టారు. మిగతా..2లో

## డ్రగ్స్ టెస్టులకు రేవంత్ రెడ్డి సిద్ధం... కేసీఆర్, కేటీఆర్ వస్తారా?

- తెలంగాణ శాసనమండలి వేదికగా డ్రగ్స్ వ్యవహారంపై ఎమ్మెల్సీ, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో స్పందించారు.
- రాష్ట్రంలో గంజాయి, కొకైన్ విచ్చలవిడిగా దొరకడానికి గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనే కారణమని ఆయన ధ్వజమెత్తారు.



హైదరాబాద్: రాష్ట్రంలో బిస్కెట్లు, చాక్లెట్ల మాదిరి డ్రగ్స్ లభిస్తున్నాయని, కొందరు నాయకులు స్వయంగా డ్రగ్స్ వ్యాపారం చేయడం సిగ్గుచేటని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. డ్రగ్ టెస్టులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని... మరి ప్రతిపక్ష నేత కేసీఆర్, కేటీఆర్ ముందుకు వస్తారా అని ఆయన ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. "మీరు అంగీకరిస్తే రేపే ముహూర్తం పెడదాం, ముఖ్యమంత్రిని ఒప్పించే బాధ్యత నాది" అని సవాల్ చేశారు. ప్రజాప్రతినిధులందరూ పరీక్షలు చేయించుకుని సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ తరపున బీ-ఫామ్స్ అందుకున్న వారందరినీ తాము టెస్టులకు తీసుకువస్తామని, అదే ధైర్యం ఉంటే బీఆర్ఎస్ కూడా వారి సభ్యులను తీసుకురావాలని డిమాండ్ చేశారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో పట్టుబడింది మీ నాయకుడు కాదా అని ప్రశ్నిస్తూ, డ్రగ్స్ మాటెత్తగానే బీఆర్ఎస్ నాయకుల పేర్లే ఎందుకు బయటకు వస్తున్నాయని నిలదీశారు. పదేళ్లలో రాష్ట్రంలో మాదకద్రవ్యాల సరఫరా విచ్చలవిడిగా జరిగిందని పేర్కొన్నారు. మిగతా..2లో

## ఆ నిబంధన సరికాదు'- ప్రసూతి సెలవులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు


2

- ★ దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే ఎక్కువగా ఉంటే ప్రసూతి సెలవులను నిరాకరించడం సరికాదని సుప్రీం వ్యాఖ్య
- ★ పితృత్వ సెలవులను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన

ఢిల్లీ : చిన్నారులను దత్తత తీసుకునే మహిళలకు సంబంధించి ప్రసూతి సెలవుల విషయంలో

## పాక్‌ను అంతర్జాతీయ సమాజం 'జవాబుదారీగా చేయాలి'

### దాడిని ఖండించిన భారత్

- ❖ మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా చెప్పుకునేందుకు పాకిస్థాన్ యత్నిస్తోందని భారత విదేశాంగ శాఖ విమర్శ
- ❖ పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని డిమాండ్



ఢిల్లీ : అఫ్ఘనిస్థాన్ లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. సైనిక స్థావరంగా ఏమాత్రం సమర్థించుకోలేని ఆస్పత్రిపై దాడి చేసి, పెద్ద సంఖ్యలో పౌరుల ప్రాణాలను బలిగొనడం అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య అని మండిపడింది. ఈ మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా చెప్పుకునేందుకు పాకిస్థాన్ యత్నిస్తోందని భారత విదేశాంగ శాఖ విమర్శించింది. ఈ హేయమైన చర్య ప్రాంతీయ శాంతిభద్రతలకు ప్రత్యక్ష ముప్పుని పేర్కొంది. అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సరిహద్దు వెలుపల హింసకు పాల్పడటం పాక్ బరితెగింపు ధోరణికి అద్దంపట్టిందని ధ్వజమెత్తింది. ఆస్పత్రిని ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడాన్ని మిగతా..2లో

## ఇరాన్ యుద్ధం.. భారత్ జోక్యం చేసుకుంటే పరిస్థితులు సద్దుమణుగుతాయి

అమెరికా, ఇరాన్‌ల మధ్య తీవ్రమవుతున్న యుద్ధానికి భారతదేశమే ఏకైక విశ్వసనీయ పరిష్కార మార్గమని, ఉద్రిక్తతలను తగ్గించడంలో న్యూఢిల్లీ దౌత్యపరమైన పాత్ర పోషించాలని ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ పేర్కొన్నారు.



ఢిల్లీ : అమెరికా, ఇరాన్‌ల మధ్య తీవ్రమవుతున్న యుద్ధానికి భారతదేశమే ఏకైక విశ్వసనీయ పరిష్కార మార్గమని, ఉద్రిక్తతలను తగ్గించడంలో న్యూఢిల్లీ దౌత్యపరమైన పాత్ర పోషించాలని ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ పేర్కొన్నారు. భారతదేశంలో తన అధికారిక పర్యటన (మార్చి 4 నుంచి 7) ముగించుకుని తిరిగి వెళ్లిన అలెగ్జాండర్ స్టబ్ తాజాగా ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. మధ్యప్రాచ్యంలో 18 రోజుల సంఘర్షణ ప్రపంచ విపత్తుగా మారకుండా నిరోధించడం కోసం భారత్ తన ప్రత్యేక స్థానాన్ని ఉపయోగించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు అమెరికా, ఇరాన్ మధ్య శాంతి మధ్యవర్తిత్వం చేయడంలో భారతదేశం సహాయపడగలదని ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ అభిప్రాయపడ్డారు. 'మనందరికీ మిగతా..2లో

## జగన్ చేయగలిగింది బాబు ఎందుకు చేయలేకపోతున్నాడనే చర్చ


2

- ★ వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్ అని... విలువలు, విశ్వసనీయతే పార్టీకి పునాదులని ఆయన అన్నారు.
- ★ అధికారంలో ఉన్నప్పుడు కోవిడ్ వంటి కష్టాలు ఎదురైనా, ఆర్థిక ఒత్తిళ్ల మధ్య కూడా ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం అమలు చేశామని

## గ్యాస్ నిల్వలు ఉన్నాయి
# ఇండక్షన్ స్టవ్స్ వాడేలా చూడాలి

### రానున్న రోజుల్లో గ్యాస్ దొరకదేమోనన్న టెన్షన్ మాత్రం ప్రజల్లో ఉంది.

సీఎం సమీక్షలో పాల్గొన్న పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ అధికారులు

రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఇబ్బందులు లేవన్న సీఎం

మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి



అమరావతి : పశ్చిమాసియా యుద్ధ నేపథ్యంలో గ్యాస్ సరఫరాపై ప్రభావం పడింది. ఇప్పటికి ఇళ్లలో వాడుకునే సిలిండర్లపై లేకున్నా కమర్షియల్ సిలిండర్ల కొరత కొనసాగుతోంది. అయితే రానున్న రోజుల్లో గ్యాస్ దొరకదేమోనన్న టెన్షన్ మాత్రం ప్రజల్లో ఉంది. దీంతో అందరూ గ్యాస్ సిలిండర్ల కోసం గోడౌన్లు, గ్యాస్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఇదిలావుంటే ఈకేవైసీ, ఓటీపీల ద్వారా మిగతా..2లో

## తప్పు రిపీట్ అయితే కఠిన చర్యలు తీసుకుంటా


2 లో

- పప్పు పునరావృతం అయినా కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- ఇకపై భోజనం నాణ్యతపై 'లీప్' యాప్ ద్వారా తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకుంటామని, మరోసారి ఇలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.

అమరావతి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా,

మొదటి పేజి తరువాయి

## జగన్ చేయగలిగింది బాబు ఎందుకు
# చేయలేకపోతున్నాడనే చర్చ

అమరావతి: తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నేడు ఒంగోలు నియోజకవర్గ కేడర్‌తో భేటీ అయిన వైసీపీ అధినేత జగన్... కూటమి ప్రభుత్వంపై తన విమర్శనాస్త్రాలకు మరింత పదును పెట్టారు. వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్ అని... విలువలు, విశ్వసనీయతే పార్టీకి పునాదులని ఆయన అన్నారు. తమ ఐదేళ్ల పాలనకు, ప్రస్తుత చంద్రబాబు పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు ఇప్పటికే గమనిస్తున్నారని జగన్ పేర్కొన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కోవిడ్ వంటి కష్టాలు ఎదురైనా, ఆర్థిక ఒత్తిళ్ల మధ్య కూడా ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం అమలు చేశామని గుర్తు చేశారు. సుమారు రూ. 2.7 లక్షల కోట్లను నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి చేరవేశామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే అప్పులు రూ. 3.30 లక్షల కోట్లు దాటాయని విమర్శించారు. జగన్ చేయగలిగింది బాబు ఎందుకు చేయలేకపోతున్నాడు? అనే చర్చ ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ జరుగుతోందని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'దోచుకో.. పంచుకో.. తినుకో..' అనే విధానం సాగుతోందని, అమరావతి పనుల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం రావడం లేదని, ఆర్థిక పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అవినీతి కోసమే వారు అధికారంలో ఉన్నారని, ఎన్నికల హామీలను గాలికొదిలేశారని మండిపడ్డారు. ఈ భేటీలో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వంటి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## మహిళలపై కేటీఆర్‌కు చిన్నచూపు: మంత్రి సీతక్క

అసలు పదేళ్ల పాటు మంత్రిగా ఉండి మహిళల కోసం ఆయన ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు చెందిన 'అభయ హస్తం' నిధులను కూడా వాడుకుందని, మహిళా సంఘాలపై రూ.3,000 కోట్ల భారం వేసి పోయిందని సీతక్క ఆరోపించారు. తాము శ్రీనిధి ద్వారా వడ్డీ లేని రుణాలు ఇస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. మరోవైపు మంత్రి శ్రీధర్ బాబు కూడా కేటీఆర్ పై మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు గోబెల్స్ ప్రచారంలో ప్రపంచంలోనే అందరికంటే ముందుంటారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకపోతే మీరు ఎక్కడ ఉండేవారో ఆత్మపరిశీలన చేసుకోవాలని ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో పావలా వడ్డీ పథకం కూడా సరిగ్గా ఇవ్వలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులపై హేళనగా మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

## ఇరాన్ యుద్ధం.. భారత్ జోక్యం చేసుకుంటే
# పరిస్థితులు సద్దుమణుగుతాయి

కాల్పుల విరమణ అవసరం. భారత్ నిజంగా ఇందులో జోక్యం చేసుకోగలదా అని నేను ఆలోచిస్తున్నాను. పరిస్థితులను చక్కదిద్దడానికి విదేశాంగ మంత్రి జైశంకర్ కాల్పుల విరమణకు పిలుపునివ్వడం మనం చూశాం' అని స్టబ్ అన్నారు. భారత్‌కు అటు అమెరికా, ఇజ్రాయెల్‌తోనూ, మరోవైపు ఇరాన్‌తోనూ స్నేహ సంబంధాలున్నాయని గుర్తు చేశారు. ఇరు పక్షాలు న్యూఢిల్లీ పట్ల నమ్మకంగా ఉంటాయని అన్నారు కాగా, ఈ సమస్య నుంచి ప్రపంచాన్ని భారత్ మాత్రమే కాపాడగలదని అమెరికాకు చెందిన అనుభవజ్ఞుడైన వ్యూహకర్త, విశ్రాంత యూఎస్ ఆర్మీ కల్నల్ డగ్లస్ మాక్‌గ్రెగర్ కూడా అభిప్రాయపడ్డారు ఈ విపత్కర పరిస్థితుల నుంచి బయటపడటానికి భారతదేశం వైపు చూడాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు బహిరంగంగా సలహా ఇచ్చారు. అమెరికా క్షిపణి నిల్వలు తరిగిపోతున్నాయని, మరోవైపు చమురు సంక్షోభం పెరుగుతోందని, వీటిని నివారించడానికి దౌత్యపరమైన నిష్క్రమణే ఏకైక మార్గమని మాక్‌గ్రెగర్ హెచ్చరించారు. 'యుద్ధం ఆగాలంటే.. అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీకి ఫోన్ చేయాలి' అని సూచించారు.

## ఈ అమ్మాయిలు నిజం కాదు..
## వారి ట్రాప్‌లో పడకండి: సజ్జనార్ హెచ్చరిక

బుట్టలోపడి వారు సూచించిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుంటే ముప్పు కొనితెచ్చుకున్నట్లేనని హెచ్చరించారు. ఆ లింక్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే, మీ ఫోన్‌లోని కాంటాక్ట్స్, గ్యాలరీ మొత్తం వారి అధీనంలోకి వెళ్లిపోతాయని అన్నారు. ఇక రాత్రిపూట సరదాగా మాట్లాడదామని వీడియో కాల్ చేస్తే అవతలి వైపు న్యూడ్ వీడియోలు ప్లే చేసి, స్క్రీన్‌పై ఉన్న మీ ముఖాన్ని రికార్డ్ చేస్తారని, ఆ తర్వాత దాన్ని మార్ఫింగ్ చేసి, మీ కాంటాక్ట్ లిస్ట్‌లోని బంధుమిత్రులకు పంపుతామంటూ బ్లాక్‌మెయిలింగ్ కు దిగుతారని హెచ్చరించారు. పరువు పోతుందన్న భయంతో వారు అడిగినంత ఇచ్చుకుంటూ పోతే మీ బ్యాంకు ఖాతాలు ఖాళీ అవ్వడం ఖాయమని సజ్జనార్ పేర్కొన్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి మోసపూరిత ప్రకటనలు ఇస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఎవరూ మీకు ఊరికే స్నేహితులు కాబోరని, ఆ ఆకర్షణ వెనుక మీ డబ్బు, పరువు లాగేసే భారీ కుట్ర దాగి ఉందని గ్రహించాలని అన్నారు. క్షణికావేశంలో గుర్తుతెలియని ఫేక్ డేటింగ్, వీడియో కాలింగ్ యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. రాత్రి వేళల్లోనే ఈ యాడ్స్ దర్శనమిస్తున్నాయని... జాగ్రత్తగా ఉండండని యువతకు సూచన చేశారు. ఒకవేళ ఇప్పటికే ఎవరైనా ఇలాంటి సైబర్ వలలో చిక్కుకుంటే, పరువుపోతుందేమో అని భయపడవద్దని, వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయండి లేదా పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం
## నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు

అనుకూలంగా తీర్పు ఇచ్చారని అన్నారు. తీర్పు తప్పుగా ఉన్నప్పటికీ, తాము స్పీకర్‌ను గౌరవిస్తున్నామని అన్నారు. పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తమ పార్టీ నాయకులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, బాల్క సుమన్‌లపై దాడులు జరిగాయని, హరీశ్ రావు క్యాంపు కార్యాలయం, తన క్యాంపు కార్యాలయంపై కూడా దాడులు జరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 67 వేల ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటోందని, కానీ ఇచ్చింది 11 వేల ఉద్యోగాలే అన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా చెప్పిన జాబ్ క్యాలెండర్ ఉత్తుత్తి క్యాలెండర్ అయిందని విమర్శించారు. ఏ గ్రామంలో అయినా సంపూర్ణ రుణమాఫీ అయినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ముఖ్యమంత్రి హార్వర్డ్ లో చాలా నేర్చుకున్నారని, ఆ ఖర్చును కూడా ప్రభుత్వమే భరించిందని ఎద్దేవా చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్సుమెంట్స్ ఎప్పుడు విడుదల చేస్తారని ప్రశ్నించారు. గట్టిగా అడిగితే బెదిరింపులు తప్ప ఏమీ లేదని అన్నారు. ఉచిత బస్సు పథకానికి తాము వ్యతిరేకం కాదని, కానీ బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్క ఇటుక పెట్టలేదు కానీ కూల్చివేతలు మాత్రం జరుగుతున్నాయని అన్నారు. శారదా పీఠానికి ఇచ్చిన భూములు కూడా వదలడం లేదని అన్నారు.

## డ్రగ్స్ టెస్టులకు రేవంత్ రెడ్డి సిద్ధం...
# కేసీఆర్, కేటీఆర్ వస్తారా?

మాజీ ఎమ్మెల్యే డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడితే పార్టీ ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఈగల్ టీమ్'ను ఏర్పాటు చేసి పరిస్థితిని చక్కదిద్దుతున్నారని, గతంలో టెస్టులకు భయపడి పారిపోయిన వారు ఎవరో ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. ఒకవైపు పైలట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ షోకాజ్ నోటీసు జారీ చేయడం, మరోవైపు మండలిలో మహేశ్ కుమార్ గౌడ్ విసిరిన ఈ 'డ్రగ్ టెస్ట్' ఛాలెంజ్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించాయి.

## ఈవీఎంలు మార్చేశారని దొంగ ఏడుపులు
## ఏడ్చారు కదా... ఇప్పుడు మద్దత్వివండి!: షర్మిల



ఎన్నికల్లో ఈవీఎంలు మార్చేశారంటూ వైసీపీ నేతలు ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, దానిపై నిజాయతీ ఉంటే తమ ఎంపీలతో అభిశంసన తీర్మానంపై సంతకాలు చేయించాలని షర్మిల అన్నారు. "రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని దొంగ ఏడుపులు ఏడ్చారు కదా. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇండియా కూటమి పెట్టే తీర్మానానికి మద్దతు ప్రకటించాలి. మోదీకి దత్తపుత్రుడు కాదని నిరూపించుకోవాలి" అని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ ఎన్నికల సంఘాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్నారని, రాజ్యాంగ విరుద్ధంగా నడిపిస్తున్నారని షర్మిల ఆరోపించారు. జగన్‌కు నిజంగా ధైర్యం ఉంటే, వైసీపీ ఎంపీల మద్దతును వెంటనే ప్రకటించాలని ఆమె స్పష్టం చేశారు.

# గ్యాస్ నిల్వలు ఉన్నాయి - ఇండక్షన్ స్టవ్స్ వాడేలా చూడాలి

మొదటి పేజి తరువాయి



గ్యాస్ సిలిండర్ల డైవర్షన్ లేకుండా, ప్రజలు ప్యానిక్ కాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్స్ స్టాక్స్ లభ్యత పెరిగేలా చూడాలని సూచించారు. గ్యాస్ కంపెనీలు స్వల్పకాలికంగా ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా చూడాలన్నారు. రాష్ట్రంలో మరింతగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ విస్తరించే అంశంపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని కేజీ బేసిన్ లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్ వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసేలా చూడాలన్నారు. సీఎన్ జీ, పీఎన్జీల వినియోగాన్ని గరిష్టంగా పెంచేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని సీఎం ఆదేశించారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు: ఆర్టీజీఎస్ నుంచి గ్యాస్ సరఫరా అంశంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సీఎస్ సాయిప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ అధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 14 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలున్నాయి అని సీఎం తెలిపారు. మరికొన్ని మెట్రిక్ టన్నుల గ్యాస్ అందుబాటులోకి రానున్నాయన్నారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. ఆస్పత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు ఎలాంటి కొరతా లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేయాలన్నారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇదిలా ఉండగా మరోవైపు ఎల్పీజీ సిలిండర్లు బ్లాక్ మార్కెట్ కు తరలిపోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతి వినియోగదారుడి నుంచి ఓటీపీ తీసుకునే విధానాన్ని అవలంభించడం ద్వారా డొమెస్టిక్ సిలిండర్లు దుర్వినియోగం కాకుండా చూస్తున్నామని అధికారులు చెప్పారు. హెచ్‌పీసీఎల్ సంస్థ 90 శాతానికి పైగా ఓటీపీలతోనే గ్యాస్ సరఫరా చేస్తోందని ఆ తర్వాత స్థానాల్లో బీపీసీఎల్, ఐఓసీఎల్ ఉన్నాయని అధికారులు తెలిపారు. ఓటీపీల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల ద్వారా సమన్వయం చేసుకుంటూ ఆర్టీజీఎస్ నుంచి సాంకేతిక సాయాన్ని ఆయా గ్యాస్ సరఫరా కంపెనీలకు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు సీఎంకు తెలిపారు. గ్యాస్ డెలివరి విషయంలో సిలిండర్ల దుర్వినియోగం కాకుండా టెక్నాలజీని ఉపయోగించి పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలో సాధారణ పరిస్థితుల్లో ఒకటిన్నర రోజుల్లోనే డెలివరి జరిగేదని కానీ ఇప్పుడు రెండున్నర రోజులు పడుతుందని అధికారులు వెల్లడించారు. గతంతో పోల్చుకుంటే రీఫిల్ బుకింగ్ గడవు పెరిగిందని ఇలాంటి సమయంలో గతంలో మాదిరిగానే డెలివరిని ఒకటిన్నర రోజుల్లోనే అందించగలిగితే ప్రజల్లో గ్యాస్ సరఫరా విషయంలో ఆందోళన ఉండదని సూచించారు. ఎల్పీజీ సరఫరా విషయంలో ప్రజల్లోని ఆందోళనలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టళ్లు వంటి వాటిల్లో కూడా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఇక ఎల్పీజీ వినియోగం తగ్గించుకునేలా హోటళ్ల అసోసియేషన్లతో ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని సూచించారు. అలాగే ఓఎన్జీసీ, గెయిల్, బీజీఎల్ వంటి సంస్థలతో ఇంటింటికీ గ్యాస్ పైప్ లైన్ కనెక్షన్లు ఇచ్చే సంస్థలు సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ఈ క్రమంలో గ్యాస్ పైప్ లైన్ల విస్తరణకు అవసరమైన చర్యలపై దృష్టి సారించాలని అన్నారు. ఇండక్షన్ స్టవ్ లను కూడా అందుబాటులోకి తీసుకురావాలని సీఎం అధికారులకు సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రాలకు త్వరలోనే మరింత ఎల్పీజీ కేటాయింపులను కేంద్రం చేయనున్నట్లు అధికారులు సీఎం వెల్లడించారు. వివిధ ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యల పైనా అధికారులు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# తప్పు రిపీట్ అయితే కఠిన చర్యలు తీసుకుంటా: నారా లోకేశ్

మొదటి పేజి తరువాయి

తప్పు పునరావృతం అయినా కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. చిన్న సమస్య ఉన్నా వెంటనే గుర్తించి పరిష్కరించాలని, ఈ పవిత్ర బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తెరిగి నడుచుకోవాలని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని ఓ పాఠశాలలో ఇటీవల మధ్యాహ్న భోజనంపై వివాదం తలెత్తిన నేపథ్యంలో ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మైలవరం దేవునిచెరువు తారకరామా నగర్ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన మంత్రి లోకేశ్, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా తిని నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. కొత్త కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని విద్యార్థులు బదులిచ్చారు. వివాదం జరిగిన రోజు, అంతకుముందు భోజనం ఎలా ఉండేదని కూడా మంత్రి ఆరా తీశారు. భోజనంలో ఏమైనా సమస్యలుంటే ముందుగా తల్లిదండ్రులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఇకపై భోజనం నాణ్యతపై 'లీప్' యాప్ ద్వారా తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకుంటామని, మరోసారి ఇలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యతను పరిశీలిస్తున్నారా అని సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం అధికారులతో మాట్లాడిన మంత్రి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని గట్టిగా హెచ్చరించారు. "మీపై పవిత్ర బాధ్యత ఉంది. విద్యార్థులకు సంబంధించి చిన్న సమస్య ఉన్నా తెలుసుకోవాలి, వెంటనే పరిష్కరించాలి. తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవు" అని స్పష్టం చేశారు. భోజనం నాణ్యతపై ప్రతి వారం ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా తల్లిదండ్రుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలోని రికార్డులు, విద్యాబోధన తీరును పరిశీలించారు. ప్రతి



పాఠశాల తనకు ముఖ్యమేనని, అడ్మిషన్ల పెంపుతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల మధ్యాహ్న భోజనంపై నిర్వహించిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి గుర్తుచేశారు. సమూల మార్పుల కోసం రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే సెంట్రలైజ్డ్ కిచెన్ వ్యవస్థను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తామన్నారు. వారంలో ఒకరోజు స్థానిక ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని సూచించారు.

# పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి'

మొదటి పేజి తరువాయి

ఏ మతం, ఏ చట్టం, ఏ నైతికత సమర్థించలేదని స్పష్టం చేసింది. పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని, అఫ్గాన్ పౌరులపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. ఈ విషాద సమయంలో అఫ్గాన్లకు అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేస్తూ భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు శాంతి, ఆత్మపరిశీలన, కరుణతో గడిపే పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడి జరగడం దారుణం. ఒక ఆసుపత్రిని అందులోని రోగులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతమూ, ఏ చట్టమూ, ఏ నైతికతా సమర్థించలేవు. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని జవాబుదారీగా చేయాలి. అఫ్గానిస్థాన్‌లో పౌరులపై పాకిస్థాన్ చేస్తున్న విచక్షణారహిత దాడులను వెంటనే ఆపేలా అంతర్జాతీయ సమాజం కృషి చేయాలి. మృతుల కుటుంబాలకు భారత్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తుంది. ఈ విషాద సమయంలో అఫ్గానిస్థాన్ ప్రజలకు భారత్ సంఘీభావంగా నిలుస్తుంది. అఫ్గానిస్థాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు మా పూర్తి మద్దతును ఇస్తున్నాం." ఐక్యరాజ్య సమితి వేదికపై పాక్‌కు భారత్



కౌంటర్ పవిత్ర రంజాన్ మాసంలో అఫ్గానిస్థాన్ లోని ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులను ఐక్యరాజ్య సమితి వేదికపై భారత్ తీవ్రంగా ఖండించింది. అలాగే అఫ్గాన్ జాతీయులను తరలించడంపైనా భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని పాక్ తీరును ఎండగట్టారు. ఐక్యరాజ్యసమితి నిర్వహించిన ఇస్లామోఫోబియాను ఎదుర్కొనే అంతర్జాతీయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యలు చేశారు. పొరుగు దేశం వారి ప్రాంతంలో ఇస్లామోఫోబియాపై కల్పిత కథలను అల్లడంలో ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలిచింది. ఈ దేశంలో అహ్మదీయులపై జరుగుతున్న క్రూరమైన అణచివేతను, నిస్సహాయులైన అఫ్గాన్‌లను పెద్ద ఎత్తున వెనక్కి పంపడాన్ని, పవిత్ర రంజాన్ మాసంలో వైమానిక దాడుల చేయడాన్ని ఏమని పిలుస్తారో అని ఆశ్చర్యం కలుగుతోంది?. ప్రభుత్వ, ప్రభుత్వేతర శక్తులు మత గుర్తింపును ఒక ఆయుధంగా మార్చడం, ఇంకా దానిని తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం, దాని వల్ల కలిగే ప్రమాదాలను ఐక్యరాజ్యసమితి గమనించడం చాలా ముఖ్యం" అని ఐక్యరాజ్యసమితిలో శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని అన్నారు. అంతకుముందు అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో సుమారు 400 మంది మృతిచెందగా 250 మందికి పైగా గాయాలైనట్లు అఫ్గాన్ ప్రభుత్వం వెల్లడించింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ఈ దాడిలో ఆసుపత్రి భవనం పెద్ద భాగం పూర్తిగా ధ్వంసమైందని అక్కడి అధికారవర్గాలు తెలిపాయి. భవన శిథిలాల్లో పలువురు చిక్కుకుని ఉన్నారని అధికారులు వెల్లడించారు. సుమారు 2వేల పడకలు గల ఈ ఆసుపత్రిలో మాదకద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందిస్తున్నారు. దాడి సమయంలో అక్కడ వందల సంఖ్యలో రోగులు ఉండటం వల్లే ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని అధికారులు తెలిపారు. అయితే, పాకిస్థాన్ మాత్రం అఫ్గాన్ పౌరులపై తాము ఎలాంటి దాడులు చేయలేదని పేర్కొంది. ఆస్పత్రులను తాము లక్ష్యంగా చేసుకోలేదంటూ ఆరోపణలను ఖండించింది. కాబూల్‌తో పాటు తూర్పు అఫ్గానిస్థాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఆయుధ నిల్వ కేంద్రాలపైనే లక్ష్యంగా దాడులు జరిపామని పాకిస్థాన్ సైన్యం పేర్కొంది.

# ఆ నిబంధన సరికాదు'- ప్రసూతి సెలవులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

మొదటి పేజి తరువాయి



సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే తక్కువ ఉంటేనే ప్రసూతి సెలవులకు అర్హత అనే నిబంధన సరికాదని, దీనికి అనుమతించే సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020లోని సెక్షన్ 60(4) రాజ్యాంగ విరుద్ధమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. చిన్నారి వయసుతో సంబంధం లేకుండా దత్తత తీసుకున్న సమయం నుంచి 12 వారాల పాటు ప్రసూతి సెలవులు తీసుకునేందుకు అర్హత ఉంటుందని తెలిపింది. దత్తత వంటి మార్గాల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమేనని స్పష్టం చేసింది.

పితృత్వ సెలవులను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన

దత్తత తీసుకున్న బిడ్డకు కన్న బిడ్డకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండదని, ప్రసూతి సంరక్షణ కనీస హక్కు అని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. నందూరి హంసనందిని అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును ఇచ్చింది. ఈ క్రమంలోనే సామాజిక భద్రత చర్యగా పితృత్వ సెలవులను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు సూచించింది. అయితే, 1961 నాటి మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ ప్రకారం 3 నెలల కంటే తక్కువ వయసు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళా ఉద్యోగులు 12 వారాలు (మూడు నెలలు) వేతనంతో కూడిన ప్రసూతి సెలవు తీసుకోవడానికి అర్హత ఉంది. ఇంకా ఈ చట్టం ప్రకారం అర్హులైన మహిళలకు 26 వారాలు వేతనంతో కూడిన సెలవుకు హక్కు కల్పిస్తుంది. ఇది ప్రభుత్వ లేదా ప్రైవేట్ రంగంలోని అన్ని కార్యాలయాలకు వర్తిస్తుంది. పితృత్వ సెలవుపై ప్రైవేట్ రంగానికి సంబంధించి ఎలాంటి చట్టం లేకపోయినా, ప్రభుత్వ ఉద్యోగులకు 15 రోజుల వేతనంతో కూడిన పితృత్వ సెలవుకు అర్హత ఉంది. ఒకవేళ ప్రైవేట్ రంగ ఉద్యోగులు ఈ ప్రయోజనాన్ని పొందడానికి సరైన నిబంధనలు లేవు.

**రుతుక్రమ సెలవులపైనా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు**

అంతకుముందు రుతుక్రమ సెలవులపైనా సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా విద్యార్థినులు, మహిళా ఉద్యోగులకు రుతుక్రమ సెలవులు తప్పనిసరి చేస్తూ జాతీయ స్థాయిలో ఒక విధానాన్ని తీసుకురావాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని తిరస్కరించింది. చట్టబద్ధంగా దీన్ని తప్పనిసరి చేస్తే మహిళలకు ఎవరూ ఉద్యోగాలు ఇవ్వరని, ఈ చర్య మహిళల పట్ల లింగ వివక్షకు దారితీసే ప్రమాదం ఉందని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. శైలేంద్ర మణి త్రిపాఠీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రుతుక్రమం అనేది మహిళలకు జరుగుతున్న చెడుగా, భయాన్ని సృష్టించేలా, వారిని తక్కువ చేసి చూపేలా ఈ తరహా పిటిషన్లు ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేరళలోని పాఠశాలలతో పాటు పలు ప్రైవేట్ కంపెనీలు ఇప్పటికే స్వచ్ఛందంగా మహిళలకు రుతుక్రమ సెలవులు ఇస్తున్న విషయాన్ని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీజేఐ, సంస్థలు స్వచ్ఛందంగా ఈ సెలవులు ఇస్తే అది అద్భుతమైన విషయమని అన్నారు. కానీ, చట్టప్రకారం దీన్ని తప్పనిసరి చేసిన మరుక్షణం మహిళలకు ఎవరూ ఉద్యోగాలు ఇవ్వరని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ, న్యాయవ్యవస్థల్లోనూ వారిని తీసుకోరని, దాంతో వారి కెరీర్ ముగుస్తుందని అన్నారు. పని ప్రదేశాల్లో మహిళల వృత్తిపరమైన ఎదుగుదలపై ఇలాంటి నిబంధనలు ప్రతికూల ప్రభావం చూపుతాయని సుప్రీంకోర్టు పేర్కొంది.

# ఎలా చెబితే అలాగే యుద్ధ కథనాలను ప్రసారం చేయాలి'

ఇరాన్‌తో యుద్ధం వేళ అమెరికా మీడియా సంస్థలు, జర్నలిస్టులపై ట్రంప్ సర్కారు ఒత్తిడిని పెంచుతోంది. తమ ప్రభుత్వం కోరుకునే కోణంలోనే వార్తా కథనాలను ప్రసారం చేయాలని హెచ్చరిస్తోంది. తాజాగా ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఏబీసీ న్యూస్ విలేకరి మరియం ఖాన్ అడిగిన ప్రశ్నపై ప్రెసిడెంట్ ట్రంప్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ భూగ్రహం మీద అత్యంత అవినీతిమయ వార్తా సంస్థ ఏబీసీ న్యూస్ అని ఆయన ఫైర్ అయ్యారు. ప్రముఖ మీడియా సంస్థ సీఎన్ఎన్ దేశభక్తిని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రశ్నించారు. నకిలీ వార్తలకు దూరంగా ఉండకపోతే మీడియా సంస్థలు లైసెన్సులను కోల్పోతాయని ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్ ఛైర్మన్ బ్రెండన్ కార్ స్పష్టం చేశారు. ఇంతకీ ఈ యుద్ధంపై ఎలాంటి న్యూస్ రిపోర్టింగ్‌ను ట్రంప్ సర్కారు కోరుకుంటోంది ? మీడియా సంస్థల లైసెన్సుల రద్దుపై అమెరికా చట్టాలు ఏం చెబుతున్నాయి ? ఈ కథనంలో తెలుసుకుందాం.

సీఎన్ఎన్ దేశభక్తిని ప్రశ్నించిన రక్షణ మంత్రి

2026 మార్చి 13న అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) మీడియా సమావేశం వేదికగా ప్రముఖ మీడియా సంస్థ సీఎన్ఎన్‌పై రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ చమురు సరఫరాలపై ఇరాన్ దాడులు చేస్తే ఎదుర్కొనేందుకు అమెరికా ముందస్తుగా సన్నద్ధం కాలేదంటూ సీఎన్ఎన్ ప్రసారం చేసిన కథనం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశభక్తి కలిగిన పత్రికలు ఇలాంటి శీర్షికలను ఉపయోగించకూడదని ఆయన హితవు పలికారు. సీఎన్ఎన్ న్యూస్ నెట్‌వర్క్‌ను వీలైనంత త్వరగా డేవిడ్ ఎల్లిసన్ స్వాధీనం చేసుకోవడం మంచిదన్నారు. ఆ తర్వాత సీఎన్ఎన్‌లో ట్రంప్‌కు అనుకూలమైన కవరేజీ పెరుగుతుందని పీట్ హెగ్సెత్ తెలిపారు.

అమెరికా సైనికుల మరణాలపై ప్రశ్న: ట్రంప్ ఆగ్రహం

2026 మార్చి 14న ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయాణిస్తున్న సమయంలో కీలక ఘటన జరిగింది. ఇరాన్ యుద్ధంలో అమెరికా సైనికుల మరణాలు, కొత్త బలగాల మోహరింపుపై ట్రంప్‌ను ఏబీసీ న్యూస్ రిపోర్టర్ మరియం ఖాన్ ప్రశ్న అడిగారు. దీనికి సమాధానం చెప్పడానికి ట్రంప్ నిరాకరించారు. రిపోర్టర్ మరియం ఖాన్‌ను ఉద్దేశించి "నువ్వు చాలా అసహ్యకరమైన వ్యక్తివి. ఈ భూగ్రహం మీద అత్యంత అవినీతిమయ వార్తా సంస్థ ఏబీసీ న్యూస్" అని ఆయన మండిపడ్డారు.

లైసెన్సులు రద్దు చేస్తాం : ఎఫ్‌సీసీ ఛైర్మన్

సౌదీ అరేబియాలోని ఎయిర్‌పోర్టులో ఐదు అమెరికా రీఫ్యూయలింగ్ విమానాలపై దాడి జరిగిందని, అవి ధ్వంసమయ్యాయని వచ్చిన వార్తలను ఖండిస్తూ మార్చి 14న ఉదయం ప్రెసిడెంట్ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్ చేశారు. ప్రముఖ వార్తాపత్రికలు ది న్యూయార్క్ టైమ్స్, ది వాల్ స్ట్రీట్ జర్నల్ ఈ కథనాలను ప్రచురించాయని ట్రంప్ తెలిపారు. ఈ ట్రంప్ పోస్ట్‌ను రీట్వీట్ చేస్తూ, అదేరోజు వెంటనే అమెరికా ఫెడరల్

# గాలివాన బీభత్సం

# ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు





**విజేత,రాయికోడ్ :** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం నుండి తీవ్రంగా గాలి వీస్తూ వడగళ్ల వాన కురిసింది, ఈ గాలివాన బీభత్సనికి రాత్రి మండలంలోని పిప్పడ్ పల్లి గ్రామానికి చెందిన నాట్కరి భూమన్న కు చెందిన రేకుల షెడ్డు పూర్తిగా కూలిపోయిందని,ఇంటి పై కప్పు ఎగిరిపోయి ధాన్యం,పప్పు దినుసులు తడిసి ముద్దయ్యానని అలాగే ఇంట్లో సామాను చిందరవందరగా పడి బియ్యం డబ్బాలో దాచిన డబ్బులు గాలికి ఎగిరిపోయాయని యజమాని కన్నీటిపర్యంతం అవుతూ నిరుపేదలమైన మాకు ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని,అలాగే దాతలు తగిన సహాయం అందించాలని కోరారు.

# గ్యాస్ సిలిండర్ల కొరకు ఎగబడిన జనం





**విజేత,రాయికోడ్ :** పొరుగు దేశాలకు యుద్ధం నడుస్తున్న నేపథ్యంలో ఆ ప్రభావం భారతదేశం లో గ్యాస్ సిలిండర్లపై పడింది, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ సిలిండర్ ల కొరత లేదు యధావిధిగా నిత్యం అందించడం జరుగుతుందని తెలియ జేస్తున్నప్పటికి ప్రజలు గ్యాస్ ఏజెన్సీ ల వద్ద పడిగాపులు కాస్తున్నారు.కాగా మంగళవారం సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని ఇండెన్ గ్యాస్ గోదాంకు స్టాక్ రావడంతో ప్రజలు ఎగబడి సిలిండర్లను తీసుకెళ్లారు.

# గుండ బ్రహ్మయ్య

# జాతరను ప్రశాంతంగా నిర్వహించాలని



**విజేత:సంగెం :** గవిచర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ భాషిపాక. సదయ్య ఆధ్వర్యంలో నిర్వహిచిన .కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ వంశీ కృష్ణ హాజరై మాట్లాడుతూ గుండ బ్రహ్మయ్య జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని అన్నారు. జాతర విజయవంతానికి రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని అన్నారు. ప్రభ బండ్లతో వచ్చేవారు సంయామానం పాటించి గొడవలు జరగకుండా చూసుకోవాలన్నారు. జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎక్కడ ఎలాంటి గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతర ముగిసే వరకు గ్రామంలో మద్యం, మాంసం విక్రయాలను నిషేధించాలని అన్నారు. అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుమ్మడి సంపత్, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి శరత్ కుమార్, గుండ బ్రహ్మయ్య దేవాలయ కమిటీ చైర్మన్ కొంతం యాదగిరి, మాజీ జెడ్పిటిసి గూడ సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ధోనికల రమ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం

గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం.

బిడాక్టర్ అన్నపూర్ణ గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరిండెంటెంట్.



**విజేత గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మంగళవారం పోలీసు ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 63 మంది పోలీసు సిబ్బందికి ఈ శిబిరంలో సుమారు 59 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ రాత్రి పగలు తేడా లేకుండా, సొంత ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం శ్రమిస్తున్న పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ శ్రేయస్సు ప్రజల రక్షణ సాధ్యమవుతుంది. విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని సూచించారు.ఈ వైద్య శిబిరంలో పోలీసులకు రక్తపోటు, మధుమేహం,ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నరసింహులు,సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళి,ఆసుపత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ రాము,డాక్టర్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్లు దొడ్డి రమేష్, జీవన,రచన, శ్రీను, పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సీతారామ ప్రాజెక్టు భూనిర్వాసితులకు 2013 చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి

తెలంగాణ రైతు సంఘం డిమాండ్



**విజేత, ములకలపల్లి :** సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ కి భూమి సేకరిస్తున్న నేపథ్యంలో నిర్వాసితులకు 2013 చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవర సత్యనారాయణ డిమాండ్ చేశారు మంగళవారం ములకలపల్లి లో తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ లక్ష్మీనరసు అధ్యక్షులు జరిగింది సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2013 చట్ట ప్రకారం ఎకరానికి 24 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ ప్రాంతం గుండా వెళుతున్న ప్రధాన కాలువకి గతంలో కేవలం ఎనిమిది లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఖమ్మం ప్రాంతంలో 18 నుంచి 24 లక్షల రూపాయలు వరకు చెల్లిస్తున్నారని ఇది ప్రాంతాల మధ్యన అసమానతలు తీసుకురావడానికి దోహదపడుతుందని ఆయన అన్నారు ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ఆ ప్రాజెక్టు వల్ల భూమి కోల్పోయిన ప్రాజెక్టు సహకరించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు నేడు డిస్ట్రిబ్యూటర్ కెనాల్సి కి పెరిగిన నిత్యావసర ధరలు ఇతర ఖర్చుల వలన భూమి విలువ పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు నేడు మార్కెట్లో 20 లక్షలకు పైన అమ్ముడుపోతున్న భూమిని అతి తక్కువగా కొనాలనుకోవడం ప్రభుత్వం వక్రబుద్ధికి నిదర్శనం అని ఆయన అన్నారు నేడు రైతాంగానికి ఉపయోగపడే విధంగా 2013 చట్ట ప్రకారం మార్కెట్ ధరకు అనుగుణంగా భూమికి నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ జిల్లాలో మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన తర్వాత మిగతా ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు నీళ్ళు తరలించాలని ఆయన తెలిపారు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి ఈ జిల్లాకి అన్యాయం జరుగుతుంటే ప్రజాప్రతినిధులు నిమ్మకి నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు ఈ బడ్జెట్ సమావేశాల్లో సీతారామ ప్రాజెక్టుకి డిస్ట్రిబ్యూటర్ కెనాల్సికి పూర్తి నిధులు కేటాయించి సత్వరం పనులు పూర్తి చేసి వచ్చే సీజన్ నుంచి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ మండల నాయకులు గోపగాని లక్ష్మీ నర్సయ్య,వర్షా శ్రీరాములు, కురం ప్రభాకర్,ప్రసాదు, నారాయణ, భూక్యా శ్రీదేవి, పుప్పాల హరినాథ్, హేమాని, తదితరులు పాల్గొన్నారు

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం





**విజేత,రాయికోడ్ :** సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ లోని రైతువేదికలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు అలాగే రైతు కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులందరు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య తెలిపారు.

**ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు మాట్లాడుతూ**

రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు ను అందించినవారు అవుతారని తెలిపారు. వ్యవసాయ అధికారిని సారిక మాట్లాడుతూ సమగ్ర, సుస్థిర వ్యవసాయం వైపు రైతులను దారితీసేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతో ముఖ్యమని,ప్రకృతి వ్యవసాయం ద్వారా మట్టిసారాన్ని కాపాడుకోవచ్చు, ఖర్చులను తగ్గించుకోవచ్చు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని,గోమూత్రం, గోమయం,జీడిపప్పు చీకు,గుడ్డజిలుగు వంటి సహజ పదార్థాలతో తయారు చేసే జీవామృతం, ఘనజీవామృతం వంటి ఎరువులు మట్టిలో సూక్ష్మజీవులను పెంచి పంటల పెరుగుదలకు తోడ్పడతాయని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అంజయ్య,ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావ్,వీరభద్రేశ్వర ఆలయ చైర్మన్ కులకర్ణి సతీష్ ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్,అల్లాపూర్ గ్రామ సర్పంచ్ చరణ్ కుమార్,రాయికోడ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కేదార్నాథ్ పాటిల్,మండల వ్యవసాయ అధికారిని సారిక,వ్యవసాయ విస్తీర్ణ అధికారులు,పలువురు రైతులు పాల్గొన్నారు.

# కళావిహీనం చొప్పదండి పట్టణం



కనిపించని సుందరీకరణ

పనిచేయని ఫౌంటేన్

డివైడర్లలో లేని మొక్కలు పచ్చదనం

అధికారులు పట్టించుకోండి పచ్చదనంతో నింపండి





**విజేత చొప్పదండి :** చొప్పదండి పట్టణం ఎన్టీఆర్ కూడలి వద్ద కళావిహీనంగా విగ్రహాలు , పనిచేయని ఫౌంటెన్, పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యతఅంటూ మున్సిపల్ అధికారులు చెబుతుంటారు. వారే పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణ కేంద్రమైన కొత్తబస్టాండ్ పాతబస్టాండ్ వద్ద జంక్షన్లు నిర్మించి అందులో అంబేద్కర్ విగ్రహం , మగ్గం చేనేత విగ్రహం ఫౌంటేన్లను అందంగా ముస్తాబు చేశారు. ఆనంతరం వాటి నిర్వహణ మర్చిపోవడం తో ప్రస్తుతం కళావిహీనంగా మారాయి. ఫౌంటేన్ ఒక్కసారి కూడా పనిచేయడశీ లేదు. స్థానికులెవరైె నా ఫిర్యాదు చేస్తే అడపదడపా వచ్చి ఫౌంటెన్ ప్రారంభించి వదిలేస్తుంటారు. అందులో ఉన్న వచ్చిగడ్డి ఎండిపోయింది. విగ్రహాలు దుమ్ము దూళితో కళాహీనంగా మారాయి. ఎలక్షన్లకు ముందు కప్పిన ఎన్టీఆర్ విగ్రహం ఇంకా తెరవలేదు , డివైడర్ల మధ్యనున్న స్థలంలో ఎర్ర మట్టి పోసి మొక్కలను పెంచాలి, కానీ ఎందుకు పనికిరాని మట్టిని పోశారు మొక్కలను పెంచే కార్యక్రమం ఇంకా మొదలే పెట్టలేదు,కరీంనగర్ వెళ్లే రహదారిలో ఆటోలు నిలపడంతో కుడి, ఎడమ రహదారుల వైపు వెళ్లేవారు మచ్చుకై నా కన్పించరు. ప్రమాదాలు ప్రమాదాలు జరుగుతాయని భయపడుతున్న పట్టణ ప్రజలు పైగా అందులో చుట్టూరా ఫ్లెక్సీలు అడ్వర్టైజ్మెంట్ బోర్డు లు ఏర్పాటు చేసుకుంటారు, డివైడర్ల మధ్యలో మధ్యలో మొక్కలు పెంచి పచ్చదనం పెశీచుతూ అందంగా తీర్చిదిద్దాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా పట్టించుకోకుండా వ్యవహరిస్తుండ డంతో చొప్పదండి పట్టణం ఎటుచూసినా కళావిహీనంగా కనిపిస్తుశీది, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డివైడర్ల మధ్య మొక్కలు నాటి ఫౌంటేన్లను పునఃప్రారంభించాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

బిజెపి మండల శాఖ అధ్యక్షులు అనుమల సంపత్ రెడ్డి



**విజేత గజ్వేల్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు కుక్కునూరు పల్లి బిజెపి మండల శాఖ అధ్యక్షులు అనుమల సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో కుక్కునూరు పల్లి మండల తహసీల్దార్ కార్యాలయనికి నిరసన గా వెళ్లి రెవెన్యూ ఇన్స్పెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అనుముల సంపత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తుందని రాష్ట్రంలో అర్హులైన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదని, వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు నూతన పింఛన్లు మంజూరు చేయడం లేదని,ఎన్నికల సమయంలో అనేక ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చే రైతు పెట్టుబడి సాయం ఎకరాకు 6000 రుపాయలు వేస్తామని చెప్పి మూడు విడతల పైసలు ఎగ్గొట్టి రైతులను మోసం చేస్తోందని అన్నారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం జరిగంది అని. కానీ వాటిలో ఏ ఒక హామీ కూడా ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయడం లేదని.ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలండర్ నిరుద్యోగ భృతి వృద్ధాప్య వితంతు మరియు దివ్యాంగులకు పెన్షన్లు కళ్యాణ లక్ష్మి పేదలకు గృహ నిర్మాణ పథకం రైతులకు రైతు భరోసా భూ సమస్యలు పరిష్కారం వంటి అనేక హామీలు ఇచ్చి అధికారములోకి వచ్చిన తర్వాత అమలుచేయకపోవడం దురదృష్టకరం అని అన్నారు . కాంగ్రెస్ పార్టీ మీద నమ్మకం పెట్టుకొని ఓటు వేసిన ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పైన తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు .మండలంలో రైతులు తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు. రైతు భరోసా సమయానికి అందక పోవడంతో రైతులు పెట్టు బడుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అలాగే వృద్ధాప్య వితంతు మరియు దివ్యాంగులకు ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్లు అర్హులైన లబ్ధిదారులకు అందడం లేదు అని మరియు మండలంలో దరఖాస్తు చేసుకున్న అనేకమంది వృద్దులు వికలాంగులు మరియు ఒంటరి మహిళలకు ఇప్పటికి పెన్షన్లు మంజూరు కాలేదు అర్హులైన అభ్యర్థుల అందరి దరఖాస్తులను వెంటనే ఆమోదించి వారికి పెన్షన్లు అందించాలని కోరుతున్నాము పేదలకు ప్రభుత్వం ప్రకటించిన గృహ నిర్మాణ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఇండ్లు మంజూరు చేయాలని మరియు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ప్రజలు దరఖాస్తులు సమర్పించినప్పటికీ వారి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని ఆ సమస్యల పరిష్కారం తక్షణమే పరిష్కరించాలని గ్రామాల్లో ప్రజలు కోరుకుంటున్నారు.ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ మౌలిక సదుపాయాలు వీధిదీపాలు వంటి ప్రాథమిక సదుపాయాలు సరైన విధంగా అందడం లేదు ఈ సమస్యల పైన వెంటనే చర్యలు తీసుకోవాలని అలాగే ఆదాయం కుల ధృవీకరణ నివాస పత్రాలు జారీలో తీవ్ర జాప్యం జరుగుతుంది అని అన్నారు. అనేక ప్రభుత్వ పథకాలకు ఈ పత్రాలే ప్రమాణికం కావడంతో నిర్ణీత సమయంలో ధృవీకరణ పత్రాలను జారీ చేసి అర్హులు నష్టపోకుండా చూడాలని కోరారు.అలాగే కుకునూరుపల్లి నుంచి కొండపోచమ్మ వెళ్లే రోడ్డు వర్క్ తొందరగా కంప్లీట్ చేయాలని కుక్కునూరు పల్లి మండల పార్టీ తరఫున విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో చింతల రమేష్, రెడ్డమైనా నర్సింలు,గండ్ల భాను, రెడ్డమైనా పరశురాం, తాళ్లపల్లి బిక్షపతి,కరుణాకర్ ముదిరాజ్, చిర్లా రమేష్ యాదవ్,చిన్నగారి రాజయ్య, చందు, అఖిల్, రొయ్యల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కమిటీలను ఏర్పాటు చేయాలి

దళిత చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఉక్కుల అశోక్ ఉక్కుల అశోక్.



**విజేత, ఇబ్రహీంపట్నం :-** ఏప్రిల్ నెలలో నిర్వహించనున్న మహనీయుల జయంతులకు ఉత్సవ కమిటీలను వెంటనే నియమించాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత, దళిత చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఉక్కుల అశోక్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ని కోరారు. మంగళవారం డీసీవీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఏప్రిల్ లో బాబూ జాగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతి రావు పూలె, డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహాణకు కమిటీలను వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవవారిచడం సరికాదు మిగితా జిల్లాలాలో సామాజిక, ప్రజాసంఘాలు, దళిత సంఘాల నాయకులను సంప్రదించి కమిటీలను వేయడం జరిగింది. కావున రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, వెంటనే ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసి ఆ కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరిగేలా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు ఉక్కుల అశోక్ తెలిపారు.

# కేజీబీవీ పాఠశాలను వికస్మిక సందర్శిన

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

డిఈఓ శ్రీనివాస్ రెడ్డి




**విజేత గజ్వేల్ :** విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి అని డిఈఓ శ్రీనివాస్ రెడ్డిఅన్నారు.సిద్ధిపేట జిల్లా మర్కూక్ మండలంలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం రోజు డిఈఓ శ్రీనివాస్ రెడ్డి సెక్టోరల్ ఆఫీసర్ రామస్వామి ఎంఈఓ వెంకటరాములు ఆకస్మికంగా సందర్శించారు.మధ్యాహ్న భోజనం కిచెన్ ఏరియా డైనింగ్ హాల్,ఫుడ్ మెనూ స్కూల్ ప్రీమిసెస్ పరిశీలించారు.కొత్తగా కన్స్ట్రక్షన్ జరిగిన ఏరియా వర్క్ గురించి స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు.మధ్యాహ్న భోజనంను ఫుడ్ టేస్ట్ చేసి పదవ తరగతి విద్యార్థులతో ఎగ్జామ్స్ ఏ విధంగా రాస్తున్నారు అని తెలుసుకొని విద్యార్థులకు తగు సలహాలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు శేఖర్ ను పరామర్శించిన దళిత స్త్రీ శక్తి వ్యవస్థాపకులు గడ్డం ఝాన్సీ

నిందితులను వెంటనే రిమాండ్ చెయ్యాలి

దళిత జర్నలిస్టు శేఖర్‌కు అండగా ఉంటాం

మల్లేష్ కేసును ఉధృతం చేస్తాం

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

దళిత స్త్రీ శక్తి వ్యవస్థాపకులు గడ్డం ఝాన్సీ



**విజేత,చేవెళ్ల :** చేవెళ్ల నేటిధాత్రి దినపత్రిక జర్నలిస్టు శేఖర్ పై జరిగిన దాడి విషయం తెలుసుకుని దళిత స్త్రీ శక్తి (డిఎస్ఎస్)వ్యవస్థాపఅధ్యక్షురాలు గడ్డం ఝాన్సీ సోమవారం శేఖర్ ను పరామర్శించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలో దళితులపై జరుగుతున్న వరుస దాడుల నేపత్యంలో, దళిత స్త్రీ శక్తి వ్యవస్థాపకులు గడ్డం ఝాన్సీ, సోమవారం షాబాద్ ఘటనలో దాడికి గురైన దళిత జర్నలిస్టు శివగళ్ల శేఖర్ ను ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. దాడికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన నిందితులను వెంటనే రిమాండ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా షాబాద్ మండలం బొబ్బిలిగామ గ్రామానికి చెందిన దళితుడు తాళ్లపల్లి మల్లేష్‌పై జరిగిన దాడి గురించి కూడా ఆమె ఆరా తీశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దళిత స్త్రీ శక్తి వ్యవస్థాపకులు గడ్డం ఝాన్సీ పిలుపునిచ్చారు. ఈ అట్రాసిటీ కేసు నమోదు విషయంలో పోలీసులు, స్థానిక నాయకులు లేదా గ్రామస్థుల నుంచి ఒత్తిళ్లకు తలోగ్గకుండా , నిష్పక్షపాతంగా విచారణ జరపాలని అన్నారు. నిందితులు డబ్బు ఆశచూపి కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తారని, అటువంటి ప్రలోభాలకు గురికావద్దని, ఒత్తిళ్లకు లొంగకుండా చట్టంపై నమ్మకంతో పోరాడాలని బాధితులకు సూచించారు. బాధితులకు చట్టపరంగా ఆర్థిక సహాయం కూడా అందుతుందని ఆమె అవగాహన కల్పించారు. నిందితులకు కఠిన శిక్ష పడే వరకు అవసరమైతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, బాధితులకు దళిత స్త్రీ శక్తి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# విద్యార్థుల కోట్ల స్కాలర్షిప్‌డఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

రాష్టంలోని విద్యారంగానికి కనీసం

15% బడ్జెట్ కేటాయించాలి

విద్యారంగం సమస్యలపై వెంటనే రాష్టం స్పందించాలి.


ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్.




**విజేత చేవెళ్ల :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ మాట్లాడుతు విద్యార్థుల సమస్యలపై ముఖ్యమైన అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. రాబోయే మార్చి 20న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి కనీసం 15 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒక రాష్ట్ర అభివృద్ధి విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యను బలోపేతం చేయకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యాశాఖకు ఇప్పటివరకు పూర్తిస్థాయి మంత్రి నియామకం జరగకపోవడం వల్ల విద్యారంగానికి సంబంధించిన అనేక కీలక నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని తెలిపారు. అందువల్ల వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇంకా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్లు మరియు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ ఆలస్యం కావడం వల్ల అనేక మంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువు కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు కళాశాలలకు హాజరు కాలేకపోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఇది విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న అన్ని స్కాలర్షిప్లు మరియు ఫీజు రీయింబర్స్మెంట్లను విడుదల చేయడంతో పాటు విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమం లో నగర కార్యదర్శి హారిక, అనిల్, ప్రశాంత్ ,లోకేష్ ,జైపాల్ తదితరులు పాల్గొన్నారు

# తడపాకల్ గోదావరి నది తీరాన

# మార్చ్ 20,21,22 న విజ్ఞాన మహాసభలు



**విజేత, బాల్కొండ :** దత్త సాయిబాబా మందిరము పంచమ వార్షికోత్సవంలి ఆశ్రమ వ్యవస్థాపకులు నిర్గుణ తత్వ మహారాజ్ వెల్లడి ఇందూరు జిల్లా ఏర్గట్ల మండలంలోని తడపాకల్ గోదావరి నదీ తీరాన గల శ్రీ దత్త సాయిబాబా మందిరము పంచమ వార్షికోత్సవం సందర్భంగా మార్చ్ 20,21,22 శుక్ర,శని,ఆది వారాలలో మూడు రోజులపాటు "విజ్ఞాన మహాసభ"లను నిర్వహిస్తున్నట్లు ఆశ్రమాలయ వ్యవస్థాపకులు నిర్గుణ తత్వ మహారాజ్, ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకులు, ప్రముఖ వ్యాఖ్యాత కంకణాల రాజేశ్వర్, శ్రీ మకరంద సమాజ సేవా సంస్థ భక్త బృందం మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా నిర్గుణ తత్వ మహారాజ్ మంగళవారం రోజున మీడియాతో మాట్లాడుతూ మూడు రోజులుగా సుప్రభాతం, గీతా పారాయణం, ఉదయం, సాయంత్రం రెండు పూటలా మహాత్ముల ఆధ్యాత్మిక ప్రవచనాలు, సామూహిక ఆధ్యాత్మిక భజన కార్యక్రమాలు ఉంటాయి అని అన్నారు. కాబట్టి ఈ సువర్ణ అవకాశాన్ని ఇందూరు జిల్లా ప్రజలు సద్వినియోగ పరచుకోవాలి అని పిలుపునిచ్చారు. కార్యక్రమం జరిగే మూడు రోజులపాటు అన్నదాన సత్రం కలదు.ఇట్టి బృహత్తరమైన కార్యక్రమంలో ఇందూరు జిల్లాలోని ఆశ్రమాలయ వ్యవస్థాపకులు, స్వాములు,ధార్మికులు, భక్తులు,వైదికులు, ఇందూరు జిల్లాలోని ఆసక్తిగల ప్రజలు పాల్గొని సాయినాథుని కృపకు పాత్రులై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని నిర్గుణ తత్వ మహారాజ్ కోరారు.

# ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టై,బెల్ట్, షూస్, యూనిఫామ్ పంపిణీ కార్యక్రమం



**విజేత, బాల్కొండ :** బాల్కొండ మండలంలోని నాగపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు ఉచిత యూనిఫామ్లు టై, బెల్టు మరియు బూట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర ఆధ్వర్యంలో అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారి విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సమానత్వ భావన పెంపొందించేందుకు యూనిఫామ్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.పాఠశాల అభివృద్ధికి మరియు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రుల, ప్రజా ప్రతినిధుల సహకారం చాలా అవసరమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని,ప్రభుత్వ పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టడంతో విద్యార్థుల యొక్క సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయన్నారు.తమ పిల్లలకు యూనిఫామ్ యూనిఫామ్స్ ,టై, బెల్టు, బూట్లు అందజేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రాథమిక ఉన్నత పాఠశాల నాగాపూర్ లో మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ చేతుల మీదుగా ప్రి-ప్రైమరీ విద్యార్థులకు యూనిఫామ్, టై, బెల్ట్, షూస్ వితరణ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాస రవికుమార్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు దొండి కృష్ణవేణి, గ్రామ సర్పంచ్ శ్రీమతి పోలేపల్లి హేమలత లక్ష్మి నారాయణ ,ఉప సర్పంచ్ ఎంబరి నర్సయ్య,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఆరెపల్లి లక్ష్మి , పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షులు కస్ప గంగనర్సయ్య , గ్రామ అభివృద్ధి కమిటీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రంపచోడవరంలో ఘనంగా కొనసాగుతున్న ఏపీ టీడబ్ల్యూ టాలెంట్ హంట్

స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి



**విజేత పోలవరం :** పోలవరం జిల్లా రంపచోడవరంలో గిరిజన బాలల క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఏపీ టీడబ్ల్యూ టాలెంట్ హంట్ కార్యక్రమం ఘనంగా కొనసాగుతోంది. నిన్న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈరోజు కూడా ఉత్సాహంగా సాగుతూ క్రీడా వాతావరణాన్ని సృష్టిస్తోంది. శ్యాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం గిరిజన పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారికి ఉన్నత స్థాయి శిక్షణ అందించడమే ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది. ఏపీ స్పోర్ట్స్ చైర్మన్ రవి నాయుడు నాయకత్వంలో రాష్ట్ర క్రీడా అధికారి రమణ, డిఎస్డీవోలు అజిత్, జగన్మోహన్, స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా నిపుణ కోచ్‌లను తీసుకువచ్చి ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేస్తున్నారు. మొత్తం 25 పాఠశాలల నుంచి 125 మంది బాలురు, 126 మంది బాలికలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం విశేషం. ఆధునిక సదుపాయాలతో నిర్వహించిన ఈ పరీక్షల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొని మెప్పించారు. కొన్ని క్రీడల్లో శారీరక పరిమితులు ఉన్నప్పటికీ, వారిలోని ప్రతిభను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తే గిరిజన పిల్లలకు విస్తృత అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యే సమయంలో మళ్లీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, పిల్లల ప్రతిభను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ గిరిజన యువతకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఇటీవల గిరిజన యువతి కుంజ రజిత అంతర్జాతీయ స్థాయిలో రాణించడం, బ్లైండ్ క్రికెటర్ కరుణకుమారి ప్రతిభ చాటుకోవడం గిరిజన పిల్లలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. గిరిజన క్రీడాకారుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ టాలెంట్ హంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్యాప్ చేపట్టిన ఈ కార్యక్రమానికి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ తో సరికొత్త అనుసంధానం....

సామాన్యులకు తక్కువ ధరకే అత్యాధునిక రైల్వే సౌకర్యాలు...

భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ లో జెండా ఊపి ట్రైన్ ను

ప్రారంభించిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే

అంజిబాబు....




**విజేత,భీమవరం ;** కామాఖ్య -- చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ కేవలం ఒక రైలు మాత్రమే కాదని ఈశాన్య రాష్ట్రాలను దక్షిణ భారతానికి కలిపే ప్రగతి వారధి అని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. కామాఖ్య చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ కు ఆదివారం భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ లో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవింద రావు, కూటమి నేతలు, కార్యకర్తలు నాయకులతో కలిసి ఈ రైలుకు జెండా ఊపి ప్రారంభించారు. సామా న్యులకు సైతం అత్యాధునిక సౌకర్యాలతో కూడిన హై-స్పీడ్ ప్రయాణాన్ని అత్యంత తక్కువ ధరకే అందించాలనే ప్రధాని మోడీ ఆశయాలకు అనుగుణంగా ఈ రైలు రూపొం దించడం జరిగిందన్నారు.భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ నరసాపురం పార్లమెంటు పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా వందే భారత్, అరుణాచలంకు ప్రత్యేక రైలు, అమృత్ భారత్ వంటి ఆధునిక రైల్వే సర్వీసులు తీసుకువచ్చిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ కృషిని అభినందించారు.కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ఈనెల 6న రైల్వే ఉన్నతాధికారులతో సమావేశమైన సందర్భంలో కామాఖ్య -- చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసు ప్రారంభం గురించి తెలిసి భీమవరం, తణుకు ప్రాంతం గుండా ఈ రైలు ప్రయాణిస్తే కలిగే ప్రయోజనాలను వారికి వివరించడంతో అధికారులు కూడా సానుకూలంగా స్పందించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో కేవలం రూ 500 లకే 1000 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని, ఈ ప్రాంత ఆక్వా ఉత్పత్తులను ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతి చేసే వర్తకులకు ఈ రైలు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

# అయిదు నెలల గర్భిణీని చంపిన భర్త

అందమైన జీవితాన్ని గడపాలని తల్లిదండ్రులని ఒప్పించి

ప్రేమ వివాహం చేసుకున్న వైష్ణవి

ప్రాణం తీసిన ప్రేమ వివాహం

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ లో ఘటన





**విజేత కోరుట్ల :** కోరుట్ల మండల మాదాపూర్ గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. 5 నెలల గర్భిణీ భార్య పై భర్త కత్తితో దాడి చేసి చంపేశాడు. మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన గంధం ప్రసాద్, రాణి దంప తులకు కూతురు వైష్ణవి, కోరుట్ల పట్టణానికి చెందిన చిత్తరి సాయిలు, సాయవ్వ దంపతుల కుమారుడు హరిబాబుతో దాదాపు ఏడాదిన్నర క్రితం ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఇటీవల వైష్ణవి 5 నెలల గర్భిణీ కావడంతో తల్లిగారింట్లో ఉంటుంది. హరిబాబు కూడా భార్యతో ఉంటూ కోరుట్ల లోని ప్రభుత్వ హాస్పిటల్ లో ఉద్యోగం చేస్తు న్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో వైష్ణవి, హరిబాబు దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో కోపా ద్రేకంలో వైష్ణవిని కత్తితో విచక్షణరహితంగా దాడి చేయగా తీవ్ర రక్తస్రావంతో చనిపోయింది. ఇవాళ తెల్లవారు జామున గదికి బయట నుంచి గొళ్ళెం పెట్టి హరిబాబు వెళ్ళిపోయాడు. నిద్ర లేచిన వైష్ణవి తల్లిదండ్రులు అనుమానంతో గది తలుపులు తీసి చూసే సరికి వైష్ణవి చనిపోయి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. డెడ్ బాడీ ని ప్రభుత్వ హాస్పిటల్ మార్చురీకి తరించారు.

# హరీష్ రావు ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబును విమర్శించడం మానుకోండి

కోరుట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మానుక ప్రవీణ్ కుమార్



**విజేత కోరుట్ల :** బాధ్యత లేని, చేతకాని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను చంద్రబాబుకు తాకట్టు పెట్టారని బీఆర్ఎస్ శాసన సభాపక్ష ఉపనేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యల పట్ల కోరుట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మానుక ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన చంద్రబాబు నాయుడును విమర్శించడం హరీశ్ రావుకు తగదన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న మీ బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అసత్య ప్రచారాలకు పాల్పడితే రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మరోసారి విమర్శిస్తే ఊరుకునేది లేదని హరీష్ రావును హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు ఎండి రఫియోద్దీన్, కొక్కుల మహాదేవ్, నరహరి, బాదాం మోహన్, తెలుగు మహిళా నాయకురాలు దివ్య, జ్యోతి, శాంత, రాణి, లక్ష్మీ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగవ డివిజన్ లో పారిశుధ్య సిబ్బందికి సన్మానం

దండా జ్యోతి రెడ్డి,డివిజన్ కార్పొరేటర్,





**విజేత ఖమ్మం ప్రతినిధి :-** 4 వ డివిజన్ లోని స్వయంభు శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ కమిటీ ట్రస్టు బోర్డు సభ్యులు ఆధ్వర్యంలో 4 వ డివిజన్ పారిశుధ్య సిబ్బంది ని సన్మానం జరిగింది మరియు ఈ నెల 19 వ తేదీన ఆలయ బ్రహ్మోత్సవాలు సందర్భంగా వారికి బట్టలు పంపిణీ చేశారు.

# బోగ్గారపు రామయ్య కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీ నామ పరామర్శ



**విజేత ఖమ్మం ప్రతినిధి :** ఖమ్మం కార్పొరేషన్, ఇల్లందు రోడ్ లోని ప్రగతి ప్రైడ్ కాలనీకి చెందిన బొగ్గారపు రామయ్య ఇటీవల మరణించిన విషయం విధితమే కాగా మంగళవారం మధ్యాహ్నం బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు వారి స్వగృహానికి వెళ్లి రామయ్య చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులర్పించారు. రామయ్య అల్లుడు మందటి నరేష్ చౌదరి, కుమార్తె కౌముదిని, కుమారులు రణధీర్, అభినవ్ తో పాటు వారి కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ నామ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్ తో పాటు పొట్ల హరినాధ్ బాబు, మాజీ పిఏసీఎస్ చైర్మన్ మన్నే బాలకృష్ణ, గుంటుపల్లి రఘు బాబు, యనమద్ది రాధాకృష్ణ, దేవభక్తని హేమంత్, బీఆర్ఎస్ నాయకులు వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం







**విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో :** భారతీయ జనతా పార్టీ తాడేపల్లిగూడెం పట్టణ అనుబంధ విభాగాలకు నూతన అధ్యక్షులను నియమించినట్లు పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను సోమవారం ప్రకటించారు. యువమోర్చా పట్టణ అధ్యక్షుని గా కంచర్ల రాజా, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా గోకా మహాలక్ష్మి, ఎస్టీ మోర్చా అధ్యక్షురాలిగా కూతాడ కళ్యాణి నియమితులయ్యారు. యువమోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శులుగా వంక మోహన్ సాయి, దొంతుకుర్తి సాయి బాబాలను ఎంపిక చేశారు. ఈ నియామకాల పట్ల జిల్లా ప్రశిక్షణ కన్వీనర్ ఈతకోట తాతాజీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింధు పైడికొండల, జిల్లా అధ్యక్షులు పత్స గోపాలకృష్ణ, మాజీ జాతీయ కౌన్సిల్ సభ్యులు కర్రి ప్రభాకర బాలాజీ సహా పలువురు సీనియర్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి వీరంతా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



**విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో;** పెంటపాడు మండలం కాగులంపాడు మండల ప్రజా పరిషత్ పాఠశాలను శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిం చారు. విద్యార్థులతో సంభాషించారు. భోజనాల్లో నాణ్యత,పరిశుభ్రత, పాఠశాలలో మౌలిక సౌకర్యాలు, విద్యాబోధన, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య వంతులు,విద్యావంతులైన భావి పౌరులను అందించడమే మధ్యాహ్న భోజన లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించటానికి ఉపాధ్యా యులు,సిబ్బంది కృషి చేయాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంపన నరసింహారాజు, అంగన్వాడి సూపర్వైజర్ చెరుకూరి భవాని పుల్లా బాబి, చెరుకూరి చంద్రశేఖర్, అమెరికా రాజు, రాయిప రెడ్డి మారుతి, చాపల రమేష్, మద్దాల మణికుమార్, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్, తదితరులు పాల్గొన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఈదురు గాలులకు నేల రాలిన మామిడి



**విజేత, తరిగొప్పుల :** సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు మండలంలోని పలు గ్రామాల్లో మామిడి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. బలమైన ఈదురు గాలులకు మామిడి కాయలు నేల రాలాయి. మండల కేంద్రానికి చెందిన రైతు చిలివేరు సంపత్ జాలుబాయి తండా శివారులో 23 ఎకరాల మామిడి తోట ఏడాదికి ఆరు లక్షలకు కౌలుకు తీసుకొనగా ఈదురు గాలులకు మామిడి కాయలు పూర్తిగా నేల రాలాయి. దీంతో బాధిత రైతు చిలివేరు సంపత్ బోరున విలపించాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని అధికారులను వేడుకొన్నాడు.

# ముందస్తు అరెస్టు



**విజేత, తరిగొప్పుల :** గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాల హక్కును కాలరాసే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా నాయకులు నారోజు రామచంద్రం కోరారు. వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపుకై సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో సందర్భంగా మండలలంలోని పలు గ్రామాల కారోబర్లను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషనుకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీనీ నిలబెట్టుకోవాలని కోరారు. అరెస్టు అయిన వారిలో సాంబారి కృష్ణమూర్తి, రామనారాయణ, అక్తర్, రాజు ఉన్నారు.

# పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**విజేత ఖమ్మం ప్రతినిధి :** కొణిజర్లకు చెందిన నిరుపేద మైనారిటీ విద్యార్థి ఉన్నత విద్యకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూత గా నిలవడం అభినందనీయమని ఖజానా శాఖ ఉపసంచాలకులు వై. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాడు కలెక్టరేట్ లోని ఖజానా శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో షేక్ ఉస్మాన్ కు పరిశసీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూత గా అందించిన ఇరవైవేలరూపాయల చెక్కును అందజేసి అభినందించారు. కొణిజర్లకు చెందిన నిరుపేద మైనారిటీ వర్గానికి చెందిన షేక్ హసన్, అబ్బాస్బీ దంపతుల కుమారుడు ఉస్మాన్ మధ్యప్రదేశ్ లో ఫోరెన్సిక్ డిగ్రీ చదువుతుండగా, ఆర్థిక చేయూత కై పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ను సంప్రదించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు నేపధ్యంలో ఆర్థిక చేయూత కు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ అంగీకరించి, ఆమేరకు ఈరోజు చేయూత గా చెక్కు అందజేసింది. ఖజానా శాఖ కార్యాలయంలో ఉప కోశాధికారులు బినాగేంద్రకుమారి, మోదుగు వేలాద్రి, బి శారద, వై మంజుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశపుల్లయ్య, విశ్రాంత యంపిఓ డిలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిరోజూ ప్రజావేదిక నిర్వహిస్తాం



**ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్**

**ప్రజా క్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి.**

**విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:** ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరిం చేందుకు, ఇకనుంచి ప్రతిరోజు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహిస్తామని శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలియజేశా రు. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు, సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమా లను అమలు చేస్తుందని, వీటి ఫలితాలు పూర్తిగా ప్రజలకు అందే విధంగా ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి నెలల తరబడి వేచి ఉండే పరిస్థితి గతంలో ఉండేదని, అలాంటి పరిస్థితులు లేకుండా సత్వరమే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా మని చెప్పారు. దేశంలో ఎక్కడాలేనివిధంగా అన్ని గ్రామాలలో పల్లె పండుగ నిర్వహించామన్నారు. రూ.14కోట్లతో గ్రామీణ రహదారులను, రూ.15కోట్లతో రోడ్లు, భవనాల శాఖ రహదారులను నిర్మించామని, రూ.8.5కోట్లతో వీరంపాలెం వద్ద వంతెన నిర్మిస్తున్నామని చెప్పారు. పట్టణంలో స్వర్గీయ ఈలి ఆంజనేయులు హయాం లో 20ఎకరాలలోనిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని రూ.70కోట్లతో 53ఎకరాలకు విస్తరించి, వేసవిలో సైతం మంచినీటి కొరత లేకుండా ఏర్పాటుచేస్తామని తెలిపారు. రూ.3.80 కోట్లతో ఈతకొలను నిర్మాణం , జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి పనులను తన సొంత నిధులు, ప్రజల విరాళాల తో,పి4 విధానం లో పూర్తిచేసి త్వరలోనే ప్రజలకు అందుబా టులోకి తీసుకువస్తామన్నారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం, అవినీతి వల్ల నియోజవర్గంలో రోడ్లన్నీ శిథిలావస్థకు చేరాయని విమర్శించారు.తాను ఎమ్మెల్యే గా బాధ్యతలు చేపట్టిన వెంటనే, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మొదటి సంతకం చేసి నిధులు మంజూరు చేశారని, బాదంపూడి నుంచి పత్తిపాడు వరకు దాదాపు 14 కిలోమీటర్లు ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి చేశామన్నారు.పాస్ బుక్కుల విషయం లో జగన్ తన ఫోటోతో వ్యక్తిగత ప్రచార యావతో రూ.900కోట్లు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రాజముద్రతో పాసుబుక్కులు పంపిణీ చేశామని, తప్పుల తడకగా, అస్తవ్యస్తంగా సాగిన రీసర్వేను సరి చేశామన్నారు. ప్రజలను భయభ్రాంతులను చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను, ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి సంతకంతో రద్దుచేసి ఊరట కలిగించారన్నారు. తుఫాన్ల వల్ల నష్టపోయిన రైతులను సకాలంలో ఆదుకున్నామన్నారు. వైసిపి హయాంలో రైతులు పండించిన ధాన్యం ఎక్కడ అమ్ముకోవాలో తెలియని దుస్థితి నుంచి తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ధాన్యం అమ్ముకొని 24 గంటల్లో సొమ్ము రైతులు ఖాతాకు జమ చేసే విధంగా చర్యలు చేపట్టా మన్నారు. ఉభయగోదావరి జిల్లాలో 50 శాతం ఉన్న ఆక్వా రంగాన్ని జగన్ ప్రభుత్వం నడ్డి విరిచే విధంగా దెబ్బతీసిందని, మేత ధరలు,విద్యుత్ ఛార్జీలు పెంచి ఆక్వా రంగాన్ని నష్టాల ఊబిలోకి నెట్టారని విమర్శిం చారు. వైసిపి ప్రభుత్వం చేసిన పొరపాట్లను సరిదిద్ది తమ ప్రభుత్వం ఆక్వారంగాన్ని గాడిలో పెట్టిందన్నారు. నిరంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు.

# గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి

**రాష్ట్రస్థాయిలో అనుభవై ద్యుల సంఘాల సమాఖ్యను బలోపేతం చేయాలని పిలుపు**

**గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లాల అధ్యక్షులు పిట్టల**






**విజేత ఖమ్మం ప్రతినిధి :** తెలంగాణ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్లోని 307 ప్లాట్ లో తెలంగాణ అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్ అధ్యక్షతన ప్రస్తుతం గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చే విషయంపై సమావేశం జరిగింది.ఈ సమావేశంలో మన ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన 428 జిఓను ప్రభుత్వం రద్దు చేయాలని ఐఎంఏ డాక్టర్లు హైకోర్టులో రిట్ పిటీషన్ వేసిన దానిపై తెలంగాణ అనుభవిద్దల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మన గ్రామీణ వైద్యులకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయాలని విషయంపై 428 కొనసాగించే విధంగా మన తరపునుంచి పిటిషన్ వేయాలని కోరారు. అలాగే గ్రామీణ వైద్యులకు టీఎంసీ అధికారుల బృందం గ్రామీణ వైద్యులపై దాడులను ఆపివేసే విధంగా కార్యాచరణ రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని సూచించారు. అనుభవ వైద్యుల సంఘాల రాష్ట్ర సమాఖ్యకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి పూర్తి సహాయ సహకారాలు తోపాటు ఆర్థిక వనరులను సమకూరుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతారపు వెంకటాచారి మాట్లాడుతూ అధ్యమైనంత త్వరగా గ్రామీణ వైద్యులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకొచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నారపోగు సుదర్శన్ పాల్గొన్నారు.

# బిచ్కుంద హోటళ్లపై సివిల్ సప్లై అధికారుల దాడులు

**16 డొమెస్టిక్ సిలిండర్ సీజ్**




**విజేత బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో మంగళవారం ఉదయం నుండి జిల్లా ఓఎస్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో డాబా,టీ పాయింట్, హోటలలో డొమెస్టిక్ సిలిండర్ వాడుతున్నట్టు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 16 డొమెస్టిక్ సిలిండర్ సీజ్ చేయడం జరిగింది.ఎనిమిది మంది హోటల్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. అనంతరం ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో తనిఖీలు నిర్వహించారు. సీజ్ చేసిన 16 సిలిండర్లను సిలిండర్ గోదాం తరలించినారు. గోదాంలో ఉన్న డొమెస్టిక్ సిలిండర్ లను తనిఖీ నిర్వహించి ఎలాంటి అవకతవకలు జరగవద్దని ఏజెన్సీ నిర్వాహకులకు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా డొమెస్టిక్ సిలిండర్లు కొరత దృష్ట్యా హోటల్ లో డాబాలలో ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదని ఎవరైనా వాడినచో సమాచారం ఇవ్వగలరని ప్రజలకు కోరినారు. ఈ తనిఖీ లలో జిల్లా అధికారులు సుదర్శన్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ సురేష్, ఖలీద్ కానిస్టేబుల్ మోబిన్, ఉపేంద్ర పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ పంటతో అధిక లాభాలు

**ఆయిల్ పామ్ పంటల సాగు పరిశీలన కోసం**

**70 బస్సుల్లో రైతులను సిద్ధిపేట జిల్లాకు పంపుతాం**

**మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**





**విజేత,పాపన్నపేట :** సాంప్రదాయ పంటల కంటే ఆయిల్ ఫామ్ పంటతోనే రైతులకు అధిక లాభాలు ఉంటాయని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం పాపన్నపేట మండలంలోని గాంధారి పల్లి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంటలను జిల్లా ఉద్యానవన శాఖ అధికారులతో పరిశీలించారు. రైతులతో ముచ్చటించారు. వాణిజ్య పంటలపై రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ ఆయిల్ పామ్ పంట సాగు విధానం, దిగుబడి పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట పెరుగుదలను పరిశీలించిన కలెక్టర్ రైతులు ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తూ ఆయిల్ పామ్ పంటను సమర్థవంతంగా సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు కోసం 2,500 ఎకరాలు లక్ష్యం గా పెట్టుకున్నారని, ఇప్పటికే 2000 ఎకరాలు సాగు అయిందని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటల సాగు పరిశీలన కోసం ఈనెల 20,21,22 తేదీలలో సిద్దిపేట జిల్లాలోని ఆయిల్ ఫామ్ పంటల సాగు పరిశీలంకోసం 70 బస్సులు ఏర్పాటు చేసి మెదక్ జిల్లా రైతులను పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ తదితర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా కిట్లను అందిస్తున్న భూక్యా సురేష్ నాయక్





**విజేత ఖమ్మం ప్రతినిధి :-** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి లోని ముస్లిం సోదర సోదరిమనులకు రాష్ట్ర ప్రభుత్వం, రంజాన్ పర్వదినం సందర్భంగా అందిస్తున్న తోఫా కిట్లు 30 వ వార్డు వరంగల్ క్రాస్ రోడ్ లోని మదర్ థెరిసా కాలనీ లో పలు కుటుంబాలకి వెళ్ళి రంజాన్ శుభాకాంక్షలు తెలిపి కిట్లను అందిస్తున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్. ఈ సందర్భంగా వారితో పాటు పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎన్. పి. చారీ, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు గణపారపు మధు, భద్రా చారీ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనుల్లో సర్పంచ్ వాంకుడోత్ నిరోషా అమర్ సింగ్

**గ్రామపంచాయతీ సిబ్బంది పనితీరును చూసి భేష్ అన్న జిల్లా కలెక్టర్**





**విజేత,ములుగు :** కాశీందేవిపేట గ్రామపంచాయతీ పారిశుద్ధ్య పనుల్లో భాగంగా గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ వాంకుడోత్ నిరోషా అమర్ సింగ్ ఆధ్వర్యంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు గొప్పగా ఉన్నాయని ప్రజలకు పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో సర్పంచ్ పాత్ర ఈ కీలకమని గ్రామపంచాయతీ సిబ్బంది పనితీరు భేష్ గా ఉందనవారి తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఏ ఈ ఓ గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భీమవరం లో వైసిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం...



**విజేత భీమవరం;** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మో హన్ రెడ్డి ఆదేశాల మేరకు భీమవరం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ చినిమిల్లి వెంకట రాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తిరుమల దేవస్థానం చైర్మన్ పదవికి బి ఆర్ నాయుడు రాజీనామా చేసి తిరుమల పవిత్రతను కాపాడాలని బి ఆర్ నాయుడుని తక్షణమే రాజీనామ చేయమని అన్నా, వారిపై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టడం, వారిని అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అనిఅన్నారు.వెంటనే వారి పైన పెట్టిన ఎస్సీ ఎస్టీ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో విచిత్రమైన పరిస్థితులు ఉన్నాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నేరం చేయకపోయినా చేసినట్లు వారిపై కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని మండిపడ్డారు.తెలుగుదేశం పార్టీ వారు పెద్ద నేరాలు చేసిన జైలుకు పంపరు,. స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బి ఆర్ నాయుడు వెంటనే చైర్మన్ పదవికి రాజీనామా చేయాలి చేయని పక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన చేత రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా భీమవరం లోని సెంటర్లో గల అంబేద్కర్ గ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులుఅర్పించారు.ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాధిరాజు రామరాజు ఎంపిపి పెరిచెర్ల నరసింహా రాజు ఎ.ఎస్.ఎన్ రాజు చిగురుపాటి. సందీప్,ఒడుగు.అశోక్ ఎస్సీ సెల్ నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# S C కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

## మార్చి 17 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరణ

**విజేత మహేశ్వరం :** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న రాజ కార్పొరేషన్ స్వయం ఉపాధి పథకాల కింద 2025--26 ఆర్థిక సంవత్సరానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మహేశ్వరం మండల అధికారులు తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగులు ఈ పథకాలకు అర్హులని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా వివిధ స్వయం ఉపాధి యూనిట్లకు రుణాలు, సబ్సిడీలు అందజేయనున్నట్లు తెలిపారు. రూ.1 లక్ష వరకు యూనిట్ వ్యయానికి 90 శాతం సబ్సిడీ, రూ.3 లక్షల వరకు యూనిట్ వ్యయానికి (వ్యవసాయం/ట్రేడ్) 70 శాతం సబ్సిడీ అందజేయబడుతుంది. రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు యూనిట్ వ్యయానికి 60 శాతం సబ్సిడీ (గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు) కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులకు డ్రైవింగ్ సంబంధిత పథకాలు, 21 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి వ్యవసాయం, భూ సంబంధిత మరియు ఇతర స్వయం ఉపాధి పథకాల ద్వారా రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయబడతాయని వెల్లడించారు. అభ్యర్థులు తెలంగాణ ప్రభుత్వ TGOBMMS https//tsob-mms.cgg.gov.in ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని, దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

**అవసరమైన పత్రాలు:**

ఆధార్ కార్డు
రేషన్ కార్డు / ఫుడ్ సెక్యూరిటీ కార్డు
కుల ధృవీకరణ పత్రం
ఆదాయ ధృవీకరణ పత్రం
డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా పథకాల కోసం) పటాదారు పాస్‌బుక్ (భూమి ఉన్న వారికి) SADAREM ధృవీకరణ పత్రం (రుణం కోసం) పాస్‌పోర్ట్ సైజు ఫోటో అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

# ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి





## వైద్యాధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రతిమాసింగ్

**విజేత,పాపన్నపేట :** ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాపన్నపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. జిల్లా వైద్య స్క్రీనింగ్ శిబిరం -- సమగ్ర నివేదిక గురించి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వైద్య స్క్రీనింగ్ జిల్లాలోని అన్ని పి హెచ్ సి లు, సబ్ సెంటర్లలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని 157 సబ్ సెంటర్లు, 19 పి హెచ్ సి లలో స్క్రీనింగ్ కార్యక్రమం జరగగా ఈ శిబిరాలలో మొత్తం 1307 మంది హైపర్‌టెన్షన్

**(బీపీ పరీక్ష), డయాబెటిస్ (రాండమ్ బ్లడ్ షుగర్ పరీక్ష)**

క్యాన్సర్ స్క్రీనింగ్ (మౌఖిక స్తన క్యాన్సర్) హిమోగ్లోబిన్ పరీక్ష తదుపరి పరీక్షల కోసం 313 రక్త నమూనాలు సేకరించబడిందన్నారు. ఈ రక్త నమూనాలను టి-హబ్ నమూనా రవాణా వ్యవస్థ ద్వారా టి-డయాగ్నస్టిక్స్ ప్రయోగశాలలకు పంపబడినవని వివరించారు. అక్కడ నిర్వహించే పరీక్షల సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్), హెచ్ బి ఎ1సి(లిపిడ్ ప్రొఫైల్), ఎల్ ఎఫ్ టి (లివర్ ఫంక్షన్ టెస్టులు), ఆర్ ఎఫ్ టి (రెనల్ ఫంక్షన్ టెస్టులు) అవసరమైన ఇతర ప్రయోగశాల పరీక్షలు స్క్రీనింగ్ సమయంలో గుర్తించిన అనుమానాస్పద కేసులను తదుపరి పరీక్షలు మరియు చికిత్స కోసం తగిన ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేయడం జరిగిందన్నారు. ప్రజలకు మెరుగైన సమర్థవంతమైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. వైద్య స్క్రీనింగ్ శిబిరం ద్వారా వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో హరిప్రసాద్, మెడికల్ ఆఫీసర్ అన్వర్, సిహెచ్‌ఓ చందర్, ఆర్ రామచందర్ గౌడ్, పాపన్నపేట సర్పంచ్ లింగంపేట పావణి నరేందర్ గౌడ్, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దత్తత తీసుకున్న పిల్లలను కన్నబిడ్డల మాదిరిగా ప్రేమతో పెంచి, వారికి మంచి విద్య, ఉన్నత భవిష్యత్తు కల్పించాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి..

**విజేత,భీమవరం ;** స్థానిక కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా ఆడపాప దత్తత ప్రక్రియను పూర్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో శిశు గృహం స్థాపన అనంతరం మొట్ట మొదటిసారిగా ఒక ఆడ శిశువును జిల్లాలోని ప్రత్యేక దత్తత విభాగం ఆధ్వర్యంలో చట్టబద్ధంగా దత్తత ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా శిశు గృహంలో ఆశ్రయం పొందుతున్న 6 నెలల వయస్సు గల "సుమ" అనే ఆడపాపను కర్ణాటక రాష్ట్రానికి చెందిన శివానంద, మానస దంపతులు దత్తతగా స్వీకరించడం జరిగిందన్నారు. ఈ దంపతులు 2022 సంవత్సరంలో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 2026 మార్చి నెలలో వారికి దత్తత అవకాశం లభించిందన్నారు. దత్తత తీసుకున్న పిల్లలను కన్నబిడ్డల మాదిరిగా ప్రేమతో పెంచి, వారికి మంచి విద్యతో పాటు ఉన్నత భవిష్యత్తు కల్పించాలని సూచించారు. పిల్లలు లేని దంపతులు దేశవ్యాప్తంగా కారా పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకుని చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. దత్తత ప్రక్రియ దేశవ్యాప్తంగా సమర్థవంతంగా కొనసాగుతోందని, ఈ కార్యక్రమం ద్వారా అనాథ పిల్లలకు మంచి కుటుంబ వాతావరణం లభించడంతోపాటు, ఉజ్వల భవిష్యత్తు కల్పించబడుతోందని తెలిపారు. అదేవిధంగా, ఇటీవల చట్టవ్యతిరేకంగా పిల్లలను కొనుగోలు చేయడం, అమ్ముకోవడం వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో, ఇలాంటి సంఘటనలు ఎక్కడైనా వెలుగులోకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టబద్ధమైన దత్తతను ప్రోత్సహించాలని తెలిపారు. దత్తత అనంతరం పిల్లల యోగక్షేమాలను తెలుసుకోవడానికి పోస్ట్ అడాప్షన్ ఫాలోఅప్ ప్రక్రియ అమలు చేయబడుతోందని, ఫాలోఅప్ నివేదికలను సంబంధిత పోర్టల్‌లో అప్లోడ్ చేస్తున్నామని వివరించారు. ఇద్దరూ



ఉద్యోగాలలో ఉన్న ఈ దంపతులు, పాపను దత్తతగా పొందడం పట్ల ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శ్రీ లక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్, శిశు గృహ మేనేజర్ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సరఫరాలో పారదర్శకకు ప్రాధాన్యం- ప్రజలకు నిరంతర సేవలు అందించాలి



## రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**విజేత, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** జిల్లాలో గ్యాస్ సరఫరాలో పారదర్శకతకు ప్రాధాన్యం -- ప్రజలకు నిరంతర సేవలు అందించాలి రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా పారదర్శకంగా, నిరంతరంగా కొనసాగాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం భూపాలపల్లిలోని హెచ్‌పీ గ్యాస్, సింగరేణి కాలరీస్‌కు చెందిన గ్యాస్ ఏజెన్సీలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారులకు అందిస్తున్న సేవలు, గ్యాస్ సరఫరా విధానం, నిల్వల పరిస్థితి, భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించారు. గ్యాస్ సిలిండర్ల నిల్వ, పంపిణీ విధానం, రికార్డుల నిర్వహణను పరిశీలించిన ఆయన వినియోగదారులకు సమయానికి గ్యాస్ సరఫరా అందించడంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను పాటించాలని సూచిస్తూ, గ్యాస్ సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు.ఎల్పీజీ డీలర్లు వినియోగదారుల బుకింగ్ సీక్వెన్స్‌ను తప్పనిసరిగా పాటిస్తూ గ్యాస్ రీఫిల్స్‌ను సరఫరా చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ క్రమాన్ని అతిక్రమించకూడదని ఆదేశించారు.జిల్లాలో గ్యాస్ కొరత ఎక్కడా లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే సోషల్ మీడియాలో వస్తున్న అపోహలను నమ్మి కొందరు వినియోగదారులు అవసరానికి మించి బుకింగ్స్ చేస్తున్నారని తెలిపారు. ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు.ఈ తనిఖీ సందర్భంగా తనిఖీలో భాగంగా రోజువారీ బుకింగ్స్, డెలివరీస్, రీఫిల్ గ్యాస్ సరఫరా విధానాన్ని సమీక్షించారు. అదేవిధంగా జిల్లాలో గ్యాస్ నిల్వలు, బుకింగ్స్, ఆయిల్ కంపెనీల నుంచి రావాల్సిన సరఫరాపై పర్యవేక్షణ కోసం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ రోజువారీ పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ సరఫరా వ్యవస్థను సక్రమంగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా యువ మండల్ వికాస్ అభ్యాన్ కార్యక్రమం



**విజేత, గణపురం :** గణపురం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం మేర యువ భారత్ వరంగల్ కేంద్రం వారి ఆధ్వర్యంలో యువ మండల్ వికాస్ అభ్యన్ కార్యక్రమం నిర్వహించి ఈ రోజు ముగింపు కార్యక్రమం గణపురం మండలం రైతు వేదికల లో నిర్వహించడం జరిగిందని కార్యక్రమ ఆర్గనైజర్ కోఆర్డినేటర్ వెల్దండ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల ప్రజా పరిషత్ అధికారి ఎంపీడీవో ఎల్. భాస్కర్, మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్,గణపురం గ్రామ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ ,ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ,మాజీ వైస్ ఎంపీపీ విడుదనేని అశోక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు పసునూటి శంకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అతిథులుమాట్లాడుతూ ఈ యువ మండల్ వికాస్ అభ్యాన్ ద్వారా యూత్, యువజన సంఘాలు అభివృద్ధికి ఎంతో గాను పాటుపడతాయని అలాగే వివిధ గ్రామాలలో ఉన్నటువంటి యువత యువజన సంఘాలుగా ఏర్పడి వారి వారి గ్రామాలను అభివృద్ధి చేసుకుంటూ వారు కూడా ఆర్థికంగా ,రాజకీయంగా అభివృద్ధి చెందాలని అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చేటువంటి ప్రయోజనాలను కూడా యువత అందిపుచ్చుకోవాలని వారు అన్నారు. అలాగే మండల పరిధిలో స్వచ్ఛందంగా అనేక కార్యక్రమాలు చేస్తూ ముందుకు రావాలని డ్రగ్స్ పైన విద్యార్థిని, విద్యార్థులు ,యూత్,యువజన సంఘాలు అవగాహన కలిగి ఉండాలని తీసుకోవడం వల్ల ప్రాణానికి ఆరోగ్యకరమని తెలియజేస్తూ అలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని యువజన సంఘాలకు తెలియజేయడం జరిగింది.అనంతరం వివిధ యువజన సంఘాలకు కేటాయించినటువంటి,మైభారత్ స్పోర్ట్స్ కిట్స్ ను పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గణపురం,రేగొండ, చిట్యాల మండలాల నుంచి ఎక్స్ వాలంటరీ దోమల నవీన్, యువత పెద్ద సంఖ్యలో యువత,యువజన సంఘాలు పాల్గొనడం జరిగింది.

# వైద్య కళాశాల ఏఓను మర్యాదపూర్వకంగా కలిసిన నేతలు

**విజేత ఖమ్మం ప్రతినిధి :** అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పదోన్నతి పొంది ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏ ఓ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సరిత ను టీఎన్జీవో నాయకులు మర్యాదపూర్వాకంగా కలవడం జరిగింది. కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా పదోన్నతి పొంది విధుల్లో జాయిన్ అయినా ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి, అభినందనలు తెలపడం జరిగింది. ఈమె గతంలో ఇదే కళాశాలలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వర్తించారు. కాగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం శాఖపరమైన పదోన్నతులు కల్పించడంతో ఈమెకు ఇక్కడే ఏవో పోస్టింగ్ లభించింది. అనంతరం ఉద్యోగుల సమస్యలపట్ల సానుకూలంగా ఉండాలని నేతలు కోరారు. ఈ కార్యక్రమం లో టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి జెడ్ ఎస్ జయపాల్ , టీఎన్జీవో మెడికల్ ఫోరం జిల్లా అధ్యక్షులు సిహెచ్ సైదులు, సీనియర్ సహాయకులు వాణి, టిఎన్జీవో నేలకొండపల్లి యూనిట్ ఉపాధ్యక్షులు కందుల విజయ్, తదితరులు పాల్గొన్నారు.



# పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్వామి దయానంద ఆశ్రమానికి హాట్ బాక్స్,సీలింగ్ ఫ్యాన్ అందజేత



**విజేత, ప్రత్తిపాడు ప్రతినిధి:** ఏలేశ్వరం పట్టణంలో క్వారిపేటలో ఉన్న స్వామి దయానంద ఆశ్రమానికి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వాగు సుజాత 4వేల రూపాయలు విలువ చేసే హాట్ బాక్స్,రాతికింద వెంకట కృష్ణారావు బ్రదర్స్ 3వేల రూపాయల విలువ చేసే సీలింగ్ ఫ్యాన్,గొల్లపూడి త్రిమూర్తులు విద్యార్థులకు పెన్నులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ఆసుపత్రి చైర్మన్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాగు రాజేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజేష్ మీడియాతో మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆశ్రమానికి హాట్ బాక్స్ ఫ్యాను అందజేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అలాగే దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి సాయం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ఉభయగోదావరి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గొల్లపూడి త్రిమూర్తులు, సిహెచ్సి చైర్మన్,ఆర్యవైశ్యుల మండల అధ్యక్షుడు వాగు రాజేష్, నరసింహ,ఊర నానాజీ,వీరబాబు, బాబా,కటకం కిరీటి, బుజ్జిబాబు, స్కూల్ చైర్మన్ శ్రీను,వాగుబద్రిష్, వాగు రాకేష్, డొక్కా సీతమ్మ సేవా సంస్థ సభ్యులు సిరి ఫుడ్ కృష్ణ, కుర్ర గోవిందు, హాస్టల్ వార్డెన్ నల్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# భీమవరం పట్టణంలోని పృథ్వీ హెచ్పి గ్యాస్ ఏజెన్సీను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి..



**విజేత,భీమవరం ;** పట్టణంలోని పృథ్వీ హెచ్పి గ్యాస్ ఏజెన్సీని సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీలో రోజువారీగా జరుగుతున్న గ్యాస్ బుకింగ్ వివరాలు, అలాగే వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేసిన తేదీలను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా అక్కడ ఉన్న గ్యాస్ వినియోగదారులతో జాయింట్ కలెక్టర్ మాట్లాడి గ్యాస్ సరఫరాలో ఇబ్బందులపై ఆరా తీశారు. ప్రస్తుతం గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని వినియోగదారులు తెలియజేశారు. గ్యాస్ సిలిండర్లను బుకింగ్ చేసిన తేదీ ప్రాతిపదికగా తీసుకుని ఎక్కువ రోజులు వెయిటింగ్‌లో ఉన్న వినియోగదారులకు ప్రాధాన్యత ఇవ్వాలని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లోనూ రసీదులో పేర్కొన్న ధర కంటే ఎక్కువ ధరను వినియోగదారుల నుండి డిమాండ్ చేయరాదని స్పష్టం చేస్తూ, అలాంటి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీలో భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు, ఏ ఎస్ ఓ రవిశంకర్, సి ఎస్ డి టి, వీఆర్వోలు పాల్గొన్నారు.

# బాతు ఆకారంలో టమాట




**విజేత,గణపురం :** గణపురం మండల కేంద్రంలో వారాంతపు సంత లో టమాటా రేటు భారీగా పడిపోవడంతో పది రూపాయలకు రెండు కిలోల టమాటాను వ్యాపారస్తులు అమ్ముతుండగా వినియోగదారులు టమాటాలను కొనేందుకు భారీగా ఎగబడ్డారు. ఈ క్రమంలో టమాటాలో అరుదుగా కనిపించే ఒక దృశ్యం టమాట బాతు ఆకారంలో ఉండడంతో టమాటాలు కొనే వ్యక్తులు ఆశ్చర్యపోయారు. టమాట బాతు ఆకారంలో ఉండడంతో చిన్నపిల్లలు ఎంతో సంతోషంగా ఆ టమాటాను చూసినందుకు ఎంతో ఆనందంగా ఉందని సంతోషాన్ని వ్యక్తం చేస్తూ టమాటాను కొనుక్కొని తమ ఇంటికి తీసుకు వెళ్లడం జరిగింది.



# వేలేరుపాడు మండలం జిన్నెలగూడెం గ్రామంలో విషాదం





**విజేత వేలేరుపాడు :** ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం జిన్నెలగూడెంగ్రామం లో తురసం లక్ష్మీ రవి దంపతులకు ముగ్గురు సంతానం ఇద్దరమ్మాయిలు ఆకరి అబ్బాయి తురసం ధనుష్ మూడు సంవత్సరాలు ఇంట్లో నిద్రపోతుండగా త్రాచు పాము కరిచి చనిపోయాడు

## పెందుర్తి పరిదిలో రెండు కిలోల గంజాయి స్వాధీనం



**విజేత పెందుర్తి:** పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో దొగ్గవానిపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో దాడి చేసిన పోలీసులు రెండు కిలోల గంజాయి ని స్వాధీనం చేసుకున్నారు, మంగళవారం పెందుర్తి పోలీస్ స్టేషన్ కు అందిన సమాచారం మేరకు స్టేషన్ ఇన్స్పెక్టర్ కే.వి.సతీష్ కుమార్ సూచనమేరకు సబ్ ఇన్స్పెక్టర్ ఎన్.వి భాస్కరరావు తన సిబ్బందితో కలిసి దొగ్గవానిపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో ఒక అనుఆనితుడు పోలీసులను చూసి పరిగెత్తె ప్రయత్నం చేయగా పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారించగా అతనిని ఆకేష్ వెంకటేష్ (20) బెంగళూరు నివాసిగా గుర్తించి అరుకులొ గంజాయి కొనుగోలు చేసి బెంగళూరు లొ అమ్మె ప్రయత్నం చేస్తున్న అతని వద్దనుండి రెండు కిలోల గంజాయి ని సెల్ ఫోను, గంజాయి రవాణా కు ఉపయోగించిన నీలం రంగు బ్యాగ్ ను చట్ట పరమైన ప్రక్రియల అనంతరం స్వాధీనం చేసుకున్నారు.

## గుండెపోటుతో ఆరోగ్య మిత్ర కుకునూరు సంజీవరెడ్డి మృతి



**విజేత,పాపన్నపేట :** ఆరోగ్యశ్రీ విభాగంలో ఆరోగ్యమిత్ర గా గత 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న పాపన్నపేట గ్రామానికి చెందిన కుకునూరు సంజీవరెడ్డి సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆరోగ్య మిత్రగా గత కొంతకాలం టేక్మాల్ , రామయంపేట పి హెచ్ సి లలో, ప్రస్తుతం మెదక్ ఆర్తో హాస్పిటల్ ఆరోగ్యమిత్రగా పని చేస్తూ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఆయన స్వగ్రామమైన పాపన్నపేటలో అంత్యక్రియలు నిర్వహించారు. వీరి కుటుంబ సభ్యులను ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ వారు ఆదుకోవాలని ఆ యూనియన్ నాయకులు కోరారు.

## రైతులసంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది..

నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి..



**విజేత, పెద్ద శంకరంపేట్ :** మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతులకు సకాలంలో రుణాలు అందించడం, వ్యవసాయానికి అవసరమైన ఆర్థిక సహాయం కల్పించడంలో సహకార సంఘాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. నూతన భవనం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ సంఘం దోహదపడుతుందని పేర్కొంటూ, ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రాయిని మధుసూదన్, దానం పల్లి నారా గౌడ్, ఆసూరి మురళి పంతులు, ఆర్ ఎన్ సంతోష్ కుమార్, పేట ఉప సర్పంచ్ ఎర్ర రాజు గౌడ్ ప్రాథమిక సహకార సంఘం ఉద్యోగులు మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోదర భావానికి ప్రతిక పవిత్ర రంజాన్ మాసం..

నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి..



**విజేత, పెద్ద శంకరంపేట్ :** పెద్ద శంకరంపేట మండల కేంద్రంలో రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. పేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అసురీ మురళి పంతులు ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ విందులో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ పవిత్రమైన పర్వదినమని, ఈ నెలలో మనుషుల మధ్య ప్రేమ, ఐక్యత, సహన భావాలు మరింత పెరుగుతాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సామాజిక సౌహార్దాన్ని పెంపొందించడంలో కీలకమని, అన్ని మతాల ప్రజలు కలిసి పండుగలను జరుపుకోవడం మంచి సంప్రదాయమని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఎస్సై ప్రవీణ్ రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు మరియు ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కందికట్కూర్ లో మద్యం అమ్మకం నిషేధం



**విజేత ఇల్లంతకుంట :** మండలంలోని కందికట్కూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ విజయమ్మ అధ్యక్షతన పాలక మండలి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామసభలో పాలక మండలి గ్రామ ప్రజలు కలిసి గ్రామ అభివృద్ధి కొరకు పలు అంశాలపై చర్చించి గ్రామంలో మద్యం షాపులు మూసివేయాలని,గుట్కా కి సంబంధించిన వాటిని కూడా అమ్మరదని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయమ్మ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు రావు,ఉప సర్పంచ్ అజయ్,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదాలు -- జాగ్రత్తగా వాహనాలు నడపాలి

ఒక్కరి నిర్లక్ష్యం కుటుంబాన్ని రోడ్డున పడేస్తుంది..

ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతి..

నిర్లక్ష్యం, అతివేగం, మద్యం డ్రైవింగ్ ప్రమాదాలకు ప్రధాన కారణాలు..

జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు..




**విజేత, పెద్ద శంకరంపేట్:** రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఎరైవ్ అలివే " కార్యక్రమంలో భాగంగా మంగళవారం శంకరంపేట్-ఆర్ మండలంలోని ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న శాతం ఎక్కువగా ఉందని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. ఇంటి పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని, ఒక్కరి నిర్లక్ష్యం వల్ల కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. "ప్రమాదం ముందస్తుగా చెప్పి రాదు" అనే విషయాన్ని గుర్తుంచుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. జిల్లాలో గత సంవత్సరం చేపట్టిన వాహన తనిఖీల ద్వారా సుమారు 69 రోడ్డు ప్రమాద మరణాలను నివారించగలిగామని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయడం వల్ల ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరి ప్రాణ భద్రత కోసం ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని, జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలను ఉదాహరణలుగా వివరించి సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, సీఐ లు వెంకట రాజా గౌడ్, రాజశేఖర్ రెడ్డి, ఎసై నారాయణ గౌడ్, ఎంఎస్ఎన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గణపురం గ్రామ క్రికెట్ టోర్నమెంట్



**విజేత,గణపురం :** గణపురం మండలం కేంద్రంలో ఉగాది ,రంజాన్ పండుగల సందర్భంగా గణపురం గ్రామంలో క్రికెటర్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. ఈ గ్రామ క్రికెట్ టోర్నమెంట్ కు గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి 10000/-రూపాయలు, ట్రోఫీని భూపాలపల్లి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు, రెండవ బహుమతి బోగిరి రమేష్ వారి నాన్న జ్ఞాపకర్థం 3016/-రూపాయలను విజేతలకు అందించనున్నట్లు తెలిపారు.అలాగే రన్నరప్ టీంకు ట్రోఫీనీమాజీఎంపీటీసీషమపాషా, బెస్ట్ బాట్స్మన్ -1000/- కట్కూరి అన్వేష్, బెస్ట్ బౌలర్ -1000/- దేవా హరీష్,బెస్ట్ క్యాచ్-516/- యామ సుధీర్, హైయెస్ట్ సిక్స్ -516/- మచ్చిక రక్షిత్,ఈ టోర్నమెంట్ కోసం బాల్స్ ని ఉష ఎలక్ట్రికల్,వర్ష ఎలక్ట్రికల్ యజమాన్యం, గ్రౌండ్ లెవెల్లింగ్ కోసం మామిండ్ల మల్లేష్, మోతపోతుల రాము ఎర్ర మట్టిని ప్రదానం చేయనున్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో గణపురం గ్రామ క్రికెట్ క్రీడాకారులు పాల్గొని క్రీడలను ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సహకరించాలని క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు కోరారు.

## అట్టహసంగా ప్రారంభమైన నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు



**విజేత దేవరపల్లి :** దేవరపల్లి:మండలంలోని గౌరీపట్నం నిర్మలగిరిలో జరగనున్న మేరీమాత మహోత్సవాలకు సోమవారం అంకురార్పణ చేశారు.ఈ సందర్భంగా పుణ్యక్షేత్రంలో జరిగిన ప్రారంభం వేడుకలలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఏలూరు పీఠాధిపతులు మోస్ట్ రెవ.డా.జయరావు పొలిమేర పతాకావిష్కరణ,అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జపమాల ధ్యానం,దివ్య బలిపూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జయరావు పొలిమేర మాట్లాడుతూ నిర్మలగిరి పుణ్య క్షేత్రాన కొలువై వున్న మరియతల్లి ఉత్సవాలు ప్రతి యేటా వైభవంగా నిర్వహించడం జరుగుతోందని,ఎందరెందరో భక్తులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి అమ్మ దీవెనలు పొందుతున్నారని పేర్కొన్నారుఅత్యంత వైభవంగా జరగనున్న ఈ ఉత్సవాలలో పాల్గొననున్న భక్తులకు ఎట్టి విధమైన ఇబ్బందులు కలగకుండా తగిన రక్షణ చర్యలు చేపడుతున్నామని,అలాగే భక్తులందరికి వైద్య సహాయం,ఆహారం,త్రాగునీరు సమృద్ధిగా అందించడం జరుగుతోందని తెలియజేసారు.ప్రధానంగా మార్చి 22,23,24,25,తేదీలలో జరిగే విశేష కార్యక్రమాలలో పలువురు ప్రముఖులు పాల్గొని తమ దివ్య సందేశములను అందించడం,అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగే ఈ ఉత్సవాలలో సుమారు 10 లక్షల మంది భక్తులు పాల్గొననున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నిర్మలగిరి పుణ్య క్షేత్ర డైరెక్టర్ డా.జాన్ పీటర్,తదితర పీఠాధిపతులు అన్నదాన కాంట్రాక్టర్ కళ్ళే నాగేశ్వరరావు,భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అప్పయ్య పల్లి గ్రామంలో హెల్త్ క్యాంప్



**విజేత ,గణపురం :** గణపురం మండలం అప్పయ్య పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎలుక పెల్లి రమేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రాణాలికలో భాగంగా హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది.గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని నిర్వహించిన కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై వారి ఆరోగ్యాన్ని డాక్టర్ నిహారిక ఆధ్వర్యంలో బిపి. షుగర్.కంటి.దంత. జనరల్ పరీక్షలు నిర్వహించి తగిన మెడిసిన్ మందులు అందించి జాగ్రత్తలు చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వినోద, వేణు,ఆశ వర్కర్, పద్మ,కారోబార్ రాజు ప్రజలు పాల్గొన్నారు.

## శంకరంపేటలో యజమానిలేని 7 వాహనాలు -- 15 రోజుల్లో స్వాధీనం చేసుకోవాలి..





**విజేత, పెద్ద శంకరంపేట్ :** మెదక్ జిల్లా అల్లాదుర్గ్ సర్కిల్ పరిధిలోని శంకరంపేట (ఏ) పోలీస్ స్టేషన్ లో యజమానులు లేకుండా వదిలివేయబడిన 7 వాహనాలను పోలీసులు గుర్తించి భద్రపరిచారు.పెద్ద శంకరంపేట ఎస్సై ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, వీటి నమోదిత యజమానులకు ఇప్పటికే భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), 2023 చట్టంలోని సెక్షన్ 106 ప్రకారం భారత తపాలా ద్వారా నోటీసులు పంపినప్పటికీ ఎటువంటి స్పందన రాలేదన్నారు.దీంతో ఈ ప్రకటన ద్వారా చివరి అవకాశం కల్పిస్తూ, సంబంధిత యజమానులు లేదా చట్టబద్ధ హక్కు కలిగిన వారు ప్రకటన తేదీ నుంచి 15 రోజుల్లోపు శంకరంపేట (ఏ) పోలీస్ స్టేషన్‌కు హాజరై, వాహనాల అసలు నమోదు పత్రం (ఆర్‌సీ)తో పాటు ఇతర అవసరమైన పత్రాలు చూపించి తమ వాహనాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు.గడువులో ఎవరూ హాజరుకాకపోతే, ఈ వాహనాలను యజమాని లేని ఆస్తిగాపరిగణించి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 503 ప్రకారం వేలం వేయడం లేదా చెత్తగా (స్క్రాప్) మార్చడం వంటి చట్టపరమైన చర్యలుతీసుకుంటామని తెలిపారు.ఈ వాహనాల్లో టీవీఎస్ ఎక్స్ఎల్, యమహా ఎఫ్‌జెడ్, బజాజ్ అవెంజర్, హీరో స్ప్లెండర్ మోటార్ సైకిళ్లు, డీజిల్ ఆటో రిక్షా ఉన్నాయి.

## ప్రభుత్వ పాఠశాలలో హ్యూమనేటిస్ అధ్యాపకులు పర్యటన

**విజేత దేవరపల్లి :** దేవరపల్లి మండలం లోని





గౌరీపట్నం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్ మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్( ఎస్డబ్ల్యూ) లను బొమ్మూరు ప్రభుత్వ డైట్ లెక్చరర్ ఎస్. రవికుమార్ (హ్యూమానిటీస్ అధ్యాపకులు ) పర్యటన జరిపి పాఠశాలలోని విద్యార్థుల అందరి సామర్థ్యములను పరిశీలన జరిపి విద్యార్థుల యొక్క ప్రస్తుత సామర్థ్యములను స్ట్రీమ్(అక్షరములను గుర్తించలేని వారు), మౌంటెన్(పదములను పలక లేని వారు), స్కై (వాక్యములను పేరాలను బాగా చదివేవారు)అనువాటిలో చాలా తక్కువ మంది విద్యార్థులు స్ట్రీమ్ లో ఉన్నట్టు తెలియజేశారు. ప్రస్తుతము స్ట్రీమ్ లో ఉన్న విద్యార్థులందరూ కూడా మౌంటెన్ లేదా స్కై లోకి రావడానికి చేయవలసిన ప్రయత్నం లను సూచనలు సలహాలను పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేశారు . ప్రభుత్వ ప్రణాళికల ద్వారా( జి ఎల్ ఎఫ్ ఎన్) భాగంగా విద్యార్థుల లో సామర్థ్య మెరుగుదలకు కృత్యములను ఉపాధ్యాయుల సహకారంతో చేయించారు .వారి పర్యటనలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు క్లస్టర్ పర్యవేక్షణ సహాయకారి ఎన్. అరుణ్ కుమార్ సహాయకులుగా వ్యవహరించినారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం..రమాదేవి, ఎన్..సంజీవ్ కుమార్ లు సమక్షంలో పర్యవేక్షించారు. వీరి పర్యటనలో పాఠశాల విద్యార్థుల ప్రస్తుత సామర్థ్యముల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. వీరు భాష అనగా తెలుగు మరియు గణితములలో సామర్థ్యం లను పర్యవేక్షించారు.

## హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలం

తహసీల్దార్ కు వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు



**విజేత : హుస్నాబాద్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం హుస్నాబాద్ మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారి కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తుందని రాష్ట్రంలో అర్హులైన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదని,వికలాంగులకు,వితంతువులకు,వృద్ధులకు నూతన పింఛన్లు మంజూరు చేయడం లేదని,ఎన్నికల సమయంలో అనేక ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు పెట్టుబడి సాయం ఎకరాకు 6000 రుపాయలు వేస్తామని చెప్పి మూడు విడతల పైసలు ఎగ్గొట్టి రైతులను మోసం చేస్తోందన్నారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం జరిగందని . కానీ వాటిలో ఏ ఒక్క హామీ కూడా ఇప్పటివరకు పూరిగా అమలు కాలేదు. ముఖ్యంగా యువతకు జాబ్ క్షలండర్, నిరుద్యాగ భృతి, వృద్ధాప్య ,వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్యాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం అనేక హామీలు ఇప్పటికే అమలు కావడం లేదు. ప్రభుత్వం మీద నమ్మకం పెట్టుకొని ఓట్ల వేసిన ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుతవంపై తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు .మండలంలో రైతులు తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు . ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా సమయానికి అందకపోవ్డంతో రైతులు పెట్టుబ్డుల కోసం అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏరపడుతోంది. అలాగే వృద్ధాప్య వితంతు దివ్యాంగులకు ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్లు అర్హులైన లబ్ధిదారులకు అందడం లేదు మండలంలో దరఖాస్తు చేసుకున్న అనేకమంది వృద్ధులు వికలాంగులు ఒంటరి మహిళలకు ఇప్పటికి పెన్షన్లు మంజూరు కాలేదు అర్హులైన అభ్యర్థుల అందరి దరఖాస్తులను వెంటనే ఆమోదించి వారికి పెన్షన్లు అందించాలని డిమాండ్ చేశారు పేదలకు ప్రభుత్వం ప్రకటించిన గృహ నిర్మాణ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఇల్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ప్రజలు దరఖాస్తులు సమర్పించినప్పటికీ వారి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని ఆ సమస్యల పరిష్కారం తక్షణమే పరిష్కరించాలని గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ మౌలిక సదుపాయాలు మరియు వీధిదీపాలు వంటి ప్రాథమిక సదుపాయాలు సరైన విధంగా అందడం లేదు ఈ సమస్యల పైన వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు బొమ్మగాని సతీష్,మాజీ ఎంపీటీసీ కుంట మల్లయ్య బూతగడ్డపు బాలరాజ్ కన్నె శంకర్ భాషవేణి వెంకటేష్ రత్నాకర్ రెడ్డి వంగ శ్రీనివాస్ రెడ్డి బూత్ అధ్యక్షులు పుట్ట కొమురయ్య మొరుగు రవీందర్ గంటల రాజేందర్ కొన్నబోయిన నారాయణ తదితరులు పాల్గొన్నారు

## బజార్ హత్నూర్‌లో ప్రజా పాలన హెల్త్ క్యాంప్‌కు ప్రజల భారీ స్పందన





**విజేత, బజార్ హత్నూర్ ప్రతినిధి :** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక హెల్త్ క్యాంపును సర్పంచ్ సాయన్న ఘనంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో రిమ్స్ నిపుణులు డా. తేజస్విని (శిశు), డా. సౌజన్య (స్త్రీ), డా. శ్రీజ (కంటి), డా. వినీత్ (జనరల్ మెడిసిన్), డా. శరత్ రావు (ఎముకలు), డా. వినోద్ (దంత) పాల్గొని రోగులను పరిశీలించారు. ఈ వైద్య శిబిరానికి మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి తమ ఆరోగ్య సమస్యలను పరీక్షించించుకున్నారు. మొత్తం 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, అందులో 18 మందిని మెరుగైన చికిత్స కోసం రిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై వైద్యులు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయన్న మాట్లాడుతూ ఇలాంటి శిబిరాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు డా. భీంరావ్, డా. శిల్ప, డా. అలేఖ్య, ప్రజా ప్రతినిధులు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు చురుకుగా పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# రఘునాథపల్లి తహశీల్దార్‌గా బి. రాజేష్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



**విజేత రఘునాథపల్లి :** రఘునాథపల్లి మండల నూతన తహశీల్దార్‌గా బి. రాజేష్ రెడ్డి సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. జనగామ జిల్లా కలెక్టర్ ఇటీవల చేపట్టిన తహశీల్దార్ల బదిలీల్లో భాగంగా, జఫర్‌గఢ్ తహశీల్దార్‌గా పనిచేస్తున్న రాజేష్ రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఫణికిషోర్ జనగామ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.

**బాధ్యతల స్వీకరణ – అభినందనలు**

పదవీ బాధ్యతలు చేపట్టిన రాజేష్ రెడ్డిని మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది మరియు పలువురు ప్రముఖులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కార్యాలయ సిబ్బందితో పరిచయ కార్యక్రమం నిర్వహించారు.

**పారదర్శక సేవలే లక్ష్యం**

ఈ సందర్భంగా తహశీల్దార్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. మండల ప్రజలకు రెవెన్యూ సేవలను అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా అందించడమే తన ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు.

"ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా కార్యాలయానికి వచ్చి సంప్రదించవచ్చు. నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తాను." అని ఆయన హామీ ఇచ్చారు.

# ఎన్నికల హామీలు నెరవేర్చాలని బీజేపీ డిమాండ్

## ఎమ్మార్వో కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు




**విజేత, హైదరాబాద్ బ్యూరో :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారము లోకి వచ్చి కాలం గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని బీజేపీ నేతలు ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టుతూ స్థానిక ఎమ్మార్వో కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సీతాఫల్ మండి డివిజన్ బీజేపీ ప్రెసిడెంట్ ఈ వి నరేష్ తెలిపారు. ఉద్యోగ భర్తీ, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య పెంచెన్, తులం బంగారం ఇవ్వలేదన్నారు. గ్రామీణ ప్రాంతంలో భూభారతి సదస్సు లు చేపట్టి రైతుల సమస్యలు తీర్చుతామని చెప్పారు కానీ అమలుకు నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైస్ ప్రెసిడెంట్ కంకటల్ల హరి,కండి జిల్లా వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వర్ రెడ్డి,మీడియా కన్వీనర్ అజయ్ నాయుడు, కృష్ణా మూర్తి, లీగల్ సెల్ కన్వీనర్ భాస్కర్ గిరి, ప్రభు గుప్తా,సురేష్, సురేందర్,సతీష్, వినయ్ అంబాలా రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీసాయి స్కూల్ వార్షికోత్సవం... అలరించిన చిన్నారుల ఆటా పాటా..!



**విజేత మామడ:** మండలంలోని పొన్కల్ గ్రామంలో మంగళవారం రోజున శ్రీసాయి అప్పర్ ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్యాలు ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ...విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు శ్రీసాయి స్కూల్ ఎంపిక కచ్చితమైనభరోసా కల్పిస్తుందని ప్రసంగించారు. ప్రిన్సిపల్ అశోక్ మాట్లాడుతూ ..ఇది కేవలం వార్షికోత్సవ కార్యక్రమం మాత్రమే కాకుండా విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే వేదిక అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.

# జిల్లాలో బేకరీలు చికెన్ సెంటర్లపై సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు అకస్మిక తనిఖీలు



**విజేత జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి జిల్లాలోని వివిధ బేకరీలు మరియు చికెన్ సెంటర్లపై మంగళవారం సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా గృహ అవసరాలకు మాత్రమే వినియోగించాల్సిన ఎల్పీజీ సిలిండర్లను వాణిజ్య అవసరాల కోసం ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. మొత్తం 6 గృహ వినియోగ సిలిండర్లను స్వాధీనం (సీజ్) చేసుకున్నారు. అలాగే, ఎవరూ అక్రమ నిల్వలు మరియు అక్రమ అమ్మకాలు చేయరాదని సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, గృహ వినియోగానికి కేటాయించిన సిలిండర్లను వాణిజ్య వంటలకు ఉపయోగించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఇటువంటి అక్రమ వినియోగం వల్ల ప్రభుత్వానికి నష్టం కలగడమే కాకుండా, అర్హులైన గృహ వినియోగదారులకు ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. అందువల్ల, ఎవరూ గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించరాదని ఆయన హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమ వినియోగం ఎవరైనా చేస్తూ పట్టుబడితే, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని నిత్యావసరాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అదేవిధంగా, అన్ని వ్యాపార సంస్థలు ప్రభుత్వ నిబంధనలు మరియు మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు.

# బాల్కొండ లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న పోలీస్ కమీషనర్





**విజేత, బాల్కొండ :** నేడు బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ని జమా మసీద్‌లో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవనీయులు నిజామాబాద్ పోలీస్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్.,లిముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కమిటీ నిర్వహించిన దువాలో సీపీ పాల్గొని, అనంతరం ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రంజాన్ మాసం విశిష్టతను విశ్లేషణాత్మకంగా వివరించారు. రంజాన్ అనేది కేవలం ఉపవాసాల నెల మాత్రమే కాకుండా, మనస్సును పరిశుభ్రం చేసుకునే ఆత్మపరిశీలన కాలమని అన్నారు. ఉపవాసం ద్వారా నియమం, సహనం, క్రమశిక్షణ పెంపొందుతాయని, పేదల పట్ల కరుణాభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. దానధర్మాలు, సహనశీలత, సోదరభావం వంటి విలువలు ఈ పవిత్ర మాసంలో మరింత ఆవిష్కృతమవుతాయని చెప్పారు. అల్లా కృపతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం,సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. అలాగే అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగి నిజామాబాదుకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి,బాల్కొండ ఎస్సై శైలంధర్, మైనారిటీ ప్రెసిడెంట్ మజారుద్దీన్ , వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ రియాజుద్దీన్ , సెక్రెటరీ ఎండి అక్బర్ మరియు ముస్లిం సోదరులు పాల్గొన్నారు. సీపీ హాజరుకావడం పట్ల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆటో ని డికొట్టిన లారీ

## ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



**విజేత,,పినపాక :** పినపాక మండలం, ఏడూళ్ల బయ్యారం గ్రామంలోని మసీదు ఎదురుగా ఆటో లారీ ఎదురెదురుగా ఢీకొని ఆటో నడుపుతున్న డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్సై సురేష్ సంఘటన స్థలానికి చేరుకొని విచారించి లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి మండల పరిధిలోని ఏల్చిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మర్రి సంజయ్ ఆటో నడుపుతు బయ్యారం నుండి క్రాస్ రోడ్డు కు వెళుతున్నాడు. అదే క్రమంలో క్రాస్ రోడ్డు నుండి బయ్యారం వెళుతున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వలన బయ్యారం గ్రామంలో మసీదు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీనితో ఆటో నడుపుతున్న సంజయ్ రోడ్డుపై కిందపడి తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సంజయ్ మేన మామ మద్దెబోయిన జంపయ్య ఫిర్యాదు మేరకు డ్రైవర్ పై కేసు నమోదు చేయడం జరిగింది.

# రైతన్నకు అండగా కూటమి ప్రభుత్వం - ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం



**విజేత . బుట్టాయగూడెం :** ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామంలో రైతన్న మీకోసం వారోత్సవాల కార్యక్రమంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతన్నకు అండగా ఉంటుందని తెలిపారు. రైతు బాగున్నప్పుడే సమాజం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. రైతు సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలియజేశారు. వ్యవసాయ పరికరాలు సబ్సిడీతో రైతన్నలకు అందిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఎరువుల కొరత లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని బొరగం పేర్కొన్నారు. డ్రోన్లు మరియు ఆధునిక యంత్రాలను ప్రోత్సహించి, ఆధునిక పద్ధతులతో వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ పొట్టా రామారావు ,మండల పార్టీ అధ్యక్షులు మాజీ ఎ ఎం సి చైర్మన్ పారెపల్లి రామారావు , డైరెక్టర్ పెండ్యాల రమాదేవి,సొసైటీ అధ్యక్షులు యానమదల మాధురి ప్రసాద్, మండలం ప్రధాన కార్యదర్శి చిటికిన గంగాధర్,జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల అరుణ,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ జారం చాందిని, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పారెపల్లి నరేష్,అగ్రికల్చర్ ఎ ఓ పోసిరావు,అగ్రికల్చర్ విలేజ్ సెక్రటరీ రాయల సత్యన్నారాయణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ,మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ సిద్ధు, ఆకుమర్తి సురేష్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి బొబ్బర చిన్న రాజు, టౌన్ పార్టీ అధ్యక్షులు ఆరేటి వీరపండు,జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ మనెల్లి బాలు పాల్గొన్నారు.

# ఇక సెలవు మళ్లీ కలుద్దాం



**విజేత విశాఖ బ్యూరో:** మంగళవారం తొ తన పదవీకాలం ముగియనున్న సందర్భంగా "ఇక సెలవు మళ్లీ కలుద్దాం"అని విశాఖ ప్రజలను ఉద్దేశించి అన్నారు విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు,17 వ తారీఖు మంగళవారం తొ తన పదవీకాలం ముగియడంతో పాత్రికేయుల సమావేశాన్ని తన చాంబర్లో ఏర్పాటు చేశారు,ఈ సందర్భంగా పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ నేను మేయరు గా కొనసాగినంత కాలం ఎమ్మెల్యే లు, ఎంపీలు,కార్పోరేటర్లు, అలాగే జివిఎంసి అధికారులు తమ సహకారాన్ని అందించారని దీనిని ఎప్పటికీ మరువలేనన్నారు,760 కోట్ల రూపాయల తొ విశాఖ లొ అభివృద్ధి పనులు చేసానని అలాగె ఈ పదకొండు నెలల పాలనను దిగ్విజయంగా పూర్తి చేసాని, దీనికి విశాఖ ప్రజల సహకారం మరువలేనిదని అన్నారు, విశాఖ లో వార్డులవారీగా సమస్యలను పరిస్కరించడంలొ సఫలీకృతమయ్యామన్నారు,+20 ,×ఖీ= ఇతర మేజర్ ఈవెంట్స్ ని శభాష్ అనెలా చేశామన్నారు, మీడియా మిత్రుల సహకారం మరువలెనిదని కొనియాడారు, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి పాలనలొ రియల్ ఎస్టేట్ కు రోడ్లు వేస్తె మాపాలనలొ ప్రజలకు కావాల్సిన రహదారులు వేసామని తెలిపారు,తక్కువరోజులైనా ప్రజారంజకంగా పాలన అందించామని ఈ అవకాశాన్ని కల్పించిన తెలుగుదేశం పార్టి అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, మంత్రి లోకేష్ బాబు కు ఈ సందర్భంగా క్రృతజ్ఞతలు తెలుపుకుంటున్నాన న్నారు,ఎప్పటిలాగె సాధారణ కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ కి విదేయుడునై ఉంటానన్నారు.

# ఇంటి వద్దకే సేవలు అందించిన కౌన్సిలర్ సౌజన్య విజయ్ కుమార్




**విజేత బెల్లంపల్లి :** 3వ వార్డు (అంబేద్కర్ నగర్)లో కౌన్సిలర్ బెద్దల సౌజన్య విజయ్ కుమార్ ప్రజా సేవలో మరోసారి ఆదర్శంగా నిలిచారు. వృద్ధులు, వికలాంగులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లలేని పరిస్థితిని గుర్తించి, వారి ఇళ్లకే వెళ్లి అవసరమైన పత్రాలను సేకరించి పెన్షన్ పొందేందుకు కావలసిన ఇన్‌కం సర్టిఫికెట్లను సిద్ధం చేయించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరాలనే లక్ష్యంతో, వృద్ధులు, వికలాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దగ్గరగా తెలుసుకుని వెంటనే స్పందించారు. కార్యాలయాల చుట్టూ తిరగలేని పరిస్థితిలో ఉన్న వారికి ఈ సేవ ఎంతో ఉపశమనం కలిగించింది. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పత్రాలు సేకరించడమే కాక, అవసరమైన ధృవపత్రాల కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేసి ప్రక్రియను వేగవంతం చేశారు. దీంతో అనేక మంది వృద్ధులు, వికలాంగులు తక్కువ సమయంలోనే తమ పెన్షన్ పొందేందుకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజల సమస్యలను అర్థం చేసుకుని ఇంటి వద్దకే వచ్చి పరిష్కారం చూపడం అభినందనీయం అని తెలిపారు. ఇలాంటి ప్రజానుకూల కార్యక్రమాలు మరింత మందికి ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని కౌన్సిలర్ బెద్దల సౌజన్య విజయ్ కుమార్ తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడి దుర్మరణం: దోనబండలో విషాదం



**విజేత :రఘునాథపల్లి:** జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. చేపల వేట కోసం వెళ్లిన ఓ యువ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి ప్రాణాలు కోల్పోయాడు.

**సంఘటన వివరాలు:**

మండలంలోని కంచనపల్లి గ్రామ శివారులో ఉన్న దోనబండ ప్రాంతానికి చెందిన ఇలబోయిన మల్లేశం (30) అనే మత్స్యకారుడు మంగళవారం మధ్యాహ్నం చేపలు పట్టడానికి చెరువులోకి వెళ్లాడు. అయితే, ఊహించని విధంగా ప్రమాదం జరగడంతో నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు.

**కుటుంబంలో విషాదఛాయలు:**

మల్లేశం మరణవార్త విన్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె మరియు ఒక కుమారుడు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న మల్లేశం అర్థాంతరంగా మృతి చెందడంతో దోనబండ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సింగరేణి సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ వినతిపత్రం



**విజేత బెల్లంపల్లి :** గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పిలుపు మేరకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం చర్చల స్థాయి ప్రతినిధి సివి రమణ, పిట్ కార్యదర్శి సృజన గీతిక ఆధ్వర్యంలో కార్మిక సోదర సోదరీమణుల సమక్షంలో "సేవ సింగరేణి" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ భవిష్యత్తు, కార్మికుల సమస్యల పరిష్కారం, పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జనరల్ మేనేజర్ ఎన్. రాధా కృష్ణకు సమర్పించారు. కార్యక్రమంలో స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సివి రమణ వినతిపత్రంలోని ముఖ్య అంశాలను వివరించారు. ముఖ్యంగా మెడికల్ బోర్డు పునరుద్ధరణ, పెర్క్‌పై ఇన్కమ్ టాక్స్ రిఫండ్, నియామకాలు చేపట్టి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి సృజన గీతిక, జీఎం చర్చల స్థాయి ప్రతినిధి రమణ రావు, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ బొమ్మ శ్రీనివాస్, పిట్ కమిటీ సభ్యులు బింగి సత్యనారాయణ, లక్ష్మణ్, జలది, జ్యోతి, తాజుద్దీన్, సుమలత, జీఎం ఆఫీస్ సిబ్బంది శ్వేత, హిమబిందు, మాధవి, నవీన, స్రవంతి, శిరీష, లావణ్య, స్వాతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో ఓ మృతదేహం లభ్యం



**విజేత, ఇబ్రహీంపట్నం :-** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం అయింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరగూడ సమీపంలోని కెఎంఆర్ ఫంక్షన్ హాల్ వెనుక ఓ గుర్తుతెలియని యువకుడి శవం లభ్యం గత ఐదు రోజుల క్రితం మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళ్ల గూడెం గ్రామానికి చెందిన అర్జున్ గౌడ్ (30) అనే యువకుడు తప్పిపోయినట్లు, అర్జున్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు, అర్జున్ అనే కోణంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు, శవాన్ని పోస్టుమార్టం నియమితం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

# ఘనంగా శ్రీసాయి స్కూల్ వార్షికోత్సవం...

## అలరించిన చిన్నారుల ఆటా పాటా..!





**విజేత మామడ:** మండలంలోని పొన్కల్ గ్రామంలో మంగళవారం రోజున శ్రీసాయి అప్పర్ ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్యాలు ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ...విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు శ్రీసాయి స్కూల్ ఎంపిక కచ్చితమైనభరోసా కల్పిస్తుందని ప్రసంగించారు. ప్రిన్సిపల్ అశోక్ మాట్లాడుతూ ..ఇది కేవలం వార్షికోత్సవ కార్యక్రమం మాత్రమే కాకుండా విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే వేదిక అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.

# బతుకమ్మపై సర్కారు శీతకన్ను



సోయిలేని కాంగ్రెస్ పాలనలో బతుకమ్మ తీరు మారింది. స్వరాష్ట్ర ఉద్యమానికి నేపథ్యంలా నిలిచిన ప్రజల పండుగ అయిన బతుకమ్మకు ఆదరణ కరువై కళ తప్పుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో తిరుగుబాటు బావుటాలా ఎగిసిన బతుకమ్మ, కేసీఆర్ పాలనలో కీర్తి బావుటలా విలసిల్లిన బతుకమ్మ, కాంగ్రెస్ పుణ్యమా అని స్వరాష్ట్రంలో అనాదరణకు గురవుతున్నది. మార్పు పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు చిన్న గా చిహ్నాల మార్పుతో మొదలుపెట్టి ఏకంగా తెలంగాణ తల్లినే మార్చే శారు. అమ్మ చేతిలో బతుకమ్మను మాయం చేశారు. ఇవీ తెలంగాణ తల్లి పట్ల, ఆ తల్లి గుండెల్లో నెలకొన్న బతుకమ్మ పట్ల వారికున్న భక్తిశ్రద్ధలు. ఇప్పుడు బతుకమ్మపైనే శీతకన్ను వేసి ప్రజల సెంటిమెంటుతో ఆటాడుకుంటున్నారు. కాంగ్రెస్ పాలనలో బతుకమ్మ కష్టాలు అన్నీఇన్నీ కావు. సంబురాలు జరిపేందుకు పంచాయతీలకు ఇచ్చే నిధులకు మొం డిచేయి చూపింది సర్కారు. బతుకమ్మ అంటేనే గుర్తొచ్చే చీరల పంపిణీకి రెండో ఏడాదీ ఎగనామం పెట్టింది. 60 లక్షల మందికి ఒక్కొక్కరికి ఒకటి కాదు, రెండు ఇస్తాం.. 1.2 కోట్ల చీరలు వస్తున్నాయని ఊరించిన సర్కారు చివరకు ఒక్కటీ ఇవ్వకుండా చేతులెత్తేసింది. ఆడపడుచు ల ఆశలపై నీళ్లు గుమ్మరించింది. అటు కాంగ్రెస్ మార్కు కరెంటు కష్టాలతో సద్దుల బతుకమ్మకు కూడా సెల్‌ఫోన్ వెలుగులే దిక్కయ్యాయి. బతుకమ్మను రాష్ట్ర ఉత్సవంగా గుర్తించేందుకూ కాంగ్రెస్ సర్కారుకు మనసు రాలేదు. ప్రజల పండుగ అంటున్నారు మరి ప్రజలే జరుపుకోవాలి అన్నట్టుగా చేతులు ముడుచుకుని కూర్చున్నది. హైదరాబాద్‌లో ఘనంగా పండుగ జరుపుకొనే సంప్రదాయాన్ని అటకెక్కించింది. పండుగ సందర్భంగా గుర్తుంచుకునే గొప్ప కార్యక్రమం ఏదీ సర్కారు చేపట్టకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించింది. నగర కూడళ్లలో కళావిహీనమైన రబ్బరు ట్యూబుల బతుకమ్మలు పేర్చి తన కళాపోషణను చాటుకున్నది. నగర వీధులను హోరెత్తించే బతుకమ్మను సరూర్‌నగర్ స్టేడియంలోకి నెట్టేసి ఇంతే సంగతులు అనిపించింది. ఓ వెయ్యిమంది అక్కడ బతుకమ్మ ఆడితే ఇదే ప్రపంచ రికార్డు అని టాంటాం వేసుకుంటున్నది. ఆ మాత్రానికే మురిసిపోతే ఎలా? హనుమకొండ వేయిస్తంభాల గుడి, పద్మాక్షి గుట్ట, కరీంనగర్ సర్కస్ గ్రౌండు, మానేరు తీరం, సిద్దిపేట కోమటిచెరువు గట్టున జరిగిన బతుకమ్మల్లో వేలాదిగా పాల్గొన్న బతుకమ్మల రికార్డు ఎక్కడికి పోవాలి? ఉద్యమకాలంలో, స్వరాష్ట్ర సాధన తర్వాత నెక్లెస్ రోడ్డును అలంకరించిన బతుకమ్మ ఏమైపోవాలి? పండుగ గురించి సర్కారు పెద్దలు, పాలకపక్షీయులు చేసిన వ్యాఖ్యలు కొన్ని గందరగోళానికి దారితీస్తే మరికొందరు ఒక్కొక్కరు ఒక్కో రకం పేర్లతో నవ్వు తెప్పించారు. ఒకరు ఇది గిరిజనుల పండుగ అని సరికొత్త భాష్యం చెప్పారు. మరొకరు జానపద నృత్యమని రాగాలు తీశారు. అసలు బతుకమ్మ ఆత్మను మాత్రం కాంగ్రెస్ సర్కారు పట్టుకోలేదు, ఆ మాటకు వస్తే పట్టించుకోలేదు. 'జై తెలంగాణ' అనేందుకు నోరు రాని ముఖ్యమంత్రి, 'సజ్జల' బతుకమ్మకు, సద్దుల బతుకమ్మకు తేడా తెలియని మంత్రుల పరిపాలనలో బతుకమ్మ ఆగమాగం కాక ఏమవుతుంది? తల్లి తెలంగాణ నగలు వలిచినోళ్లు బతుకమ్మను నిరాదరణకు గురిచేయడంలో ఆశ్చర్యం ఏముంది? అందుకే బతుకమ్మ వేదికలు సర్కారు వ్యతిరేక నినాదాలతో ప్రతిధ్వనించాయి.

# రాత్రిపూట ఈ లక్షణాలు కనిపిస్తే యమడేంజర్..

## మీ కిడ్నీలను కాపాడుకోండి..




శరీరంలోని ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు ఒకటి.. ఇది శరీరం నుండి మలినాలను తొలగించడానికి పనిచేస్తుంది. కిడ్నీలు లేకుండా శరీరం పనిచేయడం కష్టం. కిడ్నీ వైఫల్యానికి ముందే, మన శరీరం సంకేతాలను ఇవ్వడం ప్రారంభిస్తుంది. రాత్రి నిద్రపోతున్నప్పుడు కనిపించే ఈ లక్షణాలను విస్మరించకూడదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ˆరీరంలోని అతి ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు (కిడ్నీలు) ఒకటి.. కిడ్నీలు శరీరం నుంచి మలినాలను తొలగించడానికి పనిచేస్తాయి.. మూత్రపిండాలు లేకుండా, శరీరం పనిచేయడం కష్టం. మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, అనేక తీవ్రమైన వ్యాధులు వస్తాయి.. అందుకే మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవడం అవసరం. మూత్రపిండాల వైఫల్యానికి ముందే, మన శరీరం సంకేతాలను ఇవ్వడం ప్రారంభిస్తుంది. అయితే.. కిడ్నీ వ్యాధులకు సంబంధించి రాత్రిపూట కొన్ని సంకేతాలు కనిపిస్తాయని.. వాటిని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయొద్దని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మూత్రపిండాల దెబ్బతిన్నప్పుడు.. రాత్రి వేళ కనిపించే లక్షణాలేంటో తెలుసుకోండి..**

రాత్రిపూట తరచూ మూత్ర విసర్జన: మూత్ర విసర్జన శరీరం సాధారణ పని.. కానీ రాత్రిపూట అధికంగా మూత్ర విసర్జన చేయడం మూత్రపిండాల వైఫల్యానికి సంకేతం. మూత్రపిండాలలో ఏదైనా సమస్య మొదట మూత్రం ఏర్పడటాన్ని ప్రభావితం చేస్తుంది. మీరు నిద్రలో కూడా మూత్ర విసర్జన చేస్తుంటే.. ఈ లక్షణాన్ని విస్మరించవద్దు. అధికంగా చెమటలు: వేసవిలో అందరికీ చెమటలు పడతాయి, కానీ రాత్రిపూట అధిక చెమటలు పట్టడం మూత్రపిండాల వైఫల్యానికి హెచ్చరిక సంకేతం కావచ్చు. దీనివల్ల శరీరంలో క్రియాటినిన్ స్థాయిలు పెరుగుతాయి.. తీవ్రమైన రక్తపోటు: అధిక రక్తపోటు మూత్రపిండాలు దెబ్బతిన్నాయనడానికి సంకేతం కావచ్చు. మూత్రపిండాలలో లోపం ఉన్నప్పుడు, అవి క్రియేటినిన్‌ను ఫిల్టర్ చేయలేవు, అటువంటి పరిస్థితిలో, క్రియేటినిన్ రక్త నాళాలలో పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. ఇది రక్త నాళాలను విస్తరిస్తుంది.. అంతేకాకుండా.. ఇది రక్త ప్రసరణను ప్రభావితం చేసి.. రక్తపోటును పెంచుతుంది. వాంతులు వికారం: వాంతులు కూడా మూత్రపిండాల వైఫల్యానికి సంకేతం. రాత్రి భోజనం తర్వాత మీరు తరచుగా వాంతులు చేసుకుంటే లేదా వికారం అనిపిస్తే, అది మూత్రపిండాలు దెబ్బతిన్నాయనడానికి సంకేతం. అటువంటి లక్షణాలను విస్మరించడం ప్రమాదకరం. పాదాల నొప్పి: ఎటువంటి కారణం లేకుండా మీ పాదాలలో నొప్పి ఉంటే, అది సాధారణం కాదు. శరీరంలో క్రియాటినిన్ స్థాయి పెరిగినప్పుడు, పాదాల నొప్పి సమస్య తలెత్తుతుంది. ఎందుకంటే పాదాలలో క్రియాటినిన్ పెరిగిన మొత్తం పేరుకుపోతుంది. కావున ఈ లక్షణాలను అస్సలు విస్మరించవద్దని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీకు ఏమైనా సమస్యలుంటే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స పొందండి..

# కోలాట మాస్టర్ కు జాతీయ గుర్తింపు

**సేవరత్న అవార్డు అందుకున్న తోకల రమేష్..**

**కోలాట కళకు, సామాజిక సేవలకు జాతీయ స్థాయి గుర్తింపు.**





**విజేత,, పినపాక :** అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన ప్రముఖ కోలాట మాస్టర్, సారపాక ఐటీసీ పేపర్ మిల్ ఉద్యోగి తోకల రమేష్ జాతీయ స్థాయి "సేవారత్న అవార్డు" అందుకుని జిల్లకు గర్వకారణంగా నిలిచారు. ఈ నెల 15వ తేదీ ఆదివారం సాయంత్రం తిరుపతిలోని జి.ఎస్.కె.ఆర్. భవన్‌లో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 18వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఈ అవార్డు అందజేయబడింది.

**"కాన్షీరామ్ జయంతి సందర్భంగా జాతీయ సదస్సు"**

బహుజన జాతీయవాది మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఈ జాతీయ స్థాయి సాహిత్య సదస్సు, అవార్డుల ప్రధానోత్సవ సభను బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నల్లా రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దక్షిణ భారత రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు పాల్గొన్నారు.

**"దశాబ్ద కాలంగా కళా సేవ -- సమాజానికి అంకితం"**

గత పది సంవత్సరాలుగా తోకల రమేష్ ప్రాచీన జానపద కోలాట కళను ప్రోత్సహిస్తూ అనేక ప్రదర్శనలు ఇస్తూ వస్తున్నారు. మహిళా సాధికారిత కోసం ఉచిత కోలాట శిక్షణా తరగతులు నిర్వహించడం, సామాజిక అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, యువతలో గంజాయి, డ్రగ్స్ వ్యసనాల నివారణపై సదస్సులు నిర్వహించడం వంటి సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

**మహిళలు, యువత కోసం. – ప్రత్యేక కార్యక్రమాలు**

మహిళలు, బాలికలకు భరోసా కల్పించే కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సేవలు, సమాజ హితం కోసం రచనలు చేయడం వంటి రంగాలలో రమేష్ విశేష కృషి చేశారు. ఈ సేవలే ఆయనకు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చాయి.

**'ప్రముఖుల సమక్షంలో ఘన సత్కారం'**

ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల ప్రతినిధులతో పాటు డా. దరువు ఎల్లన్న, విష్ణు, కనుకుట్ల విజయ కుమార్, మామిడిపల్లి బాపన్న, ఎన్.డి. వెంకమ్మ, కళారాణి, పి.వి. రాజేషన్, పి.ఎన్. వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**"గ్రామంలో ఆనంద వాతావరణం'**

తోకల రమేష్‌కు జాతీయ అవార్డు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఐటీసీ సారపాక పరిశ్రమ గుర్తింపు సంఘం అధ్యక్షులు కనకమేడల హరి ప్రసాద్, ఐ ఎన్ టి యు సి అధ్యక్షుడు గోనె రామారావు, వివిధ సంఘాల నాయకులు, తోటి ఉద్యోగులు ఆయనను అభినందించారు. జానపద కళతో సమాజానికి సేవ చేసిన కళాకారుడికి జాతీయ గుర్తింపు దక్కడం విశేషం.

# ప్రగతి నగర్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు విజయవంతమైన పోరాటం



**విజేత, దుండిగల్ :-** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ ప్రగతి నగర్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు డంపింగ్ యార్డ్, గ్రేవియార్డ్ కబ్జా వ్యవహారం పై సాగిన దీర్ఘకాల పోరాటానికి తుది ఫలితం లభించింది. తాజాగా హైడ్రా అధికారులు, రెవెన్యూ శాఖ సహకారంతో ఆ భూములను రక్షించేందుకు పెన్సింగ్ ఏర్పాటు చేయడం స్థానికులకు ఊరట కలిగించింది. వివరాల్లోకి వెళ్తే, 2023 జూలై 17న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దల సహకారంతో ఎక్సెల్ల ప్రాపర్టీకి చెందిన దేశ్ పాండే అనే వ్యక్తికి ప్రగతి నగర్‌లోని ప్రభుత్వ భూములు కట్టబెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో డంపింగ్ యార్డ్ మెటీరియల్, గ్రేవియార్డ్ ప్రాంతం విధ్వంసానికి గురవుతుండగా స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ, దర్జాగా కబ్జా చర్యలు కొనసాగినట్లు ఆరోపణలు వినిపించాయి. ఈ అంశంపై 2023 ఆగస్టు 21న బీజేపీ నేతలు ఈటెల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ తదితరులు ఘటనాస్థలాన్ని సందర్శించి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనంతరం భూములపై సర్వే చేసి రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అదే ఏడాది ఆగస్టులోనే పలు మార్లు అధికారులకు ఫిర్యాదులు అందజేశారు. తరువాత హైడ్రా వ్యవస్థ అమల్లోకి వచ్చిన తరువాత, 2025 మార్చి 5న పూర్తి ఆధారాలతో మరోసారి ఫిర్యాదు చేయబడింది. సర్వే నంబర్ 57కు సంబంధించి జరిగిన విచారణలకు రెండు సార్లు హాజరై స్థానికులు తమ వాదనలు వినిపించారు. ఈ క్రమంలోనే తాజాగా హైడ్రా అధికారులు, రెవెన్యూ శాఖ కలిసి డంపింగ్ యార్డ్ మరియు గ్రేవియార్డ్ భూములను పరిరక్షించేందుకు పెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీంతో గత రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను కాపాడేందుకు పోరాటం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి కబ్జాలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# చొప్పదండి మండల డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ డిటిఎఫ్ సర్వసభ్య సమావేశం

**విజేత,చొప్పదండి :** చొప్పదండి మండల విద్యా వనరుల కేంద్రం నందు డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్( డిటిఎఫ్) సర్వసభ్య సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. ఇట్టి సమావేశమునకు డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యారంగ సమస్యలపై మాట్లాడారు. పెండింగ్లో ఉన్న డిఏ బకాయిలు విడుదల చేయాలని, పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్, జిపిఎఫ్ పార్ట్ ఫైనల్ నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించే దశగా డీఎస్సీ నిర్వహించాలని, అర్హత గల ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చకినాల రామ్మోహన్ మాట్లాడుతూ పదవీ విరమణ వయస్సు పెంపు విషయం పత్రికల్లో ప్రచారం కావడంతో ప్రభుత్వం పదవి విరమణ వయసు పెంపు విషయం విరమించుకోవాలని కోరారు. రాష్ట్ర పూర్వ ఆడిట్ కమిటీ కన్వీనర్ దామెర యేసు రెడ్డి మాట్లాడుతూ సంఘ బలోపేతానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని, సంఘ నిర్మాణానికి అంకితభవంతో పనిచేయాలని అప్పుడే విద్యారంగ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. అనంతరం డిటిఎఫ్ నూతన కార్యవర్గమును ఎన్నుకున్నారు . ఎన్నికల పరిశీలకులుగా కనిగంటి రాజమౌళి రాష్ట్ర కౌన్సిలర్ పాల్గొనగా, ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిలర్ మరియు జోనల్ కన్వీనర్ సముద్రాల అంజయ్య వ్యవహరించి నూతన కార్యవర్గమును ఎన్నుకోవడమైనది. అధ్యక్షులు గుర్రం శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉత్కం వేణుగోపాల్, ఉపాధ్యక్షులు ఒప్పుల కరుణాకర్, గట్టు జయ, కార్యదర్శులు సంకనభట్ల సురేందర్, జీ .వీరేశం, ఏ. హరి లీల, జిల్లా కౌన్సిలర్ వైద్యుల రాజిరెడ్డి, కనిగంటి రాజమౌళి, సముద్రాల అంజయ్య, ఎండి షరీఫ్, శ్రీకాంత్, గౌడ వెంకటస్వామి, ఆడిట్ కమిటీ



కన్వీనర్ కొండ రవి, ఆడిట్ కమిటీ సభ్యులుగా రాజకుమార్, యశోద



ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సముద్రాల అంజయ్య తెలిపారు.

# అపరిశుభ్ర హోటళ్లపై మెరుపు దాడులు రూ.20 వేల

## జరిమానా విధించిన కమిషనర్ సంపత్ రెడ్డి



**విజేత బెల్లంపల్లి :** బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించిన మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కాల్ టెక్స్ ఏరియాలోని అరేబియన్ క్లాసిక్ నైట్స్ మండి, అబ్దుల్ రెహమాన్ మండి హౌస్, బజార్ ఏరియాలోని వినాయక టిఫిన్ అండ్ బిర్యాని హోటళ్లను తనిఖీ చేశారు. తనిఖీల సమయంలో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకుండా అపరిశుభ్ర పరిస్థితుల్లో నిర్వహిస్తున్న హోటల్స్, టిఫిన్ సెంటర్లను గుర్తించి మొత్తం రూ.20,000 జరిమానా విధించారు. యజమానులకు పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని గట్టిగా హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం ప్రధాన బాధ్యతగా భావిస్తున్న కమిషనర్ సంపత్ రెడ్డి, మున్సిపల్ పరిధిలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. పునరావృతం జరిగితే దుకాణాలను స్వాధీనం చేసుకుని మున్సిపల్ చట్టం 2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పన్ను బకాయిలపై కఠిన చర్యలు షాపు సీజ్



**విజేత బెల్లంపల్లి :** బెల్లంపల్లి మున్సిపాలిటీలో పన్ను బకాయిలు చెల్లించని వారిపై కఠిన చర్యలు ప్రారంభమయ్యాయి. రడగంబాల బస్తీలో కె. వెంకటరమణకు చెందిన షాపును ఇంటి పన్ను బకాయిల కారణంగా అధికారులు సీజ్ చేశారు. మున్సిపల్ చట్టం 2019 ప్రకారం బకాయిలు సకాలంలో చెల్లించని యెడల ఇలాంటి చర్యలు మరింత కఠినంగా కొనసాగుతాయని మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. పన్నులు చెల్లించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి, రహదారులు, వీధి దీపాలు, పారిశుధ్య సేవల మెరుగుదలకు పన్నులే ప్రధాన వనరని చెప్పారు. బకాయిలు ఉన్న వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందువల్ల పౌరులు తమ ఇంటి పన్ను బకాయిలను సకాలంలో చెల్లించి బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

# ఈ చిత్రంలో దాగిన 9 జంతువులు కనిపెడితే మీ చూపు డేగ చూపే.. 90 శాతం మంది ఫెయిల్



మన దృష్టికి, మెదడుకు పని కల్పించే ఆప్టికల్ ఇల్యూషన్లు, బ్రెయిన్ టీజర్లు తరచుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. అలాంటి పజిల్స్ పరిష్కరించడం కష్టమే అయినప్పటికీ.. ఈ సవాళ్లను ఎదుర్కోవడంలో ఆనందం భిన్నంగా ఉంటుంది. ఇప్పుడు చాలా కష్టమైన ఆప్టికల్ ఇల్యూషన్ చిత్రం ఒకటి వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో ఎన్ని జంతువులు ఉన్నాయో మీరు గుర్తించాలి. కొంతమందికి గమ్మత్తైన పజిల్స్ ను పరిష్కరించడంలో అమితమైన ఆసక్తి.. వాటిని చూస్తూ.. జవాబుని తెలుసుకునే ప్రయత్నంలో ఎంత సమయం గడిచిపోయిందో కూడా తెలియదు. చాలా మంది ఇలాంటి ఆప్టికల్ ఇల్యూషన్ పజిల్స్‌ను పరిష్కరించడానికి ఆసక్తి చూపుతారు. అయితే కొన్ని చిత్రాలను చూసిన వెంటనే సమాధానం కనుగొనడం కష్టం కావచ్చు. భ్రమలో చిక్కుకున్న సమాధానం కోసం ఎన్నిసార్లు ప్రయత్నించినా, సరైన సమాధానం దొరకదు. ఇప్పుడు కూడా ఇలాంటి గమ్మత్తైన ఆప్టికల్ ఇల్యూషన్ చిత్రం వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో దాగి ఉన్న తొమ్మిది జంతువులను కనిపెట్టాలనే సవాలు ఇవ్వబడింది. మీరు ఈ పజిల్‌ను పరిష్కరించడానికి సిద్ధంగా ఉంటే ఒక్కసారి చిత్రాన్ని పరిశీలన శక్తితో చూడండి.

**ఈ చిత్రంలో ఏముంది?**

X U²Ô @InterstingSTEM ద్వారా షేర్ చేయబడిన ఈ ఆప్టికల్ ఇల్యూషన్ చిత్రం పరిశీలన నైపుణ్యానికి పరీక్ష. ఈ చిత్రం "ఇది ఒక క్లాసిక్ బ్రెయిన్ టీజర్. మీరు ఎన్ని జంతువులను చూస్తున్నారో సమాధానం చెప్పండి అనే శీర్షికతో షేర్ చేశారు. ఈ చిత్రాన్ని చూసి అందులో ఎన్ని జంతువులు ఉన్నాయో చెప్పుకొండి చూద్దాం." ఈ చిత్రంలోని జంతువులూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. దీంతో పజిల్‌ను మరింత క్లిష్టతరం చేస్తుంది. దృష్టిని చిత్రంపై కేంద్రీకరించి సరైన సమాధానాన్ని ఊహించడానికి ప్రయత్నించండి. అయితే ఈ పజిల్‌ను పరిష్కరించడానికి సమయ పరిమితి లేదు.

# నిజంగా శాంతి కోసం కృషి చేసే వ్యక్తులనే ఎంపికచేస్తాం.. వైట్‌హౌస్‌కు నోబెల్ కమిటీ కౌంటర్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు నిరాశ ఎదురైన విషయం తెలిసిందే. నోబెల్ శాంతి బహుమతిపై ట్రంప్ పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. ట్రంప్ 'శాంతి' ఆశలపై నీళ్లు చల్లుతూ 2025 నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా ప్రధాన ప్రతిపక్ష నాయకురాలు, ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మరియా కొరీనా మచాడోకు నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ట్రంప్‌ను కాకుండా వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడోను నోబెల్ శాంతి బహుమతికి ఎంపిక చేయడంపై వైట్‌హౌస్ అసంతృప్తి వ్యక్తం చేసింది. మచాడోని ఎంపిక చేయడం ద్వారా నోబెల్ కమిటీ శాంతి కన్నా రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించింది. వైట్‌హౌస్ విమర్శలపై నోబెల్ కమిటీ స్పందించింది. 'శాంతి' ప్రకటన విషయంలో నియమ, నిబంధనల ప్రకారమే నడుచుకున్నట్లు తెలిపింది. కమిటీ చైర్మన్ జోర్గెన్ వాట్నే ఫ్రైడ్నెస్ మాట్లాడుతూ.. 'నోబెల్ అవార్డుల ఎంపికకు ముందు అన్నిరకాలుగా పరిశీలన జరుపుతాం. అవార్డు అందుకోవడానికి అన్ని అర్హతలు ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే ఎంపిక చేస్తాం. నోబెల్ పీస్ ప్రైజ్ కోసం ఏటా వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తాయి. వాటన్నింటినీ పరిశీలించి నిజంగా శాంతి కోసం కృషి చేసే వ్యక్తులనే ఎంపిక చేస్తాం. నోబెల్ బహుమతి గ్రహీతల ఫొటోలు ఉన్న గదిలో కమిటీ కూర్చుంటుంది. ఆ గదిలో ధైర్యం, సమగ్రత నిండి ఉంటాయి. చేసిన కృషి, ఆల్ఫ్రెడ్ నోబెల్ అభీష్టంపైనే మా నిర్ణయం ఆధారపడి ఉంటుంది. ఇందులో ఇతర అంశాలు ఏవీ ప్రభావం చూపబోవు' అని స్పష్టం చేశారు.

# అల్లాన్ని నేరుగా తినలేరా..? అయితే అల్లం పాలను తయారు చేసి తాగండి.. ఎన్నో లాభాలను పొందవచ్చు..!



అల్లంను మనం నిత్యం అనేక రకాల వంటల్లో వేస్తూనే ఉంటాం. ముఖ్యంగా మసాల వంటకాల్లో అల్లాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. అల్లంను వేయడం వల్ల వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఆయుర్వేద ప్రకారం అల్లంలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కనుక అల్లాన్ని నేరుగా తినమని లేదా అల్లం రసం సేవించాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే అల్లం ఘాటుగా ఉంటుంది కనుక దీన్ని కొందరు నేరుగా తినలేరు. కానీ అల్లాన్ని పాలలో వేసి మరిగించి కూడా తీసుకోవచ్చు. ఇలా తీసుకున్నా కూడా ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయి. అల్లం, పాలు కాంబినేషన్ చాలా శక్తివంతంగా పనిచేస్తుంది. ఈ మిశ్రమం అనేక లాభాలను అందిస్తుంది. అల్లం పాలను రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. పలు వ్యాధులు సైతం అవుతాయి.

**సీజనల్ వ్యాధులకు..**

అల్లంలో శక్తివంతమైన కార్మినేటివ్ గుణాలు ఉంటాయి. అందువల్ల అల్లం పాలను సేవిస్తుంటే జీర్ణాశయ ఎంజైమ్‌లు, జీర్ణ రసాలు ఉత్పత్తి అవుతాయి. దీని వల్ల మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి తగ్గుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి జీర్ణ సమస్యల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. పొట్టలో ఉండే అసౌకర్యం తొలగిపోతుంది. అల్లంలో జింజరాల్ అనే శక్తివంతమైన బయో యాక్టివ్ సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకంగా పనిచేస్తుంది. దీని వల్ల శరీరంలోని వాపులను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా కీళ్ల నొప్పులు తగ్గుతాయి. ఒళ్లు నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఈ సీజన్‌లో చాలా మందికి దగ్గు, జలుబు, ఫ్లూ వంటి సమస్యలు వస్తుంటాయి. వాతావరణం చల్లగా ఉండడం వల్ల ఈ సమస్యలు వస్తాయి. కానీ అల్లం వల్ల ఈ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అల్లం పాలను తాగుతుంటే గొంతులో గరగర, గొంతు సమస్యలు, గొంతు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. ముక్కు దిబ్బడ తొలగిపోతుంది. శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి..**

అల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న కారణంగా అల్లం పాలను సేవిస్తుంటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారి రోగాలు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. వికారంగా ఉండడం, వాంతికి వచ్చినట్లు అనిపించడం, ప్రయాణాల్లో వాంతులు అవడం వంటి సమస్యలు ఉన్నవారు అల్లం పాలను తాగుతుంటే వెంటనే ఉపశమనం లభిస్తుంది. ఈ పాలను తాగడం వల్ల నిద్రలేమి సైతం తగ్గిపోతుంది. పాలలో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ నిద్రను ప్రేరేపిస్తుంది. కనుక రాత్రి పూట ఈ పాలను తాగితే ఎంతో మేలు జరుగుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. అల్లం పాలను రోజూ సేవిస్తుంటే కొలెస్ట్రాల్ లెవల్స్, బీపీ తగ్గుతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ మిశ్రమంలో ఉండే పొటాషియం బీపీని తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**ఇలా తయారు చేయండి..**

ఇక అల్లం పాలను చాలా సులభంగా తయారు చేయవచ్చు. అందుకు గాను ఒక పాత్రలో పాలను తీసుకుని అందులో తురిమిన అల్లం వేసి 4 నుంచి 5 నిమిషాల పాటు బాగా మరిగించాలి. అనంతరం అందులో నల్ల మిరియాల పొడి, దాల్చిన చెక్క పొడి వేయాలి. తరువాత స్టవ్ ఆర్పి పాత్రను దించుకోవాలి. అనంతరం అందులో బెల్లం పొడి వేసి బాగా కలపాలి. అవసరం అనుకుంటే అందులో డ్రై ఫ్రూట్స్ లేదా కుంకుమ పువ్వును కలుపుకోవచ్చు. దీంతో పాలు రుచిగా ఉంటాయి. ఇక అలా తయారైన అల్లం పాలను గోరు వెచ్చగా ఉండగానే తాగేయాలి. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. అయితే అల్లంను తాజాగా ఉండేలా చూసుకోవాలి.

# ఓట్ల చోరీలో జాతీయ పార్టీలు




కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్‌గాంధీ 'రాజ్యాంగాన్ని సంరక్షిస్తా', 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తా' అని చెప్తూ రాజ్యాంగ ప్రతిని చేతుల్లో పట్టుకొని దేశమంతా కలియతిరుగుతున్నారు. కేంద్రంలోని అధికార బీజేపీ ఓటుచోరీకి పాల్పడుతున్నదని, లోక్‌సభ ఎన్నికలతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఆ పార్టీ ఈ విధంగానే గెలుస్తున్నదని ఆయన గత కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. కేంద్రం చెప్పుచేతల్లో ఎలక్షన్ కమిషన్ పని చేస్తున్నదని, బీజేపీకి అనుబంధంగా మరో మోర్చాగా మారిపోయిందని కూడా రాహుల్ ఆరోపిస్తున్నారు. అయితే, దేశమంతా శోధిస్తూ, అధ్యయనాలు చేస్తూ బీజేపీ చేస్తున్న ఓటుచోరీని బయటపెడుతున్న ఆయనకు తెలంగాణలో అధికారంలో ఉన్న సొంత పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఓటు చోరీ కానరాకపోవడం ఓ వింత. సొంత పార్టీ నేతలు చేసే ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు మాత్రం ఆయనకు కనిపించకపోవడం విడ్డూరం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఓటరు గుర్తింపు కార్డులు పంచిపెట్టడంపై రాహుల్‌గాంధీ ఇప్పటివరకు కనీసం స్పందించలేదు. సొంత పార్టీ చేస్తున్న ఉల్లంఘనలపై ఆయన నోరు ఎందుకు మూతబడిందో సమాధానం చెప్పాలి. ప్రజాపాలనకు మారుపేరుగా కాంగ్రెస్ పార్టీ గొప్పగా చెప్పుకొంటున్న ఇందిరాగాంధీ హయాం నుంచే దేశం లో ఎన్నికల కమిషన్ భ్రష్టుపట్టిపోయింది. ఆ తర్వాత వచ్చిన రాజీవ్‌గాంధీ, ఇతర కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ దుష్ట సంప్రదాయాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాయి. ఇప్పుడు నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ పాలన లో ఎన్నికల కమిషన్ ప్రతిష్ఠ మరింత దిగజారింది. ఎన్నికల కమిషన్‌లో పారదర్శకత లోపించిందని, అదొ క బీజేపీ అనుబంధ సంస్థగా మారిపోయిందన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతుండటమే అందుకు నిదర్శనం. ఇలాంటి తరుణంలో ఓటు చోరీపై ఉద్య మం చేస్తున్న రాహుల్‌గాంధీ.. తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఎన్నికల నియమావళి ఉల్లంఘనలను చూసీచూడన ట్టు వదిలేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) నిబంధనల ప్రకారం.. ఓటర్ గుర్తింపు కార్డులను అధికారికంగా ఎన్నికల కమిషన్ జారీచేస్తుంది. ఓటర్లకు గుర్తింపు కార్డులను ఎన్నికల కమిషన్ తన యంత్రాం గం ద్వారా స్వయంగా పంపిణీ చేస్తుంది. రిప్రెజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్-1950లోని సెక్షన్ 23 ప్రకారం.. ఓటరు గుర్తింపు కార్డులను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో), లేదా బీఎల్వోల ద్వారా సంబంధిత ఓటర్లకు నేరుగా అందించాలి. ప్రైవేట్ వ్యక్తులు, పార్టీలు లేదా ఇతర సంస్థలు వీటిని పంపిణీ చేయడానికి అనుమతి ఉండదు. అలా పంపిణీ చేయ డం ఎన్నికల నియమావళి ప్రకారం నేరంగా పరిగణిస్తారు. పైగా ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో నవీన్ యాదవ్ ఓటర్ కార్డులను పంపిణీ చేయడం కండక్ట్ ఆఫ్ ఎలక్షన్స్ రూల్స్-1961, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) ఉల్లంఘన అవుతుంది. అంతేకాదు, అధికార పార్టీ అభ్యర్థి స్వయానా కార్డులు పంపిణీ చేయడమంటే ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఒక విధంగా ఇది ఓటర్ల ను ప్రలోభాలకు గురిచేయడమే. ఓటరు కార్డులను పంచడం ద్వారా నవీన్ యాదవ్ రిప్రెజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్, 1950లోని సెక్షన్ 23బీ ఇండియన్ పీనల్ కోడ్- సెక్షన్ 420 (ఓటర్లను మోసం చేసి కార్డులు పంచడం)బీ రిప్రెజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్ 1951లోని సెక్షన్ 128 (ఓటర్ గుర్తింపు కార్డు వంటి అధికారిక గుర్తింపు కార్డులను అనధికారికంగా ఉపయోగించడం) తదితర చట్టాల ఉల్లంఘనకు పాల్పడ్డారు. వాస్తవానికి ఓటర్ ఐడీ కార్డులను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి సంబంధిత ఓటరు నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అయితే, అలా చేయాలంటే ఓటరు ఫోన్ నెంబర్‌కు వచ్చిన ఓటీపీని నిర్ధారించాల్సి ఉంటుంది. ఇంత పెద్ద తతంగముండగా, 200-300 మంది ఓటరు గుర్తింపు కార్డులు నవీన్ యాదవ్ చేతికి ఎలా వచ్చాయి? ఓటర్ల ఫోన్ నంబర్, ఓటీపీ లేకుండా ఎలా డౌన్‌లోడ్ చేశారు? ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేశారా? ఎన్నికల కమిషన్ అధికారులే సహకరించారా? లేదా జాతీయస్థాయిలో రాహుల్‌గాంధీ పోరాడుతున్న బోగస్ ఓట్లను ఇక్కడి కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహిస్తున్నదా? అన్నది దర్యాప్తు జరిపి నిగ్గుతేల్చాలి. నాలుగైదు రోజుల కిందటే నవీన్ యాదవ్ ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఆ విషయాన్ని ఆయన అనుచరగణం సగర్వంగా సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. పలు పత్రికల్లోనూ ఈ విషయమై వార్తలు వచ్చాయి. అయినా ఎన్నికల అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించారు. అయితే, ఈ విషయం చినికి చినికి గాలివానగా మారడంతో ఎన్నికల కమిషన్ సీరియస్ అయ్యింది. దీంతో చివరికి స్థానిక అధికారులు ఫిర్యాదు చేయగా, పోలీసులు పలు సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదు చేశారు. కాలయాపన చేయకుండా, తూతూమంత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకోకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. ఎన్నికల చట్టాలు, నియమాలను ఉల్లంఘించిన నవీన్ యాదవ్‌ను రిప్రెజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్- 1951లోని సెక్షన్ 8 ప్రకారం ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించాలి. బీజేపీ ఓటు చోరీపై పోరాటం చేస్తున్న రాహుల్‌గాంధీ.. తెలంగాణలో కాంగ్రెస్ చేస్తున్న ఈ రకం ఓటుచోరీపై వెంటనే స్పందించాలి. తమ పార్టీ నేత చేసిన తప్పును అంగీకరించి, సదరు నాయకుడిపై చర్యలు తీసుకోవాలి. పోటీ నుంచి తప్పించి తన నిజాయితీని చాటుకోవాలి. అప్పుడే ఆయన పోరాటానికి విలువ ఉంటుంది.

# చిన్న జిల్లాల పెద్ద కథ.. కేసీఆర్ దార్శనికత

### తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త జిల్లాలు ఏర్పాటు చేసి నేటితో 9 ఏండ్లు




ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో జిల్లాల పాత్ర ఎంతో కీలకమైనది. ప్రజల చింతలు తీర్చి, ప్రజల చెంతకు పాలనను చేర్చేవి జిల్లాలే. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందేది జిల్లా యంత్రాంగాల ద్వారానే. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచేవి జిల్లాలే. పాలనలో ఎంతో ప్రాముఖ్యమున్న జిల్లాలను ఉమ్మడి పాలకులు విస్మరించారు. స్వరాష్ట్రంగా ఏర్పడ్డ నాడు తెలంగాణలో పది జిల్లాలే ఉండగా, ఒక్కో జిల్లాలో 50-60 మండలాలు ఉండేవి. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ఈ కష్టాలన్నింటికీ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చెక్ పెట్టారు. స్వరాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన రెండేండ్లలోనే 10 జిల్లాలను 33 జిల్లాలుగా విభజించి, ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌దే. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పాలనలో అనేక మౌలిక మార్పులు, చేర్పులు, సంస్కరణలు చేపట్టింది. అంతేకాదు, చిత్తశుద్ధితో తక్షణమే వాటిని అమలుపరిచింది. పాలనా సంస్కరణల్లో జిల్లాల పునర్విభజన చాలా కీలకమైనది. ఈ నేపథ్యంలో జిల్లా ప్రాదేశిక ప్రాంతాన్ని పునర్విభజన చేసి, ప్రజల సమీపానికి జిల్లా పాలనను తీసుకెళ్లింది నాటి ప్రభుత్వం. మన రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో పట్టుదలను ప్రదర్శించి జిల్లాల పునర్విభజన చేశారు. గతంలో ఉన్న పది జిల్లాల్లో ఒక్క హైదరాబాద్ మినహా, మిగతా తొమ్మిది జిల్లాలను కొత్తగా రెండు నుంచి ఆరు జిల్లాలుగా విభజించారు. మొత్తం 31 జిల్లాలుగా విభజించి 2016 అక్టోబర్ 11 నుంచి అమల్లోకి తెచ్చారు. ఆ తర్వాత మరో రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలు, 74 రెవెన్యూ డివిజన్లు, సుమారు 610 మండలాలు, 10,909 రెవెన్యూ గ్రామాలు, 32 జిల్లా పరిషత్తులు, 12,769 గ్రామ పంచాయతీలు, 129 మున్సిపాలిటీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. ప్రజా అవసరాలు, భౌగోళిక స్వరూపం, పాలనా సౌలభ్యం మొదలగు అంశాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాన్ని 33 జిల్లాలుగా, రెండు మల్టీ జోన్లుగా, 7 జోన్లుగా విభజించి పాలనను కేసీఆర్ ప్రజల చెంతకు చేర్చారు. జిల్లా ప్రాదేశిక ప్రాంతాన్ని, పాలనను ప్రజా అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకరించి, పాలనా యంత్రాంగం మొత్తాన్ని ఎక్కడో సుదూరంగా ఉన్న గ్రామీణ పేద ప్రజల ముంగిటకు కేసీఆర్ తీసుకువచ్చారు. తద్వారా గత అరవై తొమ్మిది ఏండ్ల నుంచి ప్రజలు, ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను దూరం చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కింది. జిల్లాల పునర్విభజన అంటే రాష్ట్ర భౌగోళికపరమైన ఉపరితల స్వరూపం, సరిహద్దులను మార్చే ప్రక్రియ మాత్రమేనని కొందరు భావించారు. కానీ, ఈ పాలనా సంస్కరణ ఒక మౌలిక మార్పుగా, భౌగోళిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, సమతుల్య సమాజ నిర్మాణ ప్రక్రియలో ఒక భాగంగా పరిగణించాలి. ప్రజలకు ప్రభుత్వ పాలన, ముఖ్యంగా జిల్లా పాలన అత్యంత సమీపంలో ఉండాలన్న నాటి ప్రభుత్వ నిర్ణయం, పాలకుల ముందుచూపు పాలనా దక్షతకు తార్కాణం. విభజనకు పూర్వం తమ అవసరాల కోసం జిల్లా కేంద్రానికి ప్రజలు వెళ్లాలంటే అత్యధిక దూరం ప్రయాణించడంతో పాటు అధిక ఖర్చులను భరిస్తూ, విలువైన సమయాన్ని వృథా చేసుకుంటూ తీవ్రంగా యాతన పడేవారు. ఈ ఇబ్బందులు పడలేక సులభంగా పనులు పూర్తిచేసుకోవాలనే తలంపుతో ప్రజలు మధ్య దళారీ వ్యవస్థపై ఎక్కువగా ఆధారపడేవారు. వారికి డబ్బులు ముట్టచెప్పి పనులు చేయించుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జిల్లాల పునర్విభజనతో బ్రోకర్ వ్యవస్థ చాలా వరకు కనుమరుగైపోయింది. ప్రజలే స్వయంగా జిల్లా కేంద్రానికి పొద్దున వెళ్లి తమ పనులను పూర్తిచేసుకొని సాయంత్రానికి ఇంటికి చేరుకుంటున్నారు. గతంలో దాదాపు 50-60 మండలాలకు ఒక జిల్లా ఉండేది. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల పాలనాధికారులను ప్రజలు కలవాలన్నా, కోర్టు కేసులు, విద్య, వైద్యం, వాణిజ్య అవసరాలకు జిల్లా కేంద్రానికి వెళ్లాలన్నా దాదాపు 50-100 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వచ్చేది. అంత ప్రయాసపడి వెళ్లినా పనులు పూర్తయ్యేవి కాదు. అలాంటి పరిస్థితుల్లో బస్టాండ్‌లు, రోడ్ల పక్కన, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, లాడ్జిలు, బంధువుల ఇండ్లల్లో బస చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కేసీఆర్ దాదాపు 10-30 మండలాలకు ఒక జిల్లా చొప్పున ఏర్పాటు చేశారు. తద్వారా జిల్లా పాలనను ప్రజల ఇంటి ముంగిటకు తీసుకొచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో అతి తక్కువగా పది మండలాలు మాత్రమే కలిగి ఉన్న జిల్లా ములుగు కాగా, ఎక్కువగా మండలాలున్న జిల్లా నల్గొండ. పునర్విభజనతో గత జిల్లా కేంద్రాలపై భారం తగ్గింది. నూతన జిల్లా కేంద్రాల్లో జనసంచారం పెరిగింది. వ్యాపారాలు ఊపందుకున్నాయి. పాత జిల్లా కేంద్రాల్లో ఇండ్ల అద్దెలు గణనీయంగా తగ్గడంతో సామాన్యులకు ఉపశమనం కలిగింది. కొత్త జిల్లా కేంద్రాల్లో అద్దె ఇండ్లు, సొంత ఇండ్లు, భూములకు గిరాకీ పెరిగింది. పోలీసులకు శాంతిభద్రతల పరిరక్షణ సులువైంది. ప్రజలకు అధికారులు అందుబాటులోకి వచ్చారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువయ్యాయి. రోడ్డు, రవాణా వ్యవస్థ మెరుగుపడింది. జిల్లాలవారీగా పరిశీలిస్తే విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమం పాలనా వ్యవస్థలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. సామాన్య ప్రజల కదలిక (మొబిలిటీ) పెరిగింది. దాంతో జిల్లా పాలనపై వ్యక్తిగత చైతన్యస్థాయి పెరిగింది. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణలోని 33 జిల్లాలకు సమీకృత పాలనా భవనాలు నిర్మించి, అన్ని పాలనా విభాగ కార్యాలయాలను ఒకేచోట కేంద్రీకరించడం మూలంగా ప్రజల సందర్శన సులభమవడమే కాదు, ప్రభుత్వాధికారుల మధ్య సమన్వయం కూడా పెరిగింది. ఫైళ్లు వేగంగా కదులుతున్నాయి. స్వయం ప్రతిపత్తితో కూడిన సుస్థిర, సంక్షేమ, అభివృద్ధి పాలన ప్రగతి పథంలో పయనిస్తున్నదని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు. గతంలో దాదాపు 50-60 మండలాలకు ఒక జిల్లా ఉండేది. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల పాలనాధికారులను ప్రజలు కలవాలన్నా, కోర్టు కేసులు, విద్య, వైద్యం, వాణిజ్య అవసరాలకు జిల్లా కేంద్రానికి వెళ్లాలన్నా దాదాపు 50-100 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వచ్చేది.

# రాత్రి పూట మీరు తినే ఆహారంలో వీటిని చేర్చుకోండి.. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు..



అధికంగా బరువు ఉన్నవారు రాత్రి పూట భోజనాన్ని త్వరగా ముగిస్తుంటారు. రాత్రి పూట తినే ఆహారంలో చపాతీలను చేర్చుకుంటారు. అంతే కాదు రాత్రి పూట ఆహారాన్ని తక్కువగా తింటారు. ఇలా బరువు తగ్గాలనుకునే వారు రాత్రి భోజనం పట్ల అనేక జాగ్రత్తలను పాటిస్తుంటారు. అయితే బరువు తగ్గాలంటే పలు ఆహారాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. సరైన పోషకాలు ఉండే ఆహారాలను తింటే బరువు తగ్గడం తేలికవుతుంది. ఈ క్రమంలోనే రాత్రి పూట కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల సులభంగా బరువు తగ్గుతారు. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి కనుక ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. అధిక బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్న వారు రాత్రి పూట ఈ ఆహారాలను తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది.

**స్కిన్‌లెస్ చికెన్, చేపలు, కూరగాయలు..**

రాత్రి పూట ఆహారంలో స్కిన్ లెస్ చికెన్ తినవచ్చు. ఇది అద్భుతమైన ప్రోటీన్లను అందిస్తుంది. అలాగే రాత్రి పూట ఆహారంలో చేపలను తింటున్నా మేలు జరుగుతుంది. చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. సోయా టోఫులో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడంతోపాటు బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి. పప్పు దినుసులు, శనగలను తింటున్నా కూడా ఫలితం ఉంటుంది. వీటిల్లో ఫైబర్, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి బరువు తగ్గేలా చేస్తాయి. పిండి పదార్థాలు చాలా తక్కువగా ఉండే కూరగాయలను రాత్రి పూట తినాల్సి ఉంటుంది. పాలకూర, బ్రోకలీ, కాలిఫ్లవర్, మొలకలు, క్యాప్సికం, పుట్ట గొడుగులు, గ్రీన్ బీన్స్ వంటి ఆహారాలను రాత్రి పూట తింటుంటే మేలు జరుగుతుంది.

**కినోవా, బ్రౌన్ రైస్..**

సంక్లిష్టమైన పిండి పదార్థాలు ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. కినోవా, బ్రౌన్ రైస్, చిలగడదుంపలు వంటి వాటిల్లో సంక్లిమైన పిండి పదార్థాలు ఉంటాయి. ఇవి రక్తంలో గ్లూకోజ్‌గా మారేందుకు సమయం పడుతుంది. పైగా వీటిని కాస్త తిన్నా చాలు, వీటిల్లో ఉండే ఫైబర్ కారణంగా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇలా ఇవి బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను కూడా రాత్రి పూట తినవచ్చు. అవకాడో, బాదంపప్పు, వాల్ నట్స్, చియా సీడ్స్‌ను రాత్రి పూట తినవచ్చు. అలాగే ఆలివ్ ఆయిల్‌ను కూడా తీసుకోవచ్చు. ఇవన్నీ రాత్రి పూట తీసుకోదగిన ఆహారాలు. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇవి ఎంతగానో దోహదం చేస్తాయి.

**ఈ కాంబినేషన్ ట్రై చేయండి..**

రాత్రిపూట ఆహారంలో చేపలను, కూరగాయలను కలిపి కాంబినేషన్‌లో తినవచ్చు. లేదా చికెన్, వెజిటబుల్ సలాడ్, ఫ్రూట్ సలాడ్ వంటి వాటిని కలిపి తీసుకోవచ్చు. బ్రౌన్ రైస్, వెజిటబుల్ సూప్‌ను కలిపి తీసుకోవచ్చు. సోయా టోఫు, కూరగాయలను కలిపి కూడా తినవచ్చు. ఇలా రాత్రి పూట భోజనాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. అయితే ఆరోగ్యకరమైన ఆహారాలను తిన్నప్పటికీ వీటిని రాత్రి పూట తక్కువ మోతాదులోనే తినాలి. ఇతర ఆహారాలతో పోలిస్తే ఇవి బరువు తగ్గేందుకు మనకు ఎంతో ఉపయోగపడతాయి. కానీ ఎక్కువ మోతాదులో మాత్రం తినకూడదు. ఇక రాత్రి పూట భోజనాన్ని వీలైనంత త్వరగా తినేయాల్సి ఉంటుంది. భోజనానికి, నిద్రకు మధ్య కనీసం 2 నుంచి 3 గంటల వ్యవధి ఉండేలా చూసుకోవాలి. చక్కెర ఉండే ఆహారాలు, ప్రాసెస్ ఫుడ్స్, శీతల పానీయాలను తాగకూడదు. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే అధిక బరువును చాలా తేలిగ్గా తగ్గించుకోవచ్చు.

## LPG సిలిండర్లను ఇంట్లో నిల్వ చేసుకుంటున్నారా? జైలు శిక్ష తప్పదు! రూల్స్ తెలుసుకోండి!



మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఎల్పీజీ గ్యాస్ లభ్యతపై ఆందోళన ఉన్నా, అదనపు సిలిండర్లను నిల్వ చేయడం చట్టవిరుద్ధం, ప్రమాదకరం. భారతదేశంలో 'ఒక ఇల్లు -- ఒక కనెక్షన్' విధానం అమలులో ఉంది. వినియోగదారులు డబుల్ సిలిండర్ కనెక్షన్ (ఐదీజ) ద్వారా రెండు సిలిండర్లు పొందవచ్చు. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, సరఫరా గొలుసు సమస్యల నేపథ్యంలో దేశంలో ఎల్పీజీ గ్యాస్ లభ్యతపై కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో కొంతమంది అవసరానికి మించి గ్యాస్ సిలిండర్లను నిల్వ చేసుకోవాలని భావిస్తున్నారు. అయితే ఇది ప్రమాదకరమైనదే కాకుండా చట్టవిరుద్ధమైన చర్యగా కూడా పరిగణించబడుతుంది. ప్రభుత్వం, చమురు కంపెనీలు ఎల్పీజీ కనెక్షన్లు, సిలిండర్ నిల్వపై కఠిన నియమాలను అమలు చేస్తున్నాయి. భారతదేశంలో సాధారణంగా ఒక ఇల్లు -- ఒక కనెక్షన్ అనే విధానం అమల్లో ఉంటుంది. అంటే ఒక ఇంటి చిరునామాకు ఒక ఎల్పీజీ కనెక్షన్ మాత్రమే చెల్లుబాటు అవుతుంది. దేశంలో ప్రధానంగా మూడు కంపెనీలు గృహ గ్యాస్ సేవలను అందిస్తున్నాయి. అవి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇండేన్ గ్యాస్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ హెచ్‌పీ గ్యాస్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ భారత్ గ్యాస్. ఒక వినియోగదారుడు ఇప్పటికే ఒక కంపెనీ నుండి గ్యాస్ కనెక్షన్ తీసుకున్నట్లయితే అదే చిరునామాలో మరో కంపెనీ నుండి కనెక్షన్ తీసుకోవడం చట్టవిరుద్ధంగా పరిగణించబడుతుంది. అయితే వినియోగదారులు తమ కనెక్షన్‌ను డబుల్ సిలిండర్ కనెక్షన్ (డీబీసీ)గా మార్చుకోవచ్చు. ఈ విధానంలో ఒకే కనెక్షన్ కింద రెండు సిలిండర్లు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. సాధారణంగా గృహ వినియోగదారులకు ఒక సిలిండర్ వాడకం కోసం, మరొకటి రిజర్వ్‌గా ఉండేలా రెండు సిలిండర్లు అనుమతిస్తారు. నిబంధనల ప్రకారం ఒక వినియోగదారుడు సంవత్సరానికి గరిష్ఠంగా 15 గృహ సిలిండర్లను పొందవచ్చు. అయితే అవసరానికి మించి సిలిండర్లను సేకరించడం లేదా చెల్లుబాటు అయ్యే అనుమతి లేకుండా 40 కిలోగ్రాములకంటే ఎక్కువ ఎల్పీజీ నిల్వ చేయడం చట్టవిరుద్ధంగా పరిగణించబడుతుంది. అటువంటి పరిస్థితుల్లో పరిపాలన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అక్రమంగా సిలిండర్లను నిల్వ చేయడం లేదా బ్లాక్ మార్కెటింగ్‌లో పాల్గొన్నట్లు తేలితే గ్యాస్ కనెక్షన్ రద్దు చేయడం, భారీ జరిమానాలు విధించడం వంటి చర్యలు తీసుకోవచ్చు. తీవ్రమైన సందర్భాల్లో ఈ కేసులు ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ కింద నమోదు కావచ్చు. ఈ చట్టం ప్రకారం నిందితులకు 3 నెలల నుంచి 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

## బంగారం కొనేవారికి కేంద్రం అదిరిపోయే గుడ్ న్యూస్.. ఈ ఒక్క నిర్ణయంతో భారీగా తగ్గనున్న ధరలు..!



గత కొంతకాలంగా ఆకాశమే హద్దుగా పెరుగుతున్న బంగారం ధరల మధ్య పసిడి ప్రియులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న మధ్యతరగతి ప్రజలకు, ఆభరణాల వ్యాపారులకు ఊరటనిస్తూ.. బంగారం బేస్ దిగుమతి ధరను తగ్గిస్తూ మోదీ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా బంగారం ధరల పెరుగుదలతో ఆందోళన చెందుతున్న మధ్యతరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. అంతర్జాతీయ మార్కెట్లో ధరల అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం బంగారం బేస్ దిగుమతి ధరను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ద్రవ్యోల్బణ సెగతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులకు ఇది గొప్ప ఊరటనిచ్చే అంశం. ప్రభుత్వం 10 గ్రాముల బంగారంపై బేస్ దిగుమతి ధరను 12 డాలర్ల మేర తగ్గించింది. గతంలో 1664 డాలర్లుగా ఉండగా.. ఇప్పుడు అది 1652 డాలర్లకు చేరింది.

### బేస్ దిగుమతి ధర అంటే ఏమిటి? దీని వల్ల లాభమేంటి?

సాధారణంగా దేశంలోకి దిగుమతి అయ్యే బంగారంపై కస్టమ్స్ సుంకం మరియు ఇతర దిగుమతి పన్నులను లెక్కించడానికి ప్రభుత్వం ఒక నిర్దిష్ట ధరకు ప్రామాణికంగా తీసుకుంటుంది. దీనే టారిఫ్ విలువ లేదా బేస్ దిగుమతి ధర అంటారు. ఇప్పుడు ఈ బేస్ ధర తగ్గడం వల్ల దిగుమతిదారులపై భారం తగ్గి.. దేశీయ మార్కెట్లోకి బంగారం తక్కువ ధరకు చేరుతుంది. అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గుల వల్ల పెరిగిన ఖర్చులను ఎదుర్కొంటున్న జువెలర్స్ మరియు బులియన్ వ్యాపారులకు ఈ నిర్ణయం పెద్ద మద్దతుగా నిలుస్తుంది. దిగుమతి ఖర్చులు తగ్గడంతో, ఆభరణాల వ్యాపారులు ఆ ప్రయోజనాన్ని కస్టమర్లకు బదిలీ చేసే అవకాశం ఉంది. తద్వారా దేశీయంగా బంగారం ధరలు కొంతమేర తగ్గే ఛాన్స్ ఉంది.

### ఎందుకు ఈ నిర్ణయం?

అంతర్జాతీయ ధోరణులకు అనుగుణంగా దేశీయ మార్కెట్ ధరలను సమతుల్యం చేయడానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఈ సవరణలు చేసింది. మన దేశీయ మార్కెట్ అంతర్జాతీయ మార్కెట్లతో పోటీ పడేలా ఉండటం మరియు వినియోగదారులపై ధరల ఒత్తిడిని తగ్గించడమే ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యం. ఈ నిర్ణయం రాబోయే రోజుల్లో ఈ ప్రభావం దేశీయ రిటైల్ మార్కెట్‌పై ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## కారు కొనాలనుకుంటున్నారా? అయితే ఈ గుడ్‌న్యూస్ మీకే! రూ.50000 తగ్గింపు




కియా భారత మార్కెట్లో మార్చి 2026 వరకు పలు కార్లపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం ముగిసే ముందు కారు కొనాలనుకునే వారికి ఇది సువర్ణావకాశం. సోనెట్, సెల్టోస్, కారెన్స్ వంటి మోడళ్లపై నగదు తగ్గింపు, ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ ప్రయోజనాలతో కలిపి రూ.50,000 వరకు ఆదా చేసుకోవచ్చు. దక్షిణ కొరియా ఆటోమొబైల్ కంపెనీ కియా భారత మార్కెట్లో మార్చి 2026 వరకు తన పలు కార్లపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం ముగిసే ముందు కారు కొనాలనుకునే వినియోగదారులను ఆకర్షించడానికి కంపెనీ ఈ ఆఫర్లను అందిస్తోంది. కొన్ని మోడళ్లపై మొత్తం ప్రయోజనం రూ.50,000 వరకు ఉండే అవకాశం ఉంది. కియా సోనెట్ కాంపాక్ట్ ఎస్‌యూవీపై మొత్తం రూ.30,000 వరకు డిస్కౌంట్ లభిస్తోంది. ఇందులో రూ.10,000 క్యాష్ తగ్గింపు, రూ.10,000 ఎక్స్ఛేంజ్ బోనస్, రూ.10,000 కార్పొరేట్ బెనిఫిట్స్ ఉన్నాయి. ఈ మోడల్ భారత మార్కెట్లో టాటా నెక్సాన్, హ్యుందాయ్ వెన్యూ, మారుతి సుజుకి బ్రెజ్జా వంటి ఎస్‌యూవీలతో పోటీ పడుతోంది. మిడ్ సైజ్ ఎస్‌యూవీ అయిన కియా సెల్టోస్ కొనుగోలు చేసే వారికి రూ.20,000 ఎక్స్ఛేంజ్ బోనస్‌తో పాటు ఎక్స్‌టెండెడ్ వారంటీ ప్యాకేజ్ అందుబాటులో ఉంది. ఈ వాహనం హ్యుందాయ్ క్రెటా, హోండా ఎలివేట్, స్కోడా కుషాక్ వంటి కార్లతో మార్కెట్లో పోటీపడుతోంది. కొత్త ఎస్‌యూవీ అయిన కియా సైరోస్ పై మొత్తం రూ.40,000 వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. ఇందులో రూ.10,000 క్యాష్ తగ్గింపు, రూ.20,000 ఎక్స్ఛేంజ్ బోనస్, రూ.10,000 కార్పొరేట్ ఆఫర్ ఉన్నాయి.

## 25 వేల రైళ్లను ఇండియన్ రైల్వేస్ ఎలా నిర్వహిస్తోంది? మైండ్‌బ్లాంక్ అయ్యే విషయాలు..!



భారతీయ రైల్వేలు ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద నెట్‌వర్క్‌గా సమయపాలన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ట్రాక్ నిర్వహణ, వాతావరణం, సాంకేతిక సమస్యల వల్ల ఆలస్యాలు జరుగుతున్నప్పటికీ, రైల్వేలు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాయి. డేటా లాగర్‌లు, ఆధునిక నిర్వహణ పద్ధతులు, మౌలిక సదుపాయాల మెరుగుదలతో రైళ్ల రాకపోకలు మెరుగుపడి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. భారతీయ రైల్వేలు ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద రైలు నెట్‌వర్క్‌గా గుర్తింపు పొందాయి. లక్షలాది మంది ప్రయాణికులను ప్రతి రోజు గమ్యస్థానాలకు చేర్చేందుకు రైల్వే ఉద్యోగులు నిత్యం విధుల్లో ఉంటారు. రోజుకు సుమారు 25,000 రైళ్లను సురక్షితంగా నడపడం ద్వారా అధిక స్థాయి కార్యాచరణ విశ్వసనీయతను రైల్వేలు కొనసాగిస్తున్నాయి. అయితే రైల్వే ట్రాక్‌ల నిర్వహణ పనులు, పొగమంచు పరిస్థితులు, చెడు వాతావరణం, మార్గ అడ్డంకులు, గొలుసు లాగడం, నిరసనలు, ట్రాక్‌లపై పశువులు చిక్కుకోవడం వంటి కారణాలు రైళ్ల సమయపాలనను ప్రభావితం చేస్తాయి. ప్రయాణికుల రైళ్లు, సరుకు రైళ్లు సకాలంలో నడిచేలా భారతీయ రైల్వేలు పలు చర్యలు చేపడుతున్నాయి. రైల్వే ఉద్యోగులు డివిజనల్, జోనల్, రైల్వే బోర్డు స్థాయిలో ప్యాసింజర్ రైళ్ల నడకను కఠినంగా పర్యవేక్షిస్తున్నారు. ఆస్తుల విశ్వసనీయతను పెంచడానికి వాటి నిర్వహణ కోసం రోలింగ్ బ్లాక్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టడం, ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాల అడ్డంకులను తొలగించడం, శాస్త్రీయ పద్ధతిలో టైమ్ టేబుల్‌ను హేతుబద్ధీకరించడం వంటి చర్యలు అమలు చేస్తున్నారు. ప్యాసింజర్ రైళ్ల రాకపోకలను నిజ సమయంలో గుర్తించడానికి డేటా లాగర్‌లను ఉపయోగిస్తున్నారు. సాంకేతికత, మెరుగైన మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రైల్వే ఆస్తుల విశ్వసనీయతను పెంచుతున్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి వల్ల లోకోస్, ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ (ఓహెచ్‌ఈ) వంటి వ్యవస్థల్లో వైఫల్యాల శాతం దాదాపు 2 శాతానికి పరిమితమైంది. రైల్వే మార్గదర్శకాల ప్రకారం ట్రాక్, రోలింగ్ స్టాక్, ఓహెచ్‌ఈ, సిగ్నలింగ్ వంటి అన్ని ఆస్తులను సకాలంలో తనిఖీ చేసి నిర్వహణ చేపడతారు. జోనల్ రైల్వేలలో ప్రత్యేక అధికారులను నియమించి పనులను పర్యవేక్షిస్తున్నారు. నివారణ నిర్వహణ చర్యల ద్వారా రైళ్ల భద్రతను కూడా నిర్ధారిస్తున్నారు. రైల్వేలు ప్రత్యేక సమయపాలన డ్రైవ్‌లను నిర్వహించి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాయి. డీజిల్ లోకోమోటివ్‌లు, ఓహెచ్‌ఈ వైఫల్యాలు, సిగ్నల్ సమస్యలు, ట్రాక్ లోపాలు, రద్దీ, రోలింగ్ స్టాక్ సమస్యల వల్ల జరిగే ప్రతి రైలు ఆలస్యాన్ని అధికారులు విశ్లేషించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటారు. రైళ్ల సజావుగా నడవడానికి ట్రాక్ స్థిరత్వం, డ్రైనేజీ మెరుగుపరచేందుకు బ్యాలస్ట్ లోతైన స్క్రీనింగ్ నిర్వహిస్తారు. అధిక సామర్థ్యంతో పనిచేసే బ్యాలస్ట్ క్లీనింగ్ మెషీన్లు (బీసీఎంలు) ఉపయోగించి ఈ పనిని చేస్తారు. హై అవుట్‌పుట్ బ్యాలస్ట్ క్లీనింగ్ మెషీన్లు (హెచ్‌ఓబీసీఎంలు) ఉపయోగించడం ద్వారా తక్కువ మాన్యువల్ జోక్యంతో ట్రాక్ బ్యాలస్ట్ బెడ్‌ను సమర్థవంతంగా, సమానంగా శుభ్రపరచడం సాధ్యమవుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

## ఎస్బీఐలో రూ.75లక్షల హోమ్ లోన్ రావాలంటే ఎంత జీతం ఉండాలో తెలుసా..?



మధ్యతరగతి ప్రజల అతిపెద్ద కల.. ఒక సొంత ఇల్లు. ఆ కలను సాకారం చేసుకునే క్రమంలో హోమ్ లోన్ ఒక వరంగా మారుతుంది. అయితే గతంలో ఆకాశాన్ని తాకిన వడ్డీ రేట్ల.. ఇప్పుడు కొద్దిగా తగ్గాయి. ఈ క్రమంలో రూ.75 లక్షల లోన్ తీసుకోవాలంటే మీ నెలవారీ ఆదాయం ఎంత ఉండాలి? ఏ బ్యాంక్ తక్కువ వడ్డీని వసూలు చేస్తోంది? అనేది తెలుసుకుందాం.. ప్రస్తుతం సొంత ఇల్లు కట్టుకోవడం అనేది మధ్యతరగతి ప్రజలకు ఒక పెద్ద సవాలు. ఈ కలను సాకారం చేసుకోవడానికి మెజారిటీ ప్రజలు హోమ్ లోన్స్‌నే నమ్ముకుంటారు. గత ఏడాది రెపో రేటులో దాదాపు 1.25 శాతం తగ్గడంతో ప్రస్తుతం హోమ్ లోన్స్ వడ్డీ రేట్లు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల ఈఎంఐ భారం తగ్గి, రుణగ్రహీతలకు కొంత ఊరట లభిస్తోంది. ప్రస్తుతం దేశంలోని ప్రముఖ బ్యాంకులు 7.10 శాతం నుంచే గృహ రుణాలను ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుతం సుమారు 7.25 శాతం వడ్డీ రేటుతో గృహ రుణాలను అందిస్తోంది. ఉదాహరణకు.. మీరు ాదీ× నుండి 30 ఏళ్ల కాలపరిమితితో రూ.75 లక్షల హోమ్ లోన్ తీసుకుంటే, మీ నెలవారీ ఈఎంఐ సుమారు రూ.51,000 వరకు ఉంటుంది. అయితే కేవలం ఈఎంఐ కట్టడమే కాకుండా మీ కుటుంబ అవసరాలకు కూడా డబ్బు మిగలాలి కాబట్టి బ్యాంకులు మీ ఆదాయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాయి.

### ఎంత జీతం ఉండాలి..?

సాధారణంగా బ్యాంకులు లోన్ తీసుకునే వారి నికర ఆదాయంలో 40 నుండి 50 శాతం మాత్రమే ఈఎంఐకి కేటాయించేలా చూస్తాయి. దీని ప్రకారం.. మీరు రూ.50,000 ఈఎంఐ చెల్లించాలంటే మీ నెలవారీ జీతం కనీసం రూ.1 లక్ష లేదా అంతకంటే ఎక్కువ ఉండాలి. మీకు ఇదివరకే కార్ లోన్ లేదా పర్సనల్ లోన్ వంటి ఇతర రుణాలు ఉంటే, మీకు వచ్చే హోమ్ లోన్ మొత్తం ఇంకా తగ్గే అవకాశం ఉంటుంది.

### వడ్డీ రేట్లు ఇలా..?

ప్రస్తుతం వివిధ బ్యాంకుల వడ్డీ రేట్లను పరిశీలిస్తే.. బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యంత తక్కువగా 7.10 శాతానికే రుణాలు ఇస్తోంది. కెనరా బ్యాంక్ 7.15 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 7.20 శాతం, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ సుమారు 7.30 శాతం వడ్డీని వసూలు చేస్తున్నాయి. ఈ రేట్లు మీ క్రెడిట్ స్కోరును బట్టి కొద్దిగా మారే అవకాశం ఉంటుంది.

### సిబిల్ ముఖ్యం

హోమ్ లోన్ విషయంలో మీ క్రెడిట్ స్కోరు ఒక వజ్రాయుధం లాంటిది. మీ స్కోరు 750 కంటే ఎక్కువగా ఉంటే బ్యాంకులతో చర్చించి వడ్డీ రేటులో మరిన్ని రాయితీలు పొందే అవకాశం ఉంటుంది. అదే స్కోరు తక్కువగా ఉంటే రుణ ఆమోదంలో జాప్యం జరగడమే కాకుండా బ్యాంకులు ఎక్కువ వడ్డీని వసూలు చేసే ప్రమాదం ఉంది. కాబట్టి రుణం తీసుకునే ముందే వడ్డీ రేట్లు, మీ ఆదాయం మరియు ఇతర ఖర్చులను బేరీజు వేసుకోవడం చాలా ముఖ్యం.

## పెట్టుబడిదారులకు గోల్డెన్ ఛాన్స్.. చీూజులో 10 గ్రాముల గోల్డ్ ఫ్యూచర్స్ ప్రారంభం!







నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ) మార్చి 16 నుండి 10 గ్రాముల గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టులను ప్రారంభించనుంది. సెబీ ఆమోదంతో, చిన్న పెట్టుబడిదారులు కూడా గోల్డ్ డెరివేటివ్స్ మార్కెట్‌లో సులభంగా పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఈ కాంట్రాక్ట్ 999 ప్యూరిటీ బంగారం డెలివరీని తప్పనిసరి చేస్తుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ) మార్చి 16 నుండి చిన్న పరిమాణంలో గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టులను ప్రారంభించనుంది. దేశంలోని అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ కమోడిటీ డెరివేటివ్స్ విభాగంలో 10 గ్రాముల గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టును ప్రవేశపెడుతోంది. ఈ కొత్త కాంట్రాక్ట్ ప్రారంభంతో చిన్న పెట్టుబడిదారులు కూడా బంగారం ట్రేడింగ్‌లో సులభంగా పాల్గొనే అవకాశం పొందనున్నారు. ఎన్ఎస్ఈ అధికారిక ప్రకటన ప్రకారం కమోడిటీ డెరివేటివ్స్ విభాగంలో 10 గ్రాముల గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ ట్రేడింగ్ మార్చి 16 నుండి ప్రారంభమవుతుంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా పెట్టుబడిదారుల కోసం ఈ కొత్త ప్రోడక్ట్ సిద్ధంగా ఉందని ఎక్స్ఛేంజ్ ప్రకటించింది. ఈ కాంట్రాక్ట్ ప్రారంభానికి ముందు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) నుండి అనుమతి కూడా లభించింది.

**కాంట్రాక్ట్ ముఖ్య అంశాలు**
**ట్రేడింగ్ యూనిట్: 10 గ్రాములు**
**డెలివరీ యూనిట్: 10 గ్రాములు**
**కాంట్రాక్ట్ సింబల్: గోల్డ్10జీ**
**కనీస ప్రైస్ మూవ్‌మెంట్: 10 గ్రాములకు రూ.1**

ట్రేడింగ్ సమయం సోమవారం నుండి శుక్రవారం వరకు ఉదయం 9:00 గంటల నుండి రాత్రి 11:30 లేదా 11:55 వరకు ఉంటుంది. యూఎస్ డేలైట్ సేవింగ్ పీరియడ్ ప్రకారం ఈ సమయం కొద్దిగా మారే అవకాశం ఉంది. ఈ కాంట్రాక్ట్‌కు రోజువారీ బేస్ ప్రైస్ లిమిట్ 6 శాతంగా నిర్ణయించారు. ఒకవేళ ఈ పరిమితి దాటితే, 15 నిమిషాల కూలింగ్ ఆఫ్ పీరియడ్ తర్వాత దీనిని 9 శాతం వరకు పెంచవచ్చు. ఇది మంత్లీ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్‌గా ఉంటుంది. కాంట్రాక్ట్ గడువు నెల చివరి ట్రేడింగ్ డే వరకు ఉంటుంది. ఆ రోజు హాలిడే అయితే, ముందురోజు వర్కింగ్ డేను చివరి ట్రేడింగ్ డేగా పరిగణిస్తారు. ఈ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్‌లో తప్పనిసరి డెలివరీ విధానం ఉంటుంది. డెలివరీ కోసం 999 ప్యూరిటీ కలిగిన 10 గ్రాముల బంగారం అంగీకరించబడుతుంది. మార్గదర్శకాల ప్రకారం బంగారం ఎల్‌బీఎంఏ (లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్) ఆమోదించిన సప్లయర్ లేదా ఎన్ఎస్ఈ ఆమోదించిన సప్లయర్ నుండి రావాలి. అలాగే క్వాలిటీ సర్టిఫికేషన్ కూడా ఉండాలి. డెలివరీ ప్రక్రియ అహ్మదాబాద్‌లోని ఎక్స్ఛేంజ్ నియమించిన క్లియరింగ్ హౌస్ ద్వారా పూర్తవుతుంది. ఈ కొత్త 10 గ్రాముల గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ ప్రారంభంతో చిన్న పెట్టుబడిదారులకు గోల్డ్ డెరివేటివ్స్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం మరింత సులభమవుతుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

## గుడ్ న్యూస్.. గ్యాస్ ధరలను భారీగా తగ్గించిన ఆదానీ గ్రూప్.. కొత్త రేట్లు ఇవే




పారిశ్రామిక రంగానికి ఊరటనిస్తూ అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ కీలక నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి గ్యాస్ ధరలు తగ్గడంతో ఆ ప్రయోజనాన్ని పారిశ్రామిక వినియోగదారులకు బదిలీ చేస్తూ అదనపు సహజ వాయువు ధరలను భారీగా తగ్గించింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గ్యాస్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పటికీ, పరిశ్రమలపై భారం తగ్గించడమే లక్ష్యంగా కంపెనీ ఈ సవరణ చేపట్టింది. పారిశ్రామిక రంగానికి ఊరటనిస్తూ అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ కీలక ప్రకటన చేసింది. పారిశ్రామిక వినియోగదారులకు సరఫరా చేసే అదనపు సహజ వాయువు ధరలను భారీగా తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. అంతర్జాతీయంగా అప్‌స్ట్రీమ్ గ్యాస్ ధరలు తగ్గడంతో ఆ ప్రయోజనాన్ని నేరుగా వినియోగదారులకు బదిలీ చేయాలని కంపెనీ నిర్ణయించింది. ఈ కొత్త ధరలు మార్చి 16, ఉదయం 6 గంటల నుండి అమలులోకి రానున్నాయి.

### ధరల తగ్గింపు వివరాలు

పారిశ్రామిక వినియోగదారులు తమ కాంట్రాక్ట్ పరిమితికి మించి వాడే అదనపు గ్యాస్ ధరపై ఈ తగ్గింపు వర్తిస్తుంది.

పాత ధర: ప్రామాణిక క్యూబిక్ మీటర్‌కు రూ. 119.90
కొత్త ధర: ప్రామాణిక క్యూబిక్ మీటర్‌కు రూ. 82.95
తగ్గింపు: దాదాపు రూ. 36.95 మేర తగ్గింది.

**తగ్గింపుకు కారణాలు**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల హార్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. దీనివల్ల భారతదేశానికి వచ్చే ఎల్ఎన్‌జీ సరఫరాలకు కొంత అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో గ్యాస్ కొరత ఏర్పడకుండా ఉండేందుకు పారిశ్రామిక వినియోగదారులు తమ కాంట్రాక్ట్ వాల్యూమ్‌లో 40 శాతానికి వినియోగాన్ని తగ్గించుకోవాలని కంపెనీ గతంలోనే కోరింది. సరఫరా సవాళ్లు ఉన్నప్పటికీ, అప్‌స్ట్రీమ్ ధరలు తగ్గడంతో ఆ లాభాన్ని వినియోగదారులకు అందించాలని ాూ+ూ నిర్ణయించింది. గ్యాస్ పంపిణీ సమానంగా జరగాలని, అదే సమయంలో సిస్టమ్ స్థిరంగా ఉండాలనే లక్ష్యంతో ఈ ధరల సవరణ చేపట్టినట్లు కంపెనీ పేర్కొంది.

సామాన్యులపై ప్రభావం ఏంటి?

ఈ ధరల తగ్గింపు కేవలం పారిశ్రామిక, వాణిజ్య విభాగాలకు మాత్రమే పరిమితం అయ్యింది.

CNG -- వంట గ్యాస్ : అదానీ గ్యాస్ వాల్యూమ్‌లో 70 శాతం గృహ అవసరాలకు, వాహనదారులకే సరఫరా అవుతుంది. ఈ విభాగాల ధరల్లో ఎలాంటి మార్పు లేదు. దిగుమతి చేసుకున్న గ్యాస్: మిగిలిన 30 శాతం దిగుమతి చేసుకున్న ాచీ+ ద్వారా వస్తుంది. దీనినే పరిశ్రమలకు కేటాయిస్తారు. ప్రస్తుత తగ్గింపు ఈ విభాగానికే వర్తిస్తుంది. సరఫరాలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూనే, పరిశ్రమలకు భారం తగ్గించే దిశగా అదానీ-టోటల్ గ్యాస్ వేసిన ఈ అడుగు పారిశ్రామిక వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. దీనికి సంబంధించి గెయిల్ ఇండియా నుండి మరిన్ని స్పష్టతలు కోరినట్లు కంపెనీ తెలిపింది. దీనివల్ల భవిష్యత్తులో సరఫరా మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

## రిటైర్మెంట్ ప్రకటించిన పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్

### అంతర్జాతీయ క్రికెట్ కు గుడ్ బై చెప్పేసిన సర్ఫరాజ్- ఈ మాజీ కెప్టెన్ పేరిట అరుదైన రికార్డు



పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ఇచ్చేస్తున్నట్లు ఆదివారం ప్రకటించాడు. పాకిస్థాన్ జాతీయ జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నట్లు సర్ఫరాజ్ పేర్కొన్నాడు. 2023లో పెర్త్ వేదికగా ఆస్ట్రేలియాతో సర్ఫరాజ్ తన కెరీర్ లో ఆఖరి ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడాడు. అయితే సర్ఫరాజ్ పేరిట పాకిస్థాన్ జట్టుకు రెండు ఐసీసీ ట్రోఫీలు అందించిన ఏకైక కెప్టెన్ గా అరుదైన రికార్డు ఉంది. 'పాకిస్థాన్ జాతీయ జట్టుకు మూడు ఫార్మాట్లలోనూ కెప్టెన్ గా వ్యవహరిస్తానని నేను కలలో కూడా ఊహించలేదు. అలాగే ఒక కెప్టెన్ గా 2006 అండర్ 19 వరల్డ్ కప్, 2017 ఛాంపియన్స్ ట్రోఫీలో టైటిళ్లు నెగ్గడం నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే చిరస్మరణీయ సందర్భాలు' అని 38ఏళ్ల సర్ఫరాజ్ పేర్కొన్నాడు. కెప్టెన్సీలో మార్క్ సర్ఫరాజ్ తన అంతర్జాతీయ కెరీర్‌లో మొత్తం 100 మ్యాచ్‌లకు పాకిస్థాన్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ లో కెప్టెన్‌గా 37 ం20, 50 వన్డేలు, 13 టెస్ట్‌ల్లో జట్టును నడిపించాడు. సర్ఫరాజ్ నాయకత్వంలో పాక్ 20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. ఆ జట్టు వరుసగా 11 టీ20 సిరీస్‌లను గెలుచుకోవడంతో ప్రపంచ రికార్డును కూడా సృష్టించింది. ఇందులో వెస్టిండీస్, శ్రీలంక, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, స్కాట్లాండ్‌లపై ఆరు క్లీన్ స్వీప్‌లు ఉన్నాయి. అతడి కెప్టెన్సీలోనే పాక్ 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత్ ను 180 పరుగుల తేడాతో ఓడించింది. 2006లో శ్రీలంకలో అండర్-19 ప్రపంచ కప్ గెలిచిన జట్టుకు నాయకత్వం వహించాడు. ఈ విజయానికి గుర్తింపుగా సర్ఫరాజ్‌కు 2018లో ప్రైడ్ ఆఫ్ పెర్ఫార్మెన్స్ అవార్డు దక్కింది. ఈ అవార్డును అందుకున్న అతి పిన్న వయస్కుడైన పాకిస్థాన్ కెప్టెన్ గానూ సర్ఫరాజ్ ఘనత సాధించాడు.

సర్ఫరాజ్ వ్యక్తిగత రికార్డులు

2019లో జోహన్నెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో 10 క్యాచ్‌లు పట్టిన వికెట్ కీపర్ గా రికార్డు నమోదు చేశాడు. లార్డ్స్‌లో వన్డే సెంచరీ సాధించిన ఏకైక పాకిస్థానీ వికెట్ కీపర్, బ్యాటర్ రికార్డు సృష్టించాడు. ఇక వికెట్ కీపర్‌గా, సర్ఫరాజ్ 315 క్యాచ్‌లు, 56 స్టంపింగ్‌లు చేశాడు. కాగా, సర్ఫరాజ్ కెప్టెన్సీలోనే 2006లో అండర్ 19, 2017 ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ ఛాంపియన్ గా నిలిచింది. 2017 తర్వాత పాక్ ఇప్పటిదాకా ఒక్క ఐసీసీ ఈవెంట్‌లోనూ టైటిల్ నెగ్గలేదు. 2010లో సర్ఫరాజ్ అంతర్జాతీయ క్రికెట్ లో అరంగేట్రం చేశాడు. అతడి కెరీర్ లో 54 టెస్టుల్లో 3031 పరుగులు, 117 వన్డేల్లో 2315 పరుగులు, 61 టీ20ల్లో 818 పరుగులు చేశాడు. ఇందులో మొత్తం ఆరు (4 టెస్టు, 2 వన్డే) సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

కోచ్‌గా రీ ఎంట్రీ!

గతేడాది పాక్ జట్టుకు తాత్కాలిక ప్రధాన కోచ్‌గా వ్యవహరించిన ఆల్‌రౌండర్ అజహర్ మహమూద్‌తో పీసీబీ కాంట్రాక్ట్ ముగిసింది. ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీగా ఉంది. అయితే సర్ఫరాజ్ ను పాకిస్థాన్ టెస్టు ఫార్మాట్ కు కోచ్ గా నియమిస్తారని ప్రచారం సాగుతోంది. కానీ దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది.

## వరల్డ్ కప్ ప్రైజ్ మనీ ఒక్కో ఎడిషన్ కు నజరానా ఎంత రివార్డ్ లిస్ట్ ఇదే!

### 2026 టీ20 వరల్డ్ కప్ - విజేత టీమ్ఇండియాకు భారీగా ప్రైజ్ మనీ- ఏ ఎడిషన్ లో ఎంత నజరానా ఇచ్చారో తెలుసా



2026 టీ20 వరల్డ్ కప్ ఛాంపియన్ గా నిలిచిన భారత్ కు బీసీసీఐ భారీ ప్రైజ్ మనీ అందించనుంది. జట్టుకు రూ.131 కోట్లు బోర్డు రీసెంట్ గా ప్రకటించింది. అంటే విజేతకు ఐసీసీ ఇవ్వనున్న రూ. 24.50 కోట్లకు అదనంగా బీసీసీఐ ఈ మొత్తాన్ని ఇవ్వనుంది. ఈ క్రమంలో పొట్టి కప్పు టోర్నమెంట్ ప్రైజ్ మనీ క్రీడావర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. అయితే 2007లో టీ20 వరల్డ్ కప్ ప్రారంభమైనప్పటి నుంచి ఐసీసీ ప్రతీ ఎడిషన్ కు ప్రైజ్ మనీని పెంచుతూ వస్తోంది. మరోవైపు, ఐసీసీ టోర్నీ ఏదైనాగానీ భారత్ ఛాంపియన్ గా నిలిస్తే, బీసీసీఐ అదనంగా భారీ ప్రోత్సాహకం అందిస్తుంటుంది. అలా గతంలోనూ టీమ్ఇండియా వరల్డ్ కప్ నెగ్గిన సందర్భాల్లో బోర్డు ప్రైజ్ మనీ అందించింది. అయితే తాజా వరల్డ్ కప్‌తో కలిపి భారత్ ఇప్పటిదాకా ఐదుసార్లు విశ్వ విజేతగా నిలిచింది. ఇందులో రెండుసార్లు వన్డే, మూడుసార్లు టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఇందులో కపిల్ దేవ్ సారథ్యంలో వన్డే వరల్డ్ కప్ (1983) నెగ్గిన సందర్భాన్ని మినహాయిస్తే, మిగిలిన నాలుగుసార్లు కూడా భారత్ జట్టుకు బీసీసీఐ భారీగానే ప్రైజ్ మనీ అందించింది. ఈ క్రమంలోనే 2007లో టీమ్ఇండియా పొట్టికప్పు నెగ్గినప్పుడు బోర్డు తొలిసారి ప్రైజ్ మనీ ప్రకటించింది. మరి అప్పుడు ఎంత ఇచ్చింది? ఆ తర్వాత వరల్డ్ కప్ నెగ్గినప్పుడల్లా ఎంత ప్రైజ్ మనీ ప్రకటించింది? అలాగే ప్రతీ టీ20 వరల్డ్ కప్ ఎడిషన్ కు ఐసీసీ ప్రైజ్ మనీని ఎంతెంత పెంచుతూ వస్తుంది? అనే విషయాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం! ఐసీసీ ప్రైజ్ మనీ ఎడిషన్లవారీగా! 2007లో ఐసీసీ టీ20 వరల్డ్ కప్ ను తొలిసారి నిర్వహించింది. ఇందులో భారత్ విశ్వవిజేతగా నిలిచింది. మహేంద్రసింగ్ ధోనీ కెప్టెన్సీలో ఆడిన టీమ్ఇండియా ఫైనల్ లో పాకిస్థాన్ ను ఓడించి ఛాంపియన్‌గా నిలిచింది. దీంతో అప్పుడు ఐసీసీ రూ.2.02 కోట్ల ప్రైజ్ మనీ అందించింది. టీ20 వరల్డ్ కప్ ఎడిషన్ విజేత ప్రైజ్‌మనీ 2007 భారత్ రూ.2.02 కోట్లు 2009 పాకిస్థాన్ రూ.3.63 కోట్లు 2010 ఇంగ్లాండ్ రూ.4.57 కోట్లు 2012 వెస్టిండీస్ రూ.5.34 కోట్లు 2014 శ్రీలంక రూ.6.71 కోట్లు 2016 వెస్టిండీస్ రూ.10.75 కోట్లు 2021 ఆస్ట్రేలియా రూ.12.00 కోట్లు 2022 ఇంగ్లాండ్ రూ.13.20 కోట్లు 2024 భారత్ రూ.20.42 కోట్లు 2026 భారత్ రూ.24.50 కోట్లు భారత్ ఛాంపియన్ గా నిలిచిన ఎడిషన్లలో ఇచ్చిన ప్రైజ్ మనీ 2026కు భారీగా తాజాగా విశ్వవిజేతగా నిలిచిన భారత్ కు బీసీసీఐ రూ.131 కోట్ల నజరానా ప్రకటించింది. ఇప్పటిదాకా పురుషులు, మహిళల క్రికెట్ లో బీసీసీఐ అందించిన అత్యధిక ప్రైజ్ మనీ ఇదే కావడం విశేషం. ఈ ప్రైజ్ మనీని ఆటగాళ్లు, సిబ్బంది, ఫిజియో, కోచ్ లకు పంచనున్నారు. ఇలాగే ఇటీవల 2026 అండర్ 19 వరల్డ్ కప్ ఛాంపియన్ గా నిలిచిన యువ భారత్ కు కూడా బీసీసీఐ ప్రైజ్ మనీ అందించింది. ఈ టోర్నీ విజేత టీమ్ఇండియాకు రూ.7.5 కోట్ల ప్రైజ్ మనీ ఇచ్చింది. 2025లో ఎంతంటే గతేడాది నవంబర్ లో సొంతగడ్డపై జరిగిన మహిళల వన్డే వరల్డ్ కప్ లో భారత అమ్మాయిలు ఛాంపియన్లుగా నిలిచారు. నవీముంబయి వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్ లో భారత్ 52 పరుగుల తేడాతో నెగ్గి సరికొత్త చరిత్ర సృష్టించింది. మహిళల విభాగంలో వన్డే వరల్డ్‌కప్ నెగ్గడం భారత్ కు ఇదే తొలిసారి కావడంతో దేశంలో సంబరాలు అంబరాన్నంటాయి. దీంతో బీసీసీఐ కూడా మహిళల క్రికెట్ కు ప్రోత్సాహకంగా రూ.51 కోట్ల భారీ ప్రైజ్ మనీ ప్రకటించింది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ దుబాయ్ వేదికగా రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత్ రెండో వైట్ బాల్ ఐసీసీ ట్రోఫీని అందుకుంది. ఈ టోర్నీ ఫైనల్ లో భారత్, కివీస్ పై నెగ్గింది. ఈ విజయానికిగానూ బీసీసీఐ టీమ్ఇండియాకు రూ.58 కోట్ల రివార్డ్ ప్రకటించింది. 2024 రోహిత్ కెప్టెన్సీలో టీ20 వరల్డ్ కప్ హిస్టరీలో దాదాపు 17ఏళ్ల తర్వాత టీమ్ఇండియా 2024లో ట్రోఫీ సాధించింది. బర్బడోస్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన ఈ ఫైనల్ లో టీమ్ఇండియా 7 రన్స్ తో నెగ్గింది. అప్పటికి సీనియర్ పురుషుల క్రికెట్ లో ఐసీసీ ట్రోఫీ నెగ్గక 11ఏళ్లు గడిచింది. దీంతో రోహిత్ బృందానికి బీసీసీఐ రూ.125 కోట్ల నజరానా ప్రకటించింది. 2011 వరల్డ్ కప్ 2011 వన్డే వరల్డ్ కప్ భారత క్రికెట్ అభిమానులకు ఎంతో ప్రత్యేకం. ముంబయి వాంఖడే వేదికగా ధోనీ సేన శ్రీలంకపై ఫైనల్ లో చరిత్రాత్మకమైన విజయం సాధించి విశ్వవిజేతగా నిలిచింది. ఆ జట్టులో సచిన్ తెందుల్కర్, విరేంద్ర సెహ్వాగ్, జహీర్ ఖాన్, గౌతమ్ గంభీర్, యువరాజ్ సింగ్ లాంటి దిగ్గజాలు ఉన్నారు. దాదాపు 28ఏళ్ల తర్వాత టీమ్ఇండియా ఈ ప్రతిష్ఠాత్మకమైన ట్రోఫీని ముద్దాడింది. అప్పుడు భారత జట్టుకు రూ.39 కోట్ల ప్రైజ్ మనీని బీసీసీఐ అందించింది. తొలిసారి ఎంతంటే తొలి టీ20 ప్రపంచకప్ ను 2007లో భారత్ నెగ్గింది. ఇది భారత్ కు మూడో ఐసీసీ ట్రోఫీ. అంతకుముందు (1983 వన్డే వరల్డ్ కప్, 2002 ఛాంపియన్స్ ట్రోఫీ సంయుక్తంగా) రెండుసార్లే నెగ్గింది. దీంతో బీసీసీఐ అప్పుడు రూ.12

## ‘మామూలోడు కాదు- ద్రవిడ్ కు చెప్పి మరీ చేశాడుగా!‘- వైభవ్ గేమ్ ప్లాన్ రివీల్ చేసిన శాంసన్

### మరో రెండు వారాల్లో 2026 ఐపీఎల్ ప్రారంభం

### అందరి కళ్లు వైభవ్ పైనే- అతడి గురించి

### ఇంట్రెస్టింగ్ విషయం రివీల్ చేసిన శాంసన్



2026 ఐపీఎల్ ప్రారంభానికి రోజులు దగ్గరపడుతున్నాయి. ఇదే నెల 28న కొత్త సీజన్ గ్రాండ్ గా షురూ కానుంది. ఈ క్రమంలో మరోసారి అందరి చూపు యువ సంచ లనం వైభవ్ సూర్యవంశీపైనే నెలకొంది. గతేడాది ఐపీఎల్ లో అరంగేట్రం చేసి విధ్వంసం సృష్టించిన ఈ చిచ్చరపిడుగుపై ఈసారి భారీగా అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో వైభవ్ గురించి శాంసన్ ఓ ఆసక్తికర విషయం బయట పెట్టాడు. మార్చి 15న బీసీసీఐ దిల్లీ వేదికగా నమన్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించింది. ఈ ఈవెంట్ లో ఇటీవల వరల్డ్ కప్ సాధించిన మహిళల, పురుషుల జట్లను సన్మానించారు. వైభవ్ సూర్యవంశీ కూడా ఈ కార్యక్రమానికి వచ్చాడు. అతడు తన సీనియర్లు హార్దిక్ పాండ్య, అభిషేక్ శర్మ, సంజు శాంసన్ తో కలిసి క్వశ్చన్ సెషన్ లో పాల్గొన్నాడు. అందులో వైభవ్ కు హోస్ట్ ఆసక్తికర ప్రశ్నలు అడిగాడు. ఐపీఎల్ లో తాను ఎదుర్కొన్న తొలి బంతి ఎక్కడికి వెళ్లింది అని అడగ్గా, ‘లఖ్ నవూ సూపర్ జెయింట్స్ పై డెబ్యూ మ్యాచ్ ఆడాను. ఆ మ్యాచ్ లో నేను ఎదుర్కొన్న తొలి బంతినే కవర్స్ మీదుగా సిక్స్ కొట్టాను‘ అని వైభవ్ రిప్లై ఇచ్చాడు. ‘అయితే మీ కోచ్ ఇక్కడే ఉన్నాడు (రాహుల్ ద్రవిడ్ ను ఉద్దేశిస్తూ). ఆయన టెస్టుల్లో ఓపిగ్గా ఆడుతూ రెండు రోజులు కూడా బ్యాటింగ్ చేయగలడు. అలాంటిది నువ్వు తొలి బంతినే సిక్స్ కొడతానని చెప్పినప్పుడు ఆయన రియాక్షన్ ఏంటి‘ అని అడిగాడు. దీనికి వైభవ్ సమాధానం చెబుతుండగా, అక్కడే ఉన్న శాంసన్ మధ్యలో కల్పించుకొని వివరంగా చెప్పాడు. “లఖ్ నవూతో మ్యాచ్ ముందు రోజు ద్రవిడ్ సర్ నన్ను, వైభవ్ ను రూమ్ కు పిలిచాడు. ‘వైభవ్ చాలా చిన్నపిల్లవాడు. ఎలా ఆడాలి ఎలా ముందుకెళ్లాలో మనం అతడికి చెప్పాలి‘ అని సర్ అన్నాడు. వెంటనే ‘వైభవ్ నీ గేమ్ ప్లాన్ ఏంటి‘ అని రాహుల్ సర్ అతడిని అడిగాడు. దీనికి అతడు ‘ప్లాన్ అంటూ ఏమీ లేదు సర్, అవకాశం వస్తే తొలి బంతినే గాల్లోకి లేపేయడమే‘ అని చెప్పాడు. అతడు వీడియో గేమ్ ఆడుతున్నాడా ఏంటి అని నేను అప్పుడే అనుకున్నా“ అని శాంసన్ నవ్వుతూ వైభవ్ అరంగేట్రం కంటే ముందు జరిగిన సంభాషణను షేర్ చేసుకున్నారు. ఆ సంభాషణలో చెప్పినట్లే వైభవ్ ఆ మ్యాచ్ లో తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్ గా మలిచాడు. కాగా, గతేడాది లఖ్ నవూతో జరిగిన మ్యాచ్ తో వైభవ్ ఐపీఎల్ లో అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్ లో ఓపెనర్ గా బ్యాటింగ్ కు దిగిన వైభవ్ తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్ గా మలిచి ఔరా అనిపించాడు. శార్దూల్ ఠాకూర్ వేసిన ఆ ఓవర్ నాలుగో బంతిని వైభవ్ కవర్స్ దిశగా స్టాండ్స్ కు పంపించాడు. అలా ఐపీఎల్ కెరీర్ ను సిక్స్ తో ఆరంభించిన అతికొద్దిమంది క్రికెటర్లలో ఒకడిగా నిలిచాడు. ఆ తర్వాత గుజరాత్ తో మ్యాచ్ లో 35 బంతుల్లోనే సెంచరీ సాధించి సరికొత్త రికార్డ్ కొట్టాడు. “అదే నా కల“ ఇక ఇదే ఈవెంట్ లో పలు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. ఈసారి రాజస్థాన్ రాయల్స్ జట్టును ఐపీఎల్ లో ఛాంపియన్‌గా నిలపడమే తన ఏకైక లక్ష్యమని వైభవ్ పేర్కొన్నాడు. “నేను వ్యక్తిగతంగా రాణించగలిగితే, దాని ప్రయోజనం మొత్తం జట్టుకు దక్కుతుంది. వంటి భారీ టోర్నమెంట్‌లో ట్రోఫీని గెలవడం ప్రతి ఆటగాడి కల. ఆ దృఢ సంకల్పంతోనే నేను కూడా బరిలోకి దిగుతాను“ అని అన్నాడు. అలాగే ఐపీఎల్ లో తాను ఏ రికార్డును బ్రేక్ చేయాలని అనుకుంటున్నావని అడగ్గా, లెజెండరీ క్రికెటర్ క్రిస్ గేల్ నెలకొల్పిన 175 పరుగుల రికార్డును తాను బద్దలు కొట్టాలని అనుకుంటున్నట్లు చెప్పాడు. 2013 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడిన క్రిస్ గేల్, చిన్నస్వామి స్టేడియంలో పూణె వారియర్స్ ఇండియా జట్టుపై కేవలం 66 బంతుల్లోనే అజేయంగా 175 పరుగులు సాధించాడు. ం20 క్రికెట్ చరిత్రలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు.

## ‘మనం దిగజారిపోయాం- ఇక ఐసీసీ ట్రోఫీలను దొంగతనం చేయాలా‘- పాకిస్థాన్ వరుస ఓటములపై మాజీ క్రికెటర్ ఫైర్

### బంగ్లాదేశ్ తో వన్డే సిరీస్ లో ఓడిన పాకిస్థాన్- తీవ్ర నిరాశలో మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్- పీసీబీపై ఫుల్ ఫుల్ !



పాకిస్థాన్ క్రికెట్ రోజురోజుకూ పతనం అవుతోంది. ఇటీవల టీ20 వరల్డ్ కప్ లో సెమీఫైనల్‌కు చేరడంలో విఫలమైన పాక్, తాజాగా బంగ్లాదేశ్ తో వన్డే సిరీస్ ను కోల్పోయింది. దీంతో పాక్ అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ క్రమంలో సిరీస్ ఓటమిపై పాక్ మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ సొంత జట్టుపైనే తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు. పాకిస్థాన్ క్రికెట్ పూర్తిగా పతనం అవుతుందని, ఇది ఇలాగే కొనసాగితే నెదర్లాండ్స్ పైనా ఓటమి ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని విమర్శించాడు. కనీసం ద్వైపాక్షిక సిరీస్ లు నెగ్గకపోతే ఐసీసీ ట్రోఫీలు ఎలా గెలిచేదంటూ ఫైర్ అయ్యాడు. బంగ్లాతో పాక్ సిరీస్ కోల్పోయిన తర్వాత కమ్రాన్ అక్మల్ ఓ షో లో మాట్లాడుతూ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ‘పాకిస్థాన్ కికెట్ రోజురోజుకూ నాశనం అవుతోంది. వరుసగా సిరీస్ లు ఓడిపోతున్నాం. అయినప్పటికీ పాక్ క్రికెట్ బోర్డు లో మాత్రం ఎవరిపైనా వేటు పడకపోవడం విస్మయం కలిగిస్తోంది. పాకిస్థాన్ క్రికెట్ గురించి ఒక్కసారి ఆలోచించండి. మనం ఏ స్థాయికి దిగజారిపోయామో గమనించండి. పాక్ తో మూడు వన్డేల సిరీస్ ఆడే అవకాశం దక్కితే, మనల్ని ఓడించి తాము కూడా ‘టెస్ట్ హోదా’ సాధించవచ్చని నెదర్లాండ్స్ జట్టు కూడా ఆలోచిస్తుందేమో. మన ఆటను ఒక కామెడీగా మార్చేశారు. ఎవరికి కూడా ఏమాత్రం పట్టింపు లేదు‘ ‘రీసెంట్ గా బంగ్లాదేశ్ తో మ్యాచ్ లో ఎలాంటి ప్రయోగాలు చేశారు? అది బ్యాటింగ్ కు అనుకూలించే పిచ్. అలాంటిది టాస్ నెగ్గితే బ్యాటింగ్ కాకుండా, బౌలింగ్ ఎందుకు తీసుకున్నారు? నిజానికి బంగ్లా 350+ స్కోర్ చేయాల్సింది. కానీ చివర్లో లిట్టన్ దాస్ నెమ్మదిగా ఆడడం వల్ల 290 వద్దే ఆగిపోయింది. ఇది సిరీస్ ను డిసైడ్ చేసే మ్యాచ్. ద్వైపాక్షిక సిరీస్ ల్లోనే విజయం సాధించలేనప్పుడు, ఐసీసీ ఈవెంట్ల కోసం ఎలాంటి ప్రణాళికలు రచిస్తున్నారు. కొంపదీసి ఐసీసీ ట్రోఫీని దొంగిలించాలని ప్లాన్స్ చేస్తున్నారా?‘ అని అక్మల్ ఫైర్ అయ్యాడు. కాగా, మూడు వన్డే సిరీస్ కోసం పాకిస్థాన్ రీసెంట్ గా బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లింది. ఈ సిరీస్ లో తొలి వన్డేలో ఆతిథ్య బంగ్లా నెగ్గగా, రెండో మ్యాచ్ లో పాకిస్థాన్ విజయం సాధించింది. దీంతో సిరీస్ 1-1తో సమం అయ్యింది. ఇక ఇరుజట్ల మధ్య సిరీస్ డిసైడర్ మ్యాచ్ ఆదివారం జరిగింది. ఇందులో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 290-5 స్కోర్ చేసింది. అనంతరం ఛేదనలో పాకిస్థాన్ ఓవర్లన్నీ ఆడి 279 పరుగులకు ఆలౌటైంది. సల్మాన్ అలీ అఘా (106) సెంచరీ వృథా అయ్యింది. దీంతో 2-1 తేడాతో బంగ్లా సిరీస్ ను పట్టేసింది. మళ్లీ కాంట్రవర్సీ వైడ్! ఆదివారం పాక్ - బంగ్లా మధ్య జరిగిన మూడో వన్డేలో అంపైర్ నిర్ణయం కాంట్రవర్సీ అయ్యింది. పాక్ ఇన్నింగ్స్‌లో రిషాద్ హొస్సేన్ ఆఖరి ఓవర్ బౌలింగ్ చేశాడు. ఆ ఓవర్లో అయిదో బంతి లెగ్‌సైడ్ వెళ్లింది. ఆ సమయంలో షాహిన్ అఫ్రిది క్రీజులో ఉన్నాడు. అయితే అంపైర్ కుమార ధర్మసేన ఈ బంతిని వైడ్ బాల్‌గా ప్రకటించాడు. దీంతో వైడ్ బాల్ విషయంలో బంగ్లాదేశ్ రివ్యూ కోరలేదు. అందుకే ఎల్‌బీడబ్ల్యూకు అప్పీల్ చేస్తూ సమీక్ష కోరింది. రిప్లేలో బ్యాట్‌కు బంతి తాకినట్లు తేలింది. దీంతో అంపైర్ దాన్ని లీగల్ బంతిగా తేల్చాడు. దీంతో బంగ్లా రివ్యూ కోల్పోయింది. పాకిస్థాన్ ఆ మ్యాచ్‌లో నెగ్గాలంచే ఒక బంతికి 12 పరుగులు చేయాల్సిన దశలో చివరి బంతికి అఫ్రిది స్టంపౌంట్‌గా పెవిలియన్ చేరాడు. అయితే బంగ్లా తీసుకున్న ఈ రివ్యూ ఇప్పుడు కాంట్రవర్సీగా మారింది. స్క్రీన్ పై రిప్లే చూసిన తర్వాత బంగ్లా ప్లేయర్లు రివ్యూ కోరారని పాకిస్థాన్ ఆరోపిస్తుంది. ఈ మేరకు మ్యాచ్ అనంతరం పాక్ హెడ్ కోచ్ మైక్ హెస్సన్ మ్యాచ్ రెఫరీ నీయాముర్ రషీద్‌కు దీనిపై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

## చెత్త బుట్ట కన్నా హీనంగా చూస్తున్నారు: కోచ్, కెప్టెన్‌పై SRH ప్లేయర్ ఫైర్



ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్ జట్టు మేనేజ్‌మెంట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించాడు. 2025లో వెస్టిండీస్ సిరీస్‌కు తనను జట్టులోకి ఎంపిక చేయలేదని చెప్పిన విధానం తనకు షాక్ ఇచ్చిందని తెలిపాడు. బ్రెండన్ మెకల్లమ్ నుంచి వచ్చిన కాల్ కేవలం ఒక నిమిషం మాత్రమే కొనసాగిందని, అందులో కూడా సరైన వివరణ ఇవ్వలేదని అన్నాడు. “నన్ను ఎందుకు డ్రాప్ చేశారని అడిగితే, ఇంకొకరికి అవకాశం ఇవ్వాలనుకున్నామని చెప్పారు,“ అని ఆయన వెల్లడించాడు. అదే సమయంలో సెలెక్టర్ ల్యూక్ రైట్ తనతో మాట్లాడలేదని, కెప్టెన్ హ్యారీ బ్రూక్ కేవలం ఒక మెసేజ్ మాత్రమే పంపాడని చెప్పాడు. మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీ కూడా తనతో సరైన కమ్యూనికేషన్ చేయలేదని విమర్శించాడు.

“జట్టులో ఉంటేనే విలువ“: లివింగ్‌స్టోన్ వ్యాఖ్యలు..

వింగ్‌స్టోన్ మాటల్లో, జట్టులో ఉన్నప్పుడు మాత్రమే ఆటగాళ్లను పట్టించుకుంటారని, బయటకు వెళ్లిన తర్వాత ఎవరూ గుర్తించరని అన్నాడు. “జట్టులో ఉంటేనే అందరూ మీ గురించి ఆలోచిస్తారు. లేకపోతే ఎవరూ పట్టించుకోరు. ఇది నాకు ఒక ‘లా అనిపించింది“ అని పేర్కొన్నాడు. ఈ అనుభవం తన ఆలోచనా విధానాన్ని మార్చిందని, ఇకపై క్రికెట్‌ను ఆనందంగా ఆడాలని నిర్ణయించుకున్నానని చెప్పాడు.

బ్యాటింగ్ ఆర్డర్ మార్పులపై అసంతృప్తి..

లివింగ్‌స్టోన్ తన కెరీర్‌లో ఎదుర్కొన్న మరో పెద్ద సమస్యగా బ్యాటింగ్ ఆర్డర్ మార్పులను ప్రస్తావించాడు. తాను పైస్థానాల్లో బ్యాటింగ్ చేసినప్పుడు మంచి ప్రదర్శన ఇచ్చినా, కీలక ఆటగాళ్లు తిరిగి వచ్చాక మళ్లీ నెంబర్ 7కి పంపించేవారని చెప్పుకొచ్చాడు. “నెంబర్ 7లో బ్యాటింగ్ చేయడం, ఆరవ బౌలర్‌గా ఉండడం నా టాలెంట్‌కు తగ్గది కాదు. అది వృథా అవుతున్నట్లు అనిపించింది,“ అని స్పష్టం చేయడం గమనార్హం.

ఇండియా టూర్‌లో సహాయం లేకపోవడం..

2025లో ఇండియా టూర్ సమయంలో తాను ఫామ్ కోల్పోయినప్పుడు కోచ్ మెకల్లమ్‌ను సహాయం కోరినప్పటికీ సరైన మార్గదర్శకత్వం అందలేదని తెలిపాడు. “నాకు ‘చిల్ అవ్వాలి‘ అని మాత్రమే చెప్పారు. కానీ పరిస్థితులు బాగోలేకపోతే సహజంగానే మనం ఆందోళన చెందుతాం,“ అని లివింగ్‌స్టోన్ పేర్కొన్నాడు.

2026పై ఆశలు..

ఇప్పుడు తన దృష్టి మొత్తం ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026పై ఉందని లివింగ్‌స్టోన్ తెలిపాడు. ఈసారి సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడనున్న ఆయన, మంచి ప్రదర్శనతో మళ్లీ ఇంగ్లండ్ జట్టులో చోటు సంపాదించాలని ఆశిస్తున్నాడు. ఒక ప్రత్యేక అనుభవం. నేను నా మొదటి సీజన్‌లా మళ్లీ రాణించాలని భావిస్తున్నాను,“ అని ఆయన అన్నాడు. లివింగ్‌స్టోన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇంగ్లండ్ క్రికెట్ వ్యవస్థలో ఉన్న లోపాలను బయటపెట్టాయి. ఆటగాళ్లతో సరైన కమ్యూనికేషన్ లేకపోవడం, పాత్రలపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఆయన ప్రదర్శన ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షించనుంది.

printed , published and owned by DR.B.ANILKUMAR ,@ 407 THARNAKA , HYDERABAD , Telangana state.published at DAIWIK PUBLICATIONS pvt.ltd.printed at SNEHITHA PRINTERS H.NO : 2-6 , Warangal Dist.Telangana state ,EDITOR DR.B.ANILKUMAR ,RNI NO TELTEL/2021/ 81079 , cell : 7702866885 ,vijethatelugudaily@gmail.com